RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 28.01.2025 | సంపుటి : 11 సంచిక : 199 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

పథకాల అమలు షురూ..

రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన గ్రామాల్లో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇండ్లు,కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం

- 4,41,911 మంది రైతు ఖాతాల్లోకి నగదు ఎంపిక చేసిన 577 మండలాల్లోని 9,48,333 ఎకరాలకు గాను రూ.530 కోట్లు జమ
- మొదటిరోజు 15,414 కొత్త రేషన్ కార్డులు జారీ
- పాత కార్డుల్లో అదనంగా 1.03 లక్షల మంది పేర్లు
- 501 గ్రామాల్లో 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'
- 20,336 మంది వ్యవసాయ కూలీలకు నిధులు
- అర్హులందరికీ పథకాలు అందిస్తాం : మంత్రి తుమ్మల

హైదరాబాద్(జనంసాక్షి): రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా జమ చేసే పక్రియ కొనసాగుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తొలి విడతలో మండలానికి ఒక గ్రామంలో రైతు భరోసా సొమ్ము విడుదల చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 4,41,911 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేసినట్లు చెప్పారు. 577 మండలాల్లోని 9,48,333 ఎకరాలకు గాను రూ.530 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రైతు భరోసా ఇస్తామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా మొదటి రోజు 15,414 కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి తుమ్మల చెప్పారు. 'కొత్త కార్డుల్లో 51,912 మందికి ఫిబ్రవరి నుంచి రేషన్ పంపిణీ చేస్తాం. తొలి రోజు మండలానికి ఒక గ్రామం చొప్పున కొత్త రేషన్ కార్డులు జారీ చేశాం. పాత రేషన్ కార్డుల్లో అదనంగా 1.03 లక్షల మంది పేర్లు చేర్చారు. 501 గ్రామాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రారంభమైంది. మొదటి రోజు 20,336 మంది భూమిలేని కూలీలకు నిధులు విడుదలయ్యాయి' అని తెలిపారు. ఈ ఏడాది రైతుభరోసా కింద ప్రతి ఎకరాకు రూ.12 వేలు ఇవ్వనున్నట్లు మంత్రి తుమ్మ లచెప్పారు. భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రెండు విడతలుగా రూ.12 వేలు ఇస్తామని పేర్కొన్నారు. రైతులకు యాసంగికి పెట్టుబడి సాయం, కూలీలకు రూ.6 వేలు ఖాతాల్లో పడతాయని వివరించారు. సోమవారం నుంచి బ్యాంకుల్లో నగదు తీసుకోవచ్చన్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉన్నా రూ.2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేశామన్నారు. అందుకు రూ.21 వేల కోట్లు చెల్లించామని ప్రకటించారు. పథకాల అమలు నిరంతర పక్రియ అని అన్నారు. అర్హులైన అందరికీ పథకాలు వస్తాయని స్పష్టం చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఏడాదికి 3,500 ఇళ్లు మంజూరవుతాయని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామన్నారు.

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'పై హైకోర్టులో పిటిషన్

129 మున్సిపాలిటీల్లో 8లక్షల మందికి పైగా రైతు కూలీలకూ అందించాలని వినతి

వార్త 2లో

గిలైన్ బారె సిండ్రోమ్ కలకలం

మహారాష్ట్రలో కలుషిత ఆహారం, నీటి ద్వారా ఆ బ్యాక్టీరియా వ్యాప్తి

సోలాపుర్‌లో వ్యక్తి మృతి

ముంబయి(జనంసాక్షి): మహారాష్ట్రలో గిలైన్ బారె సిండ్రోమ్ కలకలం సృష్టిస్తోంది. తాజాగా సోలాపుర్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మరణించగా.. అందుకు జీబీఎస్ కారణమని అనుమానిస్తున్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఆ

మిగతా 2లో..

భారత విద్యార్థి అద్భుత ఘనత

ప్రతిభను గుర్తించిన నాసా

తాను గుర్తించిన గ్రహశకలానికి తానే పేరుపెట్టే అవకాశాన్ని కల్పించిన అమెరికా స్పేస్ ఏజెన్సీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఉత్తరప్రదేశ్ నోయిడాకు చెందిన విద్యార్థి దక్ష్ మాలిక్ (14) అరుదైన ఘన తను సాధించాడు. తాను కనుగొన్న గ్రహశకలానికి తనే పేరు పెట్టే

మిగతా 2లో..

మధ్యాహ్న భోజన పథకంలో కీలకమార్పులు అవసరం

తెలంగాణ ప్రభుత్వానికి విద్యా కమిషన్ నివేదిక

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తోన్న మధ్యాహ్న భోజన పథకంలో పలు కీలక మార్పులు చేయాల్సి ఉందని విద్యా కమిషన్ అభిప్రాయపడింది. ఇటీవల పలు ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో వెలుగు చూసిన ఫుడ్ పాయిజన్ ఘటనలను దృష్టిలో ఉంచుకుని.. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలను విద్యా కమిషన్ సందర్శించింది. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, ఆహార నాణ్యత, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పన.. తదితర అంశాలను కమిషన్ పరిశీలించి ఓ నివేదికను రూపొందించింది. సీఎస్ శాంతికుమారికి కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి,

మిగతా 2లో..

వీసీలుగా బ్యూరోక్రాట్స్ నియామకం సరికాదు

తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి): వీసీల నియామకంలో యూజీసీ గైడ్‌లైన్స్‌పై తెలంగాణ ఉన్నత విద్యా మండలి స్పందించింది. గైడ్‌లైన్స్‌ను వ్యతిరేకిస్తున్నట్లు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. వీసీలుగా బ్యూరోక్రాట్స్‌ను నియమించాలనుకోవడం సరికాదన్నారు.

మిగతా 2లో..

ఏం చేయాలో.. ఎలా బతకాలో..!

15 నెలల తర్వాత స్వస్థలాలకు లక్షలమంది పాలస్తీనా పౌరులు తిరుగుబాట

ఇంతకాలం ప్రాణాలు అరచేతపట్టుకొని, శరణార్థి శిబిరాల్లో దాతలు పెట్టిన ఆహారంతో బతుకెళ్లదీసిన వారికి.. సొంతప్రాంతానికి వెళ్లే అవకాశం వచ్చింది.పొట్టచేతపట్టుకొని ఎలా వెళ్లామో అలా తిరిగివస్తుంటే.. తమ స్వస్థలంలో తమకంటూ ఏమైనా మిగిలుందో లేదో తెలియని దుస్థితి వారిని వేధిస్తోంది. సొంతింటికి వచ్చినా.. సర్వం శిథిలంగా మారిన ఆ ప్రాంతంలో ఎలాబతకాలో తెలియని ఆందోళన వారి హృదయాలను బరువెక్కిస్తోంది. ఇవన్నీ ఆలోచించుకుంటూ లక్షలాది మంది గాజా ప్రజలు దక్షిణంవైపు నుంచి ఉత్తరం వైపు బారులు తీరి వస్తున్న దృశ్యాలు ఇవి. ఇజ్రాయెల్ హమాస్ చేసిన దాడితో వారికి కష్టకాలం మొదలైంది. ఆ దాడికి ప్రతిగా ఇజ్రాయెల్ ప్రతిదాడి మొదలుపెట్టడంతో ఉత్తరగాజా నుంచి సుమారు 10 లక్షల మంది దక్షణాదికి తరలివెళ్లిపోయారు శరణార్థి శిబిరాల్లో కాలం వెళ్లదీశారు. సుమారు 15 నెలల తర్వాత పాలస్తీనా పౌరులు తమ సొంత ప్రాంతాలవైపు బారులు తీరారు. చేతిలో తమ వస్తువులు పట్టుకొని పిల్లల్ని చంకనేసుకొని మళ్లీ ఇలాంటి పరిస్థితి రాకూడదనుకుంటూ నడుచుకుంటూ వస్తున్న దృశ్యాలు హృదయాలను మెలిపెట్టేస్తున్నాయి.

గద్దర్‌పై బండి సంజయ్ వివాదాస్పద వ్యాఖ్యలు

ఆయనకు పద్మ అవార్డు ఎలా ఇస్తాం?

నక్సలైట్లతో కలసి వందలాదిమంది బిజెపి నాయకులను హత్యచేశారు

కేంద్ర పథకాల పేర్లు మార్చితే ఊరుకోమన్న కేంద్రమంత్రి

కరీంనగర్(జనంసాక్షి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డుల విషయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తామంటూ ఆయనను అవమానించేలా ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'పద్మ' అవార్డుల కోసం జాబితాను పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పంపాలని, గద్దర్‌కు ఎట్లా పద్మ అవార్డు ఇస్తామని ఆయన ప్రశ్నించారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు పద్మ అవార్డ్ ఇవ్వకపోవడంపై తెలంగాణ ప్రభుత్వం చేస్తోన్న విమర్శలకు కేంద్రమంత్రి, బీజేపీ కీలక నేత బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. ఎంతో మంది బీజేపీ కార్యకర్తలను, ఎన్ కౌంటర్లలో పోలీసులను పొట్టన బెట్టుకున్న వ్యక్తి గద్దర్ అని.. అలాంటి వ్యక్తికి పద్మ అవార్డు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మావోయిస్టుగా పని చేసి ఎంతో మంది

మిగతా 2లో..

దళితుల్ని, ఆదివాసులను

బానిసలుగా మార్చే కుట్ర

- గళం విప్పితే జైల్లో పెడుతున్నారు:రాహుల్
- భారత విద్యారంగం సర్టిఫికేట్ల వ్యవస్థగా మారిందని ఆగ్రహం

భోపాల్(జనంసాక్షి): దేశంలో దళితుల్ని, ఆదివాసులను బానిసలుగా మార్చే కుట్ర జరుగుతోందని రాహుల్ అన్నారు. భాజపా , ఆర్ఎస్ఎస్‌లపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో స్వాతంత్ర్యం పూర్వం నాటి పరిస్థితులను కోరుకుంటున్నాయని ఆరోపించారు. ప్రజలను మరోసారి బానిసలుగా మారుస్తున్నారని ఆరోపణలు చేశారు. మధ్యప్రదేశ్‌లోని మహులో నిర్వహించిన సభలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ రాజ్యాంగంపై దాడికి పాల్పడుతున్నారు. భాజపా, ఆర్ఎస్ఎస్ నుంచి కాంగ్రెస్ రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నం చేస్తోంది. దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం నాటి

మిగతా 2లో..

ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి

న్యూఢిల్లీ(జనంసాక్షి): బీజేపీ పాలిత రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి అమల్లోకి వచ్చింది. దీంతో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత యూసీసీ ని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ అవతరించింది. ఈ సందర్భంగా ప్రతి ఏటా జనవరి 27ని ఉత్తరాఖండ్‌లో యూసీసీ డేగా జరుపుకోనున్నట్లు సీఎం ప్రకటించారు. గతేడాది ఫిబ్రవరి 7న యూసీసీ బిల్లుకు ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఆమోదం పొందింది.

మిగతా 2లో..

ఆర్టీసీలో సమ్మె సైరన్

హామీల అమలుకు జెఎసి సమ్మె నోటీసు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నేతలు ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, 2 పీఆర్‌సీల అమలు, సీసీఎస్, పీఎఫ్ డబ్బులు రూ.2,700 కోట్లు చెల్లింపు తదితర డిమాండ్లను యాజమాన్యం ముందు ఉంచారు. డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మెకు దిగుతామని నోటీసుల్లో పేర్కొన్నారు. ' మేనిఫెస్టోలోని అంశాలను ప్రభుత్వం అమలు చేయాలి. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, నిర్వహణను ప్రైవేటు కంపెనీలు చేస్తున్నాయి. వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ట్రేడ్ యూనియన్లకు ఎన్నికలు నిర్వహించడం లేదు. యూనియన్లు రద్దు చేసి, కార్మికులకు పనిగంటలు పెంచారు.' అని జేఏసీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున కార్మిక సంఘాల నేతలు బస్ భవన్ వద్దకు చేరుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు

మిగతా 2లో..

వక్ఫ్ సవరణ బిల్లుకు జేపీసీ ఆమోదం

2లో

తిరుపతన్నకు బెయిల్

2లో

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

ట్రాలీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

2లో

11 మంది కూలీలకు తీవ్రగాయాలు

కమలాపూర్ మండల అంబాల వద్ద ప్రమాదం

అక్రమ వలసదారుల్లో

గుబులు

- వారిపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్
- తనిఖీల్లో గురుద్వారాలను సైతం వదలని అమెరికా అధ్యక్షుడు
- తొలుత వ్యతిరేకించినా.. మోకరిల్లిన కొలంబియా

న్యూయార్క్(జనంసాక్షి): చెప్పినట్టుగానే అక్రమ వలసదారులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో ఆయన అనుసరిస్తోన్న విధానాలపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. అక్రమ వలసదారుల్ని గుర్తించే క్రమంలో గురుద్వారాలనూ వదలడం లేదు. హెమ్‌ల్యాండ్ సెక్యూరిటీకి చెందిన అధికారులు న్యూయార్క్, న్యూజెర్సీల్లోని ఈ ప్రార్థనా మందిరాల్లోనూ తనిఖీలు చేయడంపై సిక్కు సంస్థలు మండిపడుతున్నాయి. గురుద్వారాల పవిత్రతకు ఈ చర్య ముప్పుగా పరిణమించిందని ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. వేర్పాటువాదులు, అధికారిక పత్రాలు లేని వలసదారులు వీటిని ఉపయోగించుకోవచ్చంటూ అమెరికా స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. "ట్రంప్ యంత్రాంగం ఇప్పటివరకూ వందలమంది అక్రమ వలసదారులను అరెస్టు చేసింది. వీరంతా ఉగ్రవాదం, మాదకద్రవ్యాల రవాణా, లైంగిక నేరాలు వంటి కేసుల్లో నిందితులుగా ఉన్నవారే. ఇక, అమెరికా చరిత్రలోనే అతి పెద్ద బహిష్కరణ ఆపరేషన్ కొనసాగుతోంది. సైనిక విమానాల్లో వందల మంది అక్రమ వలసదారులను దేశం నుంచి బయటకు పంపించేశాం. ఎన్నికల్లో ట్రంప్ తాను ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నారు" అని ఇదివరకు వైట్‌హౌస్ వెల్లడించింది. మరోవైపు, అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఎందుకంటే అది పలురకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి

మిగతా 2లో..

ట్రంప్‌కు మోదీ ఫోన్‌కాల్

ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ

వార్త 2లో

మే 15 నుంచి సరస్వతీ నది పుష్కరాలు

మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్(జనంసాక్షి): అత్యంత వైభవంగా సరస్వతీ నది పుష్కరాలు నిర్వహిస్తామని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ మేరకు పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పుష్కరాల నిర్వహణ కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి కొండా సురేఖ ధన్యవాదాలు తెలిపారు. స్నాన ఘట్టాలు, డ్రైనేజీల నిర్మాణం, రోడ్ల విస్తరణకు ఈ నిధులు వినియోగించనున్నారు.

మేనిఫెస్టోల జాతర

రెండవ జాబితాను విడుదల చేసిన ఆమ్‌ఆద్మీ పార్టీ

ఢిల్లీలో వేడెక్కిన రాజకీయాలు

2లో

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
28.01.2025

మధ్యాహ్న భోజన పథకంలో కీలకమార్పులు చేయాలి

సభ్యులు నివేదిక అందించారు.నివేదికలో ప్రధానంగా మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి మెనూలో చేయాల్సిన మార్పులపై నివేదికలో పలు సూచనలు చేసింది. "వారం వారం బిల్లులను చెల్లించాలి. ఇంటర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలి. రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందించాలి. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులకు అవసరమైన కాస్మొటిక్స్, ఇతరత్రా సామగ్రిని తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్‌స్ట్రాక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలి. ఇలా సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ విధానం వల్ల విద్యార్థులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించవచ్చు" అని నివేదికలో కమిషన్ పేర్కొంది.

తిరుపతన్నకు బెయిల్

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో అత్యంత సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇన్నాళ్లు అరెస్ట్‌లు, దర్యాప్తులు, విచారణల తర్వాత– ఈ కేసులో ఫస్ట్ బెయిల్ వచ్చింది. మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ లభించింది. షరతులతో కూడిన బెయిల్ ను సుప్రీంకోర్టు మంజూరు చేసింది. ట్యాపింగ్ కేసులో 10 నెలలుగా జైల్లో గడిపారు మాజీ పోలీస్ అధికారి తిరుపతన్న బెయిల్ అనంతరం విడుదల కానున్నారు. రాజకీయ నేతల ఆదేశాల మేరకు అందరి ఫోన్లను ట్యాప్ చేశారని, హైకోర్టు జడ్జిల ఫోన్లు కూడా ఇందులో ఉన్నాయని మాజీ ఏఎస్పీ తిరుపతన్నపై ఆరోపణలు ఉన్నాయి. ఆధారాలు చెరిపేయడంలోనూ ఆయనదే కీలక పాత్ర అనే అభియోగాలు కూడా ఉన్నాయి. 2023 డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు రాగానే ఆధారాలు ధ్వంసం చేసిట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో అరెస్టైన తిరుపతన్న పది నెలలుగా జైలులో ఉండగా.. తాజాగా ఆయనకు బెయిల్ ఇచ్చింది సుప్రీం కోర్ట్. వాస్తవానికి ఫోన్ ట్యాపింగ్ కేస్ లో అరెస్ట్ అయ్యిన వారిలో మొదటి వ్యక్తి తిరుపతన్న.. ఫోన్ ట్యాపింగ్ కేసులో నలుగురిని గత ఏడాదిలో హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.. అడిషనల్ ఎస్పీ ప్రణీత్ రావ్, అడిషనల్ ఎస్పీ భుజంగ రావ్, అడిషనల్ ఎస్పీ తిరుపతన్న, మాజీ టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావ్ లను పోలీసులు అరెస్ట్ చేసారు. దాదాపు 10 నెలలకు పైగా జైల్ లోనే ఉన్నారు. బయటికి వచ్చేందుకు అనేక సార్లు బెయిల్ పిటిషన్ లు దాఖలు చేసినప్పటికీ రిజెక్ట్ అవుతూ వచ్చాయి. హై కోర్టులో పలుమార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ ఇక్కడ ఊరట లభించలేదు. తాజాగా సుప్రీం కోర్టును ఆశ్రయించగా అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తిరుపతన్నను గత ఏడాది 24న ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో అదే సమయంలో మరో అడిషనల్ ఎస్పీ భుజంగరావు ఉన్న సైతం పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ అనేకసార్లు లోయర్ కోర్టుతో పాటు హైకోర్టులోను బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు ఎవరికీ పూర్తిస్థాయిలో బెయిల్ మంజూరు కాలేదు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై దేశ వ్యాప్తంగా చర్చ జరిగింది. రాజకీయ ప్రత్యర్థులు, హైకోర్టు జడ్జిలు, జర్నలిస్టుల ఫోన్లను ట్యాప్ చేసినట్టు పోలీసులు ఆరోపణలు మోపారు.. వీటికి సంబంధించి కోర్టులో ఇంకా కేసులు నడుస్తూనే ఉన్నాయి. ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ పొందిన మొదటి వ్యక్తి తిరుపతన్న.. సుప్రీం కోర్టు ఆదేశాలతో జైలు నుంచి విడుదల కానున్నారు.

భారత విద్యార్థి అద్భుత ఘనత

అవకాశాన్ని నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ అతడికి ఇచ్చింది. నాసాతో భాగస్వామి అయిన ఇంటర్నేషనల్ ఆస్టరాయిడ్ డిస్కవరీ ప్రాజెక్టు కింద 2023లో దక్ష్ మలిక్ తన స్నేహితులతో కలిసి ఓ గ్రహశకలాన్ని గుర్తించాడు. ఇంటర్నేషనల్ ఆస్టరాయిడ్ డిస్కవరీ ప్రాజెక్ట్ కింద దక్ష్ తన ఇద్దరు స్నేహితులకు 2022లో గ్రహశకలాన్ని కనుగొనేందుకు అవకాశం లభించింది. వారి స్కూల్‌కు చెందిన ఆస్ట్రోనమీ క్లబ్ నాసా ఆధ్వర్యంలోని ఇంటర్నేషనల్ ఆస్ట్రోనమికల్ సెర్చ్ కొలాబరేషన్‌కు మెయిల్ పంపడంతో వారికి ఈ అవకాశం లభించింది. దీంతో ఏడాదిన్నరపాటు అంతరిక్షాన్ని శోధించి 2023లో ఈ గ్రహశకలాన్ని కనుగొన్నారు. నాటి నుంచి దాని పేరు 2023 ఓజీ40గా కొనసాగుతోంది. ప్రస్తుతం దానికి శాశ్వత పేరును పెట్టే అవకాశాన్ని నాసా కల్పించింది.దీనిపై దక్ష్ మాలిక్ స్పందిస్తూ చిన్ననాటి నుంచి తనకు అంతరిక్షం గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి ఉండేదన్నాడు. గ్రహాలు, సౌర వ్యవస్థకు సంబంధించిన నేషనల్ జియోగ్రాఫిక్ డాక్యుమెంటరీలు తరచూ చూసేవాడినని పేర్కొన్నాడు. తాను ఎన్నాళ్లగానో కన్న కల ఇప్పుడు సాకారం అయ్యిందని ఆనందం వ్యక్తం చేశాడు. దీన్ని కనుగొనడానికి పని చేస్తున్న క్రమంలో తాను నాసాలో పని చేస్తున్న శాస్త్రవేత్తలా ఊహించుకునేవాడినని తెలిపాడు. ప్రస్తుతం తమ మనసులో 'డిస్ట్రాయర్ ఆఫ్ ది వరల్డ్,' 'కౌంట్‌డౌన్' వంటి పేర్లు ఉన్నాయని తెలిపాడు.

గిలైన్ బారె సిండ్రోమ్ కలకలం

బ్యాక్టీరియా సోకుతుంది. దాని బారిన పడిన వ్యక్తుల్లో డయేరియా, పొత్తికడుపు నొప్పి, జ్వరం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఆ ఇన్ఫెక్షన్‌కు రోగనిరోధక వ్యవస్థ ప్రతిస్పందించే క్రమంలోనే జరిగే పొరపాటే కొందరిలో జీబీఎస్‌కు దారితీస్తుంది. ప్రతీ వెయ్యి మందిలో ఒకరికే ఈ పరిస్థితి ఎదురవుతుంది.పుణెలో ఇప్పటివరకు నమోదైన జీబీఎస్ కేసుల సంఖ్య 101కి చేరుకుంది. వారిలో 16 మంది వెంటిలేటర్ మీద చికిత్స పొందుతున్నారు. మృతిచెందిన వ్యక్తి కూడా పుణెలోనే చికిత్స పొందాడు. బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్ కారణంగా బలహీన రోగనిరోధక శక్తి కలిగిఉన్న వ్యక్తులు ఈ జీబీఎస్ బారినపడే అవకాశాలు ఉంటాయని వైద్యులు వెల్లడించారు. శరీరానికి సోకిన ఇన్ఫెక్షన్‌కు ప్రతిస్పందించే రోగ నిరోధక వ్యవస్థ పొరపాటున నరాలపై దాడి చేసే అరుదైన పరిస్థితి ఇది. ఆ రుగ్మత బారినపడిన వారికి ఒళ్లంతా తిమ్మిరిగా అనిపించడం, కండరాలు బలహీనంగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. డయేరియాకు కారణమయ్యే కాంపిలోబ్యాక్టర్ జెజునీ బ్యాక్టీరియా జీబీఎస్‌కు కారణం కావొచ్చని వైద్యులు అనుమానిస్తున్నారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని, జీబీఎస్ అంటువ్యాధి కాదని, చికిత్సతో నయం చేయొచ్చని వైద్యులు వెల్లడించారు. బాధితుల్లో 80 శాతం మంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత ఆరు నెలల్లో స్వతహాగా నడవగలరు. మరికొంతమందికి మాత్రం ఆ సమయం ఏడాది లేక అంతకంటే ఎక్కువ కూడా కావొచ్చు. ఈ చికిత్స ఖర్చుతో కూడుకున్నది. ఇమ్యునోగ్లోబిన్ ఇంజెక్షన్లు ఒక్కొక్కటి వేలల్లో ఉంటాయి. దీనిని దృష్టిలోపెట్టుకొని మహారాష్ట్ర ప్రభుత్వం రోగులకు ఊరట కలిగించే ప్రకటన చేసింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా జీబీఎస్ చికిత్స అందిస్తామని రాష్ట్ర ఆర్థిక మంత్రి అజిత్ పవార్ వెల్లడించారు.

కిడ్నీ రాకెట్ కేసులో కీలక విషయాలు వెలుగులోకి..

9మందిని అరెస్టు చేసిన పోలీసులు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ వ్యాప్తంగా సంచలనం రేపిన కిడ్నీ రాకెట్ కేసులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఎల్బీనగర్ వేదికగా అలకనంద హాస్పిటల్‌లో గుట్టుగా సాగుతున్న కిడ్నీ మార్పిడి రాకెట్ గుట్టు తేల్చారు పోలీసులు. ఈ కేసులో ఇప్పటివరకు 9 మందిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో చాలామంది డాక్టర్లు కూడా ఉన్నారు. విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇక్కడ ఎలాంటి ఇన్కమ్ లేకపోవడంతో కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ చేసి డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా డాక్టర్ అవినాష్, డాక్టర్ సుమంత్ ఇద్దరూ కలిసి భారీగా కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆపరేషన్లు చేశారు. మొదట డా. అవినాష్ సైదాబాద్‌లో జననీ హాస్పిటల్‌ను స్థాపించాడు.

దళితుల్ని, ఆదివాసులను బానిసలుగా మార్చే కుట్ర

పరిస్థితులను భాజపా, ఆర్ఎస్ఎస్ మళ్లీ కోరుకుంటున్నాయి. దళితులు, వెనుకబడిన వర్గాలు, ఆదివాసీలు, పేదలను మరోసారి బానిసలుగా మారుస్తున్నాయి. రాజ్యాంగం మారిన రోజు ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలు ఉండవు" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా రాహుల్ దేశ విద్యా వ్యవస్థ గురించి ప్రస్తావించారు. "ప్రైవేటు వ్యవస్థలో విద్య, వైద్య రంగాల యాజమాన్యం ఎవరి చేతిలో ఉంది..? మన భారత విద్యా రంగం స్టాంపులు, సర్టిఫికేట్ల వ్యవస్థగా మారింది. సర్టిఫికేట్లు వస్తే.. ఉద్యోగాలు వస్తాయని కోట్లాది మంది ప్రజలు భావిస్తున్నారు. ఇదంతా పచ్చి అబద్ధం. అలా చేస్తే మీ పిల్లలు దేశంలో ఎలాంటి ఉపాధి పొందలేరు. ఈ బిలియనీర్లు దేశ ఉపాధి వ్యవస్థను నాశనం చేస్తున్నారు" అని ఆరోపించారు. మరోవైపు, ఆర్ఎస్ఎస్ నేతలపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విరుచుకుపడ్డారు. "ప్రస్తుతం హస్తం పార్టీని తప్పుపడుతున్న ఆర్ఎస్ఎస్ నేతలు స్వాతంత్ర్యం కోసం ఎటువంటి పోరాటం కూడా చేయలేదు. పేదరికం, నిరుద్యోగం నుంచి ప్రజలు విముక్తి పొందాలంటే రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి" అని ప్రజలకు పిలుపునిచ్చారు.

గద్దర్‌పై బండి సంజయ్ వివాదాస్పద వ్యాఖ్యలు

ప్రాణాలు తీసిన వారిలో గద్దర్ ఒకరని.. ఆయనకు పద్మ అవార్డు ఇచ్చేదే లేదని కుండబద్దలు కొట్టారు.సోమవారం కరీంనగర్లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ నక్సలైట్ కాదన్నారు. మావోయిస్టు భావజాలం వేరు.. నక్సలైట్‌గా పని చేయడం వేరని పేర్కొన్నారు. నక్సలిజంతో ఎంపీ ఈటల రాజేందర్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. అలాగే.. నంది అవార్డుల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలను కుంటున్న గద్దర్ అవార్డులు మా వాళ్ళు తీసుకోరని బండి సంజయ్ స్పష్టం చేశారు. గద్దర్ కాంగ్రెస్, టీడీపీకి చెందిన నేతలను హతమార్చారని.. ఆ విషయం సీఎం రేవంత్ రెడ్డికి తెల్వదని అన్నారు. గద్దర్‌కు వ్యతిరేకంగా మాట్లాడానని.. నా దిష్టి బొమ్మ తగలబెడితే నా ఆయుష్షే పెరుగుతుందని సెటైర్ వేశారు కేంద్రమంత్రి బండి సంజయ్. 'గద్దర్ ఎంత మంది బీజేపీ కార్యకర్తలను కాల్చి చంపించారో తెలియదా..?' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన చేసిన వందల మంది బీజేపీ కార్యకర్తలను నక్సలైట్లతో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్ అని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ సెంటిమెంట్‌తో ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తోందని, తెలంగాణ సెంటిమెంట్‌తో ఎవరు లాభపడ్డారో.. ఎవరు బలైపోయారో ప్రజలందరికీ అర్థమైందని అన్నారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన పద్మ అవార్డుల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాము గోరటి వెంకన్న, గద్దర్, జయధీర్ తిరుమలరావు, చుక్కా రామయ్య, అందెశ్రీ పేర్లు సిఫార్సు చేసినా కేంద్రం పట్టించుకోలేదని రేవంత్ విమర్శించారు. ఏపీకి 5 అవార్డులు ఇచ్చారని, తెలంగాణకు నాలుగైనా ఇవ్వాల్సిందని అన్నారు. పద్మ అవార్డుల విషయంలో చూపిన వివక్షపై కేంద్రానికి లేఖ రాస్తానని సీఎం అన్నారు. సీఎం వ్యాఖ్యలపై తాజాగా బండి సంజయ్ ఈ హాట్ కామెంట్స్ చేశారు. పద్మ అవార్డులు అర్హులకే వచ్చాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మంచి పేర్లు పంపితే కేంద్రం పరిశీలిస్తుందని, ఏ పేరు పడితే ఆ పేరు పంపితే పద్మ అవార్డులు ఇవ్వరని సంజయ్ అన్నారు. 'గద్దర్‌కి పద్మ అవార్డు ఎలా ఇస్తాం..? ఆయన భావజాలం ఏంటి..? బరాబర్ గద్దర్‌కు ఇవ్వం. ఎందరో బీజేపీ నేతలను చంపిన వ్యక్తుల్లో గద్దర్ ఒకరు. పద్మ అవార్డులు స్థాయి ఉన్న వారికే ఇస్తాం. బీజేపీ కార్యకర్తలను, పోలీసులను చంపిన వారికి అవార్డులు ఎలా ఇస్తాం..? అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

కేంద్ర పథకాల పేర్లు మార్చితే ఊరుకోం

మీ పథకాలకు ఏమైనా పేర్లు పెట్టుకోండి.. కానీ కేంద్ర పథకాలకు పేర్లు మార్చితే ఊరుకోమని కేంద్ర మంత్రి బండిసంజయ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర సంక్షేమ పథకాల పేర్లను మార్చితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కళ్యాణ్ యోజన వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా కేంద్రమే నేరుగా ప్రజలకే అందిస్తుందన్నారు. పరిస్థితి అంత వరకు తీసుకురావొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో పేదలకు ఎట్టి పరిస్థితిల్లోనూ తాము అన్యాయం చేయబోమని స్పష్టం చేశారు. ప్రజలందరికీ ఉచితంగా బియ్యం కేంద్రమే ఇస్తోంది కదా... గరీబ్ కళ్యాణ్ యోజన అని పేరు పెడితే తప్పేంది? ప్రధాని ఫోటో ఎందుకు పెట్టరు అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఖర్చయ్యే సంక్షేమ పథకాలకు ఎవరి పేరు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని.. కాంగ్రెస్‌కు నచ్చితే ఒసామా బిన్ లాడెన్, దావూద్ ఇబ్రహీం పేర్లు పెట్టుకున్నా అభ్యంతరం లేదంటూ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తిగా సహకరిస్తోందన్నారు. గత 10 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా కేంద్రం ఖర్చు చేసిందని తెలిపారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే అని స్పష్టం చేశారు. రైతు భరోసా, కమ్యూనిటీ హాల్, స్మశాన వాటిక, వీధి దీపాలు, రోడ్ల పైసలన్నీ కేంద్ర ప్రభుత్వానివే అని చెప్పుకొచ్చారు. ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేనేలేదన్నారు. "మండలానికి ఒక గ్రామంలోనే నాలుగు పథకాలకు ఎంపిక చేసి లబ్ది చేయడమేంది? మిగిలిన గ్రామాల ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లేయలేదా? రాష్ట్ర ప్రజలకు ఇంత దుర్మార్గంగా చీటింగ్ చేస్తారా? రాష్ట్ర ప్రజలందరికీ లబ్ది చేకూరుస్తామని చెప్పి మండలానికి ఒక గ్రామానికి లబ్ది చేకూర్చడం నీచం. కాంగ్రెస్ నేతల జేబుల నుంచి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తున్నారా? లేక పాకిస్తాన్..బంగ్లాదేశ్ నుంచి తెచ్చి ఖర్చు చేస్తున్నారా? ప్రజలు కట్టిన పన్నుల తోనే కేంద్రమైనా, రాష్ట్రమైనా ఖర్చు చేస్తోంది కదా? గతంలో పీఎం ఆవాస్ యోజన పేరుతో 2 లక్షల 40 వేల ఇండ్లను కేంద్రం మంజూరు చేస్తే... కేసీఆర్ ఒక్క ఇల్లు కట్టకుండా ప్రజలను రోడ్డున పడేసింది నిజం కాదా? అన్నారు

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'పై హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ ప్రభుత్వ పథకం 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'పై హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. నారాయణపేటకు చెందిన గవినోళ్ల శ్రీనివాస్ పిటిషన్ వేశారు.భూమి లేని రైతు కూలీలలకు ఏటా రూ.12వేలు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం రూపొందించిందని.. మున్సిపాలిటీల పరిధిలో ఉన్న రైతు కూలీలకు డబ్బులు ఇవ్వడం లేదని పిటిషనర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 129 మున్సిపాలిటీల్లో 8లక్షల మందికి పైగా రైతు కూలీలు ఉన్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోర్టుకు తెలిపారు. గ్రామాల్లో ఉన్న రైతు కూలీలకు ఇచ్చి మున్సిపాలిటీల్లోని వారికి ఇవ్వకపోవడం సరికాదన్నారు. రైతు కూలీలు ఎక్కడ ఉన్నా అందరూ సమానమేనని చెప్పారు. కేవలం గ్రామాల్లో ఉన్న రైతు కూలీలకే ఈ పథకం వర్తింపజేయడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమన్నారు. అనంతరం హైకోర్టు స్పందిస్తూ 4 వారాల్లో మున్సిపాలిటీల్లోని రైతు కూలీలను 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకంలోకి తీసుకోవాలని ఆదేశించింది. ఈమేరకు సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసింది.

వీసీలుగా బ్యూరోక్రాట్స్ నియామకం సరికాదు

యూజీసీ గైడ్‌లైన్స్.. ప్రైవేటైజేషన్‌ను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. 'యూజీసీ గైడ్‌లైన్స్ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయి. రాష్ట్ర యూనివర్సిటీలను దెబ్బతీసేలా కేంద్రం నిర్ణయాలున్నాయి. వర్సిటీలు స్వతంత్రంగా ఉండాలి. ఈ అంశంపై మేం ఒక కమిటీ వేసుకున్నాం. కమిటీ ఇచ్చే రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తాం. వర్సిటీల్లో ఖాళీల భర్తీపై త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం' అని బాలకృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్రాల పరిధిలోని విశ్వవిద్యాలయాల మార్గదర్శకాల్లో మార్పులు చేస్తామంటూ యూజీసీ రాష్ట్రాలకు ప్రతిపాదనలు పంపిన సంగతి తెలిసిందే. వీటి ప్రకారం వీసీలను నియమించే అధికారాలు కేంద్ర ప్రభుత్వానికి దఖలు పడతాయి.

ఆర్టీసీలో సమ్మె సైరన్

గడుస్తున్నప్పటికీ.. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై స్పందించడం లేదన్నారు. ఆర్టీసీ కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నారని సంఘాల నేతలు మండిపడ్డారు. ఇలానే నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వానికి తమ తడాఖా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ఐదేండ్ల తర్వాత సమ్మె చేయడం ఇదే తొలిసారి అని గుర్తు చేశారు. ఆర్టీసీని ప్రయివేటుపరం చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఒక వేళ అదే కనుక జరిగితే.. వేలాది మంది ఆర్టీసీ కార్మికులు తమ ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి సర్కార్ నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న ప్రతిపాదనను మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున కార్మిక సంఘాల నేతలు బస్ భవన్ వద్దకు చేరుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు.

ట్రాలీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- 11 మంది కూలీలకు తీవ్రగాయాలు

- కమలాపూర్ మండల అంబాల వద్ద ప్రమాదం

కమలాపూర్(జనంసాక్షి):హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని అంబాల వద్ద సోమవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు, ట్రాలీ ఆటో ఢీకొన్న ఘటనలో 11 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో ట్రాలీ ఆటోలో 22 మంది కూలీలు ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే క్షతగాత్రులను అంబులెన్సుల్లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు జేపీసీ ఆమోదం

న్యూఢిల్లీ(జనంసాక్షి):వక్ఫ్ సవరణ బిల్లు పరిశీలన కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది. విపక్ష ఎంపీలు సహా ఇతరులు మొత్తంగా 44 మార్పులు సూచించగా..14 సవరణలను కమిటీ ఆమోదించినట్లు ప్యానెల్ ఛైర్మన్ జగదాంబిక పాల్ వెల్లడించారు. ఈ సవరణలు చట్టాన్ని మరింత శక్తివంతంగా మారుస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.కమిటీలో ఎన్డీయే సభ్యులు సూచించిన మార్పులకు ఆమోదం లభించగా.. విపక్షాలు సూచించిన మార్పులు తిరస్కరణకు గురయ్యాయి. వీటిపై ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో కమిటీ పనిచేయలేదని విపక్ష సభ్యులు ఆరోపించారు. మొత్తంగా జేపీసీ సూచించిన 14 ప్రతిపాదనల ఆమోదానికి సంబంధించి జనవరి 29న ఓటింగ్ జరగనుంది. జనవరి 31న తుది నివేదిక లోక్‌సభకు అందజేయనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం.

ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి..

2024, మార్చి 11 ఆ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఓకే చెప్పిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మార్చి 12న నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి పౌర స్మృతి 2024 చట్టాన్ని ఈ ఏడాది జనవరిలో పూర్తిగా అమలు చేయనున్నట్లు అందులో పేర్కొన్నారు. దీని అమలు కోసం ప్రత్యేక పోర్టల్, మొబైల్ యాప్ ఏర్పాటు చేశారు. మహిళలు, పిల్లల సాధికారతే లక్ష్యంగా యూసీసీ అమలు ఉంటుందని సీఎం ధామి గతంలో తెలిపారు. కాగా, పోర్చుగీస్ పాలనలో ఉన్నప్పటి నుంచి గోవాలో ఉమ్మడి పౌరస్మృతి అమల్లో ఉంది.

అక్రమ వలసదారుల్లో గుబులు

ఉందని ఇప్పటికే భారత్ స్పష్టం చేసింది. అయితే, వీసా గడువు ముగిసినా లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికా/ప్రపంచంలో ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకువచ్చే వీలు కల్పిస్తామని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది. సంబంధిత డాక్యుమెంట్లను తమతో పంచుకుంటే వాటిని పరిశీలించి స్వదేశానికి తీసుకువస్తామని పేర్కొంది.అమెరికాలో ఉన్న అక్రమ వలసదారులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తూ..ప్రత్యేక విమానాల్లో వారిని స్వదేశాలకు పంపించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. అమెరికా సార్వభౌమత్వాన్ని పరిరక్షించడానికి అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. యూఎస్‌లో చట్టవిరుద్ధంగా ఆశ్రయం పొందుతున్న తమ పౌరులను వెనక్కి పిలుపించుకోవడానికి ప్రపంచ దేశాలు తగిన చర్యలు తీసుకొని మాకు సహకరించాలి' అని వైట్‌హౌస్ పేర్కొంది. అయితే ఈ చర్యలను ముందుగా వ్యతిరేకించిన కొలంబియా అనంతరం వెనక్కి తగ్గి అగ్రరాజ్యం పెట్టిన నిబంధనలకు అంగీకరించిందని వైట్‌హౌస్ పేర్కొంది. కొలంబియా వెనక్కి తగ్గి స్వదేశానికి తిరిగి వచ్చిన పౌరులను ఆహ్వానించడంతో తాము ఆ దేశంపై విధించిన సుంకాలు, పలు ఆంక్షలను నిలిపివేయనున్నట్లు అమెరికా ప్రకటించింది. 'అమెరికాలో ఉన్న అక్రమ వలసదారులను ప్రత్యేక విమానాల్లో వారివారి స్వదేశాలకు పంపడానికి అగ్రరాజ్యం అనుసరిస్తున్న తీరుపై పలు దేశాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇలా వలసదారులను తీసుకొచ్చే విమానాలను తమ దేశంలోకి అనుమతించమని కొలంబియా తేల్చి చెప్పింది. 'కొలంబియా వలసదారులను తీసుకువచ్చే అమెరికా విమానాలను దేశంలోకి ప్రవేశించకుండా నిషేధిస్తున్నా' అని ఆ దేశాధ్యక్షుడు గుస్తావో పెట్రో ఇటీవల పేర్కొన్నారు. వలసదారులను గౌరవంగా పంపించేందుకు అమెరికా నిబంధనలు రూపొందిస్తేనే వాటిని అనుమతిస్తామన్నారు. ఇప్పటికే అమెరికా సైనిక విమానాలను వెనక్కి పంపించినట్లు చెప్పారు. వలసదారులను నేరస్థులుగా చిత్రీకరించకుండా, అమెరికా పౌర విమానాల్లో పంపిస్తేనే వాటిని తమ దేశంలోకి అనుమతిస్తామని పెట్రో పేర్కొన్నారు.దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కొలంబియా ఉత్పత్తులపై సుంకాలు 50 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. కొలంబియన్ ప్రభుత్వ అధికారుల వీసాలను వెంటనే రద్దు చేస్తానని అన్నారు. ఈ చర్యలు ఆరంభం మాత్రమే అని.. తమ నిబంధనలను పాటించి ప్రపంచ దేశాలు తమ పౌరులను తిరిగి వెనక్కి ఆహ్వానించకపోతే వారిపై మరిన్ని సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. మరోవైపు అమెరికా అనుసరిస్తున్న విధానంపై బ్రెజిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలా వలసదారుల చేతులకు సంకెళ్లు వేసి ప

ప్రజా సమస్యలపై ఐక్య పోరాటాలకు సన్నద్ధం

- కనీస మద్దతు ధర చట్టం పట్టని బిజెపి, కాంగ్రెస్
- పేదలకు స్థలాలిచ్చి ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలు ఇవ్వాలి
- కోటిన్నర మంది కార్మికులకు కనీస వేతనాలు కరువు
- రాష్ట్ర మహాసభలో ప్రజా సమస్యలపై చర్చించాం
- పలు కీలక అంశాలపై తీర్మానాల ఆమోదం
- సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. వీరయ్య, మల్లు లక్ష్మి

సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 27(జనం సాక్షి) : రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై రాష్ట్ర మహాసభలో చర్చించి పలు కీలక అంశాలపై తీర్మానాలను ఆమోదించామని సిపిఐఎం కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. విరయ్య మల్లు లక్ష్మి తెలిపారు. సంగారెడ్డిలోని మల్లు స్వరాజ్యం ప్రాంగణం(గోకుల్ గార్డెన్) లో ఈ నెల 25ు 28 తేదీలలో జరుగుతున్న రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా మీడియా పాయింట్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నాలుగు రోజులపాటు జరుగుతున్న రాష్ట్ర మహాసభలో రాష్ట్రంలోని వివిధ ప్రధాన అంశాలపై చర్చించినట్లు వారు తెలిపారు. చర్చించిన అంశాలపై మహాసభలో తీర్మాలను ఆమోదించినట్టు పేర్కొన్నారు. దేశ ప్రజలకు అన్నం పెట్టేందుకు రైతాంగం పండిస్తున్న పంటలకు కనీసం మద్దతు ధర కల్పించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ మహాసభ తీర్మానం చేసినట్టు పేర్కొన్నారు. ఎన్నికల ముందు ప్రధాని మోడీ కనీసం మద్యతర చట్టం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక మోసం చేశాడని విమర్శించారు. ఆరు పంటలకు బోనస్ ఇస్తామని నాలుగు పంటలకు కనీసం మద్యతర కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా రైతాంగ సమస్యలను పక్కన పెట్టిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కోటి 30 లక్షల మంది కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ విడుదల చేసిన కనీస వేతనాలు జీవో సిగ్గుచేటుగా ఉందన్నారు రోజుకు 175 రూపాయలు కూలి ఇస్తే సంబర పడాలని చెప్పడం నిసిగ్గుగా ఉందన్నారు. నెలకు రూ.4628 కుటుంబ పోషణకు సరిపోతాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు రాష్ట్రంలో ఏ బీజేపీ నాయకుడైనా సరే ఆ వేతనంతో తమ కుటుంబాన్ని న డుపుకోగలడా అని ప్రశ్నించారు పదివేల కనీస వేతనం నిర్ణయించారని , ప్రతి ఐదేళ్లకోసారి కనీస వేతనాలను పునర్ నిర్ణయం చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే మూడు పర్యాయాలు పెంచాల్సి నా కనీస వేతనాలు అమలుకు నోచుకోలేదన్నారు. కనీస వేతనాలను పెంచితే ప్రభుత్వానికి పైసా ఖర్చు ఉండదని అయినా పెట్టుబడుదారులు కార్పొరేటర్ లాభాల కోసం కార్మికుల కనీస వేతనాలు పెంచేందుకు సిద్ధపడటం లేదని విమర్శించారు. 73 షెడ్యూల్ ఇండస్ట్రీలకు కనీస వేతనాల ముసాయి దాని విడుదల చేసి రూ .11000 ఇస్తే సరిపోతుందని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాబోయే కాలంలో ఐక్య పోరాటాలు నిర్వహించేందుకు ఉద్యమ కార్యాచరణను మహాసభలో ఖరారు చేయనున్నట్లు వారు తెలిపారు.

సొంతిల్లు అనేది ఆత్మగౌరవ సమస్య: మల్లు లక్ష్మి

సొంతిల్లు అనేది ఆత్మగౌరవ సమస్యగా ఉంటుందని పేదలకు ఇండ్లు ఇళ్లస్థలాలు ఇచ్చే విషయంలో గత 15 టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండు కూడా ఒకేలా వివరిస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి దుయ్యబట్టారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇస్తామని చెప్పిన రాష్ట్రంలో ఏ పేదలకు కూడా ఇళ్ల కేటాయింపు జరగలేదన్నారు. సిపిఎం పోరాటాల ఫలితంగా సీఎం రేవంత్ రెడ్డి జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్రంలోని 11 నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి రూ.3500 చొప్పున మంజూరు చేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు ఎన్నికల ముందు ఇంటి నిర్మాణానికి ఆరు లక్షల ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు కేవలం ఐదు లక్షలు మాత్రమే ప్రకటించడం సరైనది కాదన్నారు.ఇంటి నిర్మాణ వ్యయం పెరుగుతున్నందున లబ్ధిదారునికి రూ.15 లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని మహాసభ డిమాండ్ చేసినట్టు ఆమె వివరించారు. స్థలాలు లేని పేదలను గుర్తించి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బంజరు, ప్రభుత్వ భూములను ఇళ్ల స్థలాల కోసం కేటాయించి పేదలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న గ్రామీణ పేదలకు సంవత్సరానికి 200 పని దినాలు, రోజుకు రూ . 600 వేతనం చెల్లించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కోరారు. సమావేశంలో సిపిఐ ఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడివయ్య పాల్గొన్నారు.

నాగోబా దయతో రాష్ట్రం పాడిపంటలతో వర్ధిల్లాలి

- మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్ (జనం సాక్షి) : ఆదిమ గిరిజనుల ప్రాచీన సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే నాగోబా జాతర ఉత్సవాలకు ప్రారంభ సూచకంగా నిర్వహించే మహాపూజను పురస్కరించుకుని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. నాగోబా జాతరను పురస్కరించుకుని గిరిజనులు అత్యంత నిష్టతో ఆచరించే పూజా విధానం గొప్పదని మంత్రి అన్నారు. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 4 వరకు 8 రోజుల పాటు ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్ లో నిర్వహించే ఆదిశేషుని నాగోబా జాతర దేశంలోనే రెండో అతిపెద్ద గిరిజన జాతర కావడం తెలం గాణకు ప్రత్యేకతను తెచ్చి పెట్టందని మంత్రి సురేఖ అన్నారు. దేశంలోని వేర్వేరు రాష్ట్రాల నుంచి జాతరకు తరలి వచ్చే గిరిజన భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని మంత్రి తెలిపారు. నాగోబా దయతో రాష్ట్రం పాడిపంటలతో వర్ధిల్లాలని, సదా శాంతి సౌభాగ్యాలు నెలకొనాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు.

కాళేశ్వరం ఆలయ ఈవోగా మహేష్ బాధ్యతలు

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): కాళేశ్వరం లోని ముక్తీశ్వర ఆలయ ఈవోగా మహేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆలయంలోని గర్భగుడిలో షూటింగ్ నేపథ్యంలో స్థానిక ఈవో ను బాధ్యతలనుండి తొలగించిన విషయం తెలిసిందే. కాగా ఈవో మహేష్ కు మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం లో గల ముక్తిశ్వర స్వామి ఆలయం ఈవోగా బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు సోమవారం మహేష్ కాళేశ్వరంలోని ముక్తేశ్వర ఆలయంలో ముఖ్య కార్య నిర్వహణాధికారిగా బాధ్యతలు చేపట్టారు.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా సోలార్ ప్రాజెక్టు

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



పరకాల, జనవరి 27 (జనంసాక్షి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తుందని రకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.ఆత్మకూర్ గ్రామాన్ని సోలార్ విద్యుత్ ఉత్పత్తి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయగా సంబంధిత శాఖ అధికారులతో కలిసి సోమవారం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆత్మకూర్ మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ద్వారా ఇంటింటికి విద్యుత్ సరఫరా, వ్యవ సాయ మోటార్లకు కూడా సౌర విద్యుత్ ఇవ్వడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సోలార్ పైలెట్ ప్రాజెక్టు ద్వారా నాణ్యమైన సౌర విద్యుత్ అందుతుందని అన్నారు. గ్రామ ప్రజల ఈ అవకాశాన్ని సభ్యులు సద్వినియోగ పరుచుకోవాలని అన్నారు. ఆత్మకూరులో 1825 గృహ సర్వీసులకు సుమారు 20 కోట్ల అంచనా వ్యయం తో సోలార్ పవర్ ప్యానెల్ ద్వారా ప్రభుత్వం 100% సబ్సిడీతో ఇస్తున్న అప్లికేషన్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వినియోగదారులతో కలిసి ప్రారంభించారు.

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి

- ప్రజాస్వామిక హక్కుల సంఘాల సమన్వయ సంస్థ

హైదరాబాద్, జనవరి 27 (జనంసాక్షి) : ఆపరేషన్ కగార్ను వెంటనే నిలిపివేయాలని ప్రజాస్వామిక హక్కుల సంఘాల సమన్వయ సంస్థ కో-ఆర్డినేటర్స్ ఆశిష్ గుప్తా, తపాస్ చక్రబోర్తి, క్రాంతి చైతన్య డిమాండ్ చేశారు. దేశంలో ఆదివాసీలు, దళితులు, ముస్లిం మైనారిటీలపై దాడులు, హత్యాకాండ, క్రూరమైన హింసాకాండ వివిధ రూపాలలో కొనసాగుతున్నదని, ముఖ్యంగా కేంద్రంలో బీజేపీ 3వ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత హక్కుల హననం యధేచ్ఛగా కొనసాగుతున్నదని తెలిపారు. ఈ దేశంలోని సహజవనరులను యదేచ్ఛగా బహుళ జాతి కంపెనీలకు దోచి పెట్టడానికి అడవి ప్రాంతాలలోని ఆదివాసీలను అక్కడ నుండి గెంటి వేయడానికి, దానికి అడ్డంకిగా ఉన్న మావోయిస్టు ఉద్యమాన్ని సమూలంగా తూడ్చి పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' జనవరి 01, 2024 నుండి మొదలు పెట్టిందని, దాని కొనసాగిస్తూ ఇప్పటికే 350 మంది వరకు ఆదివాసీలు, ఉద్యమకారులు అత్యంత దారుణంగా ఎన్ కౌంటర్ పేరుతో హత్య గావించబడ్డారని తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా 2026 మార్చి కల్లా మావోయిస్టు పార్టీని తుడ్చి పెట్టేస్తామని పలుసార్లు ప్రకటించిన విషయం మనందరికీ తెలుసునని, ఆ చర్య పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం, చట్టం విరుద్ధమని, మావోయిస్టులు చట్టం దృష్టిలో నేరస్థులయితే, వారితో చట్ట బద్ధంగానే వ్యవహరించాలి గాని, లక్షలాది సైన్యాన్ని దింపి, డ్రోలులతో నిగా పెట్టి, ఒకేసారి 15,20 వేల బలగాలతో చుట్టుముట్టి, కాల్చిచంపాడని, దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. మావోయిస్టు ఉద్యమాన్ని శాంతిభద్రతల సమస్యగా గాకుండా, సామాజిక, ఆర్థిక సమస్యగా చూసి రాజకీయంగా పరిష్కరించాలని, మిలిటరి పరిష్కారాన్ని ఎన్నుకోవడం వెనక, బహుళ జాతి కంపెనీల ఒత్తిడి ఉన్నదనేది వాస్తవమని, ఈ బహుళ జాతి కంపెనీలకు చెందిన 104 ఒప్పందాల (ఎంఓయు) ద్వారా అపార సహజ సంపదలని వారికి దోచిపెట్టడానికే ఆపరేషన్ కగార్ ప్రారంభించినప్పటి నుండి ఇప్పటివరకు దాదాపు 350 మంది ఎన్ కౌంటర్ పేర కాల్చిచంపబడ్డారని తెలిపారు. కొన్ని ఎన్ కౌంటర్ ఘటనలో మాత్రమే వాస్తవాలని సేకరించగలిగామని, వాస్తవాల్ని ఈ దేశ ప్రజలకు తెలియకుండా ఉ ండేందుకే హక్కుల సంఘాలని నిజనిర్ధారణ చేయకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు.

దేశంలో ముస్లిం మైనారిటీలు మునుపెన్నడూ లేనంతగా పూర్తి అభద్రతలోకి నెట్టబడ్డారని, వారిని ద్వితీయ శ్రేణి పౌరులుగా చూసే పరిస్థితిని పాలకులే కల్పిస్తున్నారని, వారిపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయని, మరొకవైపు మణిపూర్ రెండు తెగల మధ్య రాచుకున్న అగ్గిని చల్లార్చడానికి వారి మధ్య ఏర్పడ్డ అపోహలను తొలగించి, సామరస్యాన్ని కాపాడానికి కేంద్రం ఎలాంటి చర్య చేపట్టలేదని తెలిపారు. దేశ ప్రధాన మంత్రే ఇప్పటివరకు దానిపై నోరెత్తలేదన్నారు. అలాగే పంజాబ్, ఉత్తరభారత దేశంలోని రైతుల ఆందోళనలపై, పంటలకు గిట్టుబాటు ధరలను ప్రకటించాలని డిమాండ్ పై కూడా ప్రభుత్వం స్పందించలేదు. ప్రపంచ శ్రామికులు శతాబ్దాల పోరాటం ద్వారా సాధించుకున్న హక్కులను కాలరాసే విధంగా కార్మిక చట్టాలను మార్చడం కార్మికులను, ఉద్యోగులను తిరిగి బానిసత్వంలోకి నెట్టడమేనని మేం బలంగా అభిప్రాయబడుతున్నాం. ఆర్టికల్ 370 ని రద్దు చేయడం ద్వారా, కాశ్మీరి ప్రజల హక్కులను కేంద్రం కాలరాయడమే కాకుండా చివరకు కాశ్మీరు కేంద్రపాలిత ప్రాంతంగా చేసుకోవడం కాశ్మీరిల ఉనికినే ప్రమాదంలోకి నెట్టిందని తెలిపారు. మధ్య భారతంలో కార్పోరేట్లకు సహజ వనరులను దోచిపెట్టడం కోసం కుదుర్చుకున్న ఎంఓయులను అమలు పరచడం కోసం ఆపరేషన్ కగార్ పేరుతో కొనసాగిస్తున్న ఆదివాసీల హననాన్ని మావోయిస్టు పార్టీ నేతల హత్యాకాండలను వెంటనే నిలిపివేయాలని, ఉత్తర భారతదేశంలో రైతు సమస్యలపై ఉద్యమిస్తున్న రైతు ఉద్యమాలపై ప్రభుత్వ దమనకాండను నిలిపివేసి, వెంటనే పరిష్కారాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపా చట్టాన్ని, ఎన్ఐఏ సంస్థను రద్దు చేయాలని, జైలులో అక్రమ కేసుల్లో నిర్బంధించబడివున్న రాజకీయ ఖైదీలందరినీ భేషరత్తుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రైతుల కండ్లల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్

హైదరాబాద్ జనవరి 27 (జనంసాక్షి) : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల కళ్ళల్లో ఆనందం చూడడమే తమ లక్ష్యంగా పనిచేస్తూ ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మరియు రేషన్ కార్డులు మంజూరు చేయడం కాంగ్రెస్ పార్టీ వేసిన మరో ముందు అడుగు అని బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. సోమవారం నాడు ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాలుగు కీలక పథకాలు ప్రారంభం అయిన నేపథ్యంలో రైతులకు పంట పెట్టుబడి అందించే రైతు భరోసా, భూమి లేని రైతు కూలీలకు ఆర్థిక సహాయం అందించే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పథకాలు ఇందులో అనేకమంది బీసీలు లబ్ధి పొందే అవకాశం ఉందని శ్రీకాంత్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోని వెనుకబడిన తరగతుల వారికి(బీసీలకి) కాంగ్రెసు రాష్ట్ర ప్రభుత్వం మన ప్రియతమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమం యావత్తు తెలంగాణ రాష్ట్రానికి ఒక ముందడుగు అని, దావోసు లో జరిగిన ఆర్థిక సదస్సు- 2025 తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల వరద రావడం అభినందనీయమని అన్నారు. ఎందరు ఏమీ అనుకున్నా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో నా, బీసీ కులాల కార్యకర్తలంతా స్థానిక సంస్థల ఎన్నికల్లో సమర శంఖారావం పూరించి గ్రామీణ ప్రాంతాలలో కూడా ఇందిరమ్మ రాజ్యాన్ని ఏర్పాటు చేసేందుకు మీ వంతు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపు ఇస్తున్నానని యువ నాయకులు బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత గౌడ్ తెలియజేశారు.

గూడూరును సందర్శించిన కేంద్ర బృందం

పాలకుర్తి, జనవరి 27(జనంసాక్షి) : మండలంలోని గూడూరు ఆరోగ్య ఉప కేంద్రాన్ని జనాభా పరిశోధన కేంద్రం (పీఆర్సీ) కేంద్ర బృందం సభ్యులు డాక్టర్లు జయరాం, కార్తీక్ లు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సాధారాణ డెలివరీలు, రోగులకు మందుల పంపిణీ, వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఆస్పత్రిలో పరిశుభ్రత, రోగులకు తాగునీటి సౌకర్యం గురించి కూడా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తే గుర్తింపు లభిస్తుందని అన్నారు. వారి వెంట డిప్యూటీ డీఎంహెచ్వి సుధీర్, ప్రోగాం అదికారి డాక్టర్ భాస్కర్, డాక్టర్లు సిద్ధార్థరెడ్డి, ఉషారాణి, అనిల్, ఇంద్రాణి, విజయ, వైద్య సిబ్బంది చంద్రకళ, శోభారాణి ఉన్నారు.

పాసిగడ్డ తండాలో ఎక్సైజ్ పోలీసుల జులుం

- ఆందోళన చెందుతున్న ప్రజలు

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎక్సైజ్ పోలీసులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు దారితీస్తుంది.. గుడుంబా పేరిట ఏమి తెలియని అమాయక ప్రజలను తరచూ వేధిస్తున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.. వివరాల్లోకి వెళితే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం పాసిగడ్డతండా లో సోమవారం సాయంత్రం ఎక్సైజ్ పోలీసులు గుడుంబా తనిఖీల కోసం వెళ్లారు. అయితే అక్కడ ఏమి దొరక్క పోవడంతో అమాయక ప్రజలపై జులుం ప్రదర్శించారు. విసుక్కుంటూ అమాయక ప్రజలపై విరుచుకుపడ్డారు. గ్రామానికి చెందిన భద్రునాయక్ అనే వ్యక్తి ఇంటికి వెళ్లి తనిఖీ చేసి, ఏమి లేకపోవడంతో మొబైల్ ఫోన్ లాక్కొని నానా ఇబ్బందులు పెట్టారు. ఇంట్లో ఆడవాళ్లు ఉన్నారని, ఇక్కడ గుడుంబా లేదు అని చెప్పినందుకు అతనిపై జులుం ప్రదర్శించి, ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు బాధితుడు భద్రునాయక్ జనంసాక్షి ప్రతినిధికి తెలియజేశాడు. గ్రామానికి వచ్చిన ఎక్సైజ్ పోలీసుల తీరు అవమానకరంగా ఉందని బాధితుడు వాపోతున్నాడు. గుడుంబా, బెల్లం కోసం తనిఖీలు నిర్వహించి బాధ్యతగా వ్యవహరించాల్సిన ఎక్సైజ్ పోలీసులు ఏమీ తెలియని వ్యక్తులపై జులుం ప్రదర్శిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితుడు భద్రునాయక్ తెలిపాడు. తనను జీపు ఎక్కాలంటూ బెదిరిస్తూ, మొబైల్ ఫోన్ తీసుకోవడంతో పాటు, సారీ చెప్పాలని ఒత్తిడి చేస్తూ అందరిముందు అవమాన పరిచాడని విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపాడు.

అర్హులైన నిరుపేదలకే సంక్షేమ పథకాల వర్తింపు

- నమూనా ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ
- ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్

ఖానాపూర్ జనవరి 27 (జనంసాక్షి) : అర్హులైన నిరుపేదలకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకాలను వర్తింప చేస్తామని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ స్పష్టం చేశారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఇందిరమ్మ నమూనా ఇల్లు నిర్మాణానికి భూమి పూజ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లతో పాటు పెంకుటిల్లు, కట్టెలతో నిర్మించిన వారికి మొదటగా ప్రాధాన్యత కల్పిస్తూ ఇందిరమ్మ మంజూరు చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా వర్తిస్తాయని అన్నారు. ఇటీవల నిర్వహించిన సర్వే జాబితాలో అర్హత లేని వారి పేర్లు నమోదు ఉంటే వాటిని తొలగించి నిరుపేద కుటుంబాలకు అవకాశం కల్పిస్తామన్నారు. అలాగే మండలంలోని దంతనపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. రైతు ఆత్మీయ భరోసా పథకంలో ఉపాధి హామీ పనులలో 2023-24 సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసి ఉండాలని, అలాంటి వారికే పథకం వర్తిస్తుందని అన్నారు. రేషన్ కార్డు లేని వారికి కొత్త రేషన్ కార్డులు మంజూరి, పట్టా ఉండి సాగులో ఉన్న ప్రతి ఒక్క రైతుకు రైతు భరోసా పథకం వర్తింప చేస్తామని అన్నారు. నిరుపేదలకే 100% సంక్షేమ పథకాల ఫలాలు అందుతాయని ఆయన నొక్కి చెప్పారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే వదంతులు నమ్మవద్దని అన్నారు. పథకాల వర్తింపులో అర్హులైన వారిని ఎంపిక చేయుటలో పారదర్శకత పాటించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

సమాజ సేవకుడు గడ్డం సుభాష్‌కు శాసకియ భూషణ్ పురస్కారం

- మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేత

ముధోల్, జనవరి 27 (జనంసాక్షి) : మండల కేంద్రమైన ముధోల్ కు చెందిన సమాజ సేవకుడు గడ్డం సుభాష్ మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ రావు జవాన్ చేతుల మీదుగా శాసకియ సమాజ్ పురస్కారము అవార్డు అందుకోవడం ముధోల్ నియోజకవర్గానికే వన్నె తెచ్చిపెట్టింది. వివరాలో కెళ్తే ముధోల్ కు చెందిన గడ్డం సుభాష్ ప్రభుత్వ ఆసుపత్రి అంబులెన్స్ డ్రైవర్గా విధులు నిర్వహిస్తూనే తన వంతు సమాజ సేవలో చురుకుగా పాల్గొంటూ ఉంటాడు. ఇప్పటికే ముధోల్ తో పాటు తదితర గ్రామాలలో ఎవరైనా నిండు గర్భిణి అయిన పాము కాటుకు గురైన, కరోనా మహమ్మారి సమయంలో కూడా సుభాష్ కు సంప్రదిస్తే చాలు అర్ధరాత్రి అయినా సరే వారిని సహాయం చేసి ఆదుకున్న విషయం ఇప్పటికే అనేక పత్రికల్లో ప్రచురించడం జరిగింది. ముధోల్ ప్రాంతంలోని అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజల మన్ననలు పొందాడు. అంతటితో ఆగకుండా మానవసేవయే మాధవసేవ గా భావించి పోరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని బోకర్, ధర్మాబాద్, ఉమ్మరి తదితర ప్రాంతంలోని ప్రజలకు సైతం ఆపదలో ఉన్న వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి సమయం వస్తే తన సొంత ఖర్చులతో, తన సొంత వాహనంలో సమయానికి ఆసుపత్రికి తరలించి వారి ప్రాణాలను కాపాడడమే కాకుండా బాధితులకు తగిన ధైర్యాన్ని ఇచ్చాడు. మహారాష్ట్ర బ్రోకర్ లోని ప్రజలు ఆయనను ఇప్పటికే ఆపద్బాంధవుడుగా భావిస్తూ అక్కడి యువకులు, రాజకీయ నాయకులు సహితం అభినందిస్తున్నారు. రాష్ట్రం కానీ రాష్ట్రం కు చెందిన యువకుడు ప్రజల సేవలో ఉంటూ ఏకంగా మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చేతుల మీదుగా సమాజ్ భూషణ్ పురస్కారము అందుకోవడము ముధోల్ నియోజకవర్గానికే గర్వకారణమని పలువురు అంటున్నారు. భోకర్ ప్రాంతంలోని యువకులు గడ్డం సుభాష్ యొక్క ప్లెక్సీలను పట్టణంలోని ప్రధాన విధులలో పెట్టడం ఆయనని అభినందించడం గొప్ప విషయం. నేటి యువకులు చెడు అలవాట్లకు బానిస కాకుండా ప్రజాసేవలో ప్రజలతో ఉంటూ వారి అవసరాలను తీరుస్తూ సమాజ సేవకి అంకితం కావాలని గడ్డం సుభాష్ కోరుకుంటున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
28 జనవరి 2025
తెలంగాణ

వజ్రం లాంటి మనుషులు ఉంటారు

వజ్రాలు మాత్రమే కాదు, వజ్రం లాంటి మనుషులు ఉంటారు. అలాంటి వారి వల్ల నీకు డైమండ్ కూడ లభిస్తుంది. అలాంటి వజ్రం లాంటి మనుషులు లేకుంటే మనిషి జీవితంలో మనం కౌన్‌కిస్కా గాండ్లుగానే మిగిలిపోతా ము! అనామకులమే! ఇందులో ఎలాంటి అనుమానాలు అక్కర లేదు! అయితే రాజకీయ నాయకుల్లో చాలా మంది ఈ విషయం ను ఇగ్నోర్ చేస్తూ ఉంటారు. ఇదేదో తమ వ్యక్తిగత టాలెంట్ ద్వారా నో,కోట్లు ఖర్చు చేయడం వల్ల వచ్చిందో! లేక తమ తెలివితేటల వల్లనో వచ్చిన పదవి, లేకుంటే కీర్తి నో, వారసత్వమో అనుకుంటారు.అసలు తమని ప్రమోట్ చేసిన అసలు మనుషులను మర్చి పోతారు.మొత్తం కమర్షి యల్, స్వార్థం, ఇక ఇతర రంగాల్లోను అలాంటి వారు ఉంటారు, ఉన్నారు, అనుకోండి!

రవిష్ కుమార్ కు డైమండ్ బటన్!

రెండు ఏండ్ల క్రితం భారతదేశం మీడియా రంగంలో ఎన్డిటీవీ ని గౌతమ్ అదాని స్వంతం చేసుకున్నాక, అందులో ఫేమస్ షో అయిన, ప్రతీ దినం రాత్రి వారంలో ఐదు రోజులు ప్రసారం అయ్యే ప్రైమ్ టైం యాంకర్, జర్నలిస్ట్,రవిష్ కుమార్ కూడ బయటకు వచ్చి,రవిష్ కుమార్ ఆఫీషియల్ పేరిట యూట్యూబ్ ఛానల్ పెట్టుకున్నాడు. ప్రజల వైపు నిలబడే వారికి ప్రజల మద్దతు ఉంటుంది. దానికి నిదర్శనం రవిష్ కుమార్ యూట్యూబ్ ఛానల్!ఆయనకు ఎన్ని అడ్డంకులు ఎదురు అయినా, ఎంత ఒత్తిళ్ళు వచ్చినా ఆ ఛానల్ కు పెరుగుతూ వచ్చిన జనాదరణను, ఆపలేక పోయారు. ఇటీవలే రవిష్ కుమార్ యూట్యూబ్ ఛానల్‌కు ఒక కోటి 24 లక్షల పై చిలుకు రెండు ఏండ్లలో ఎవరూ ఊహించని విధంగా సబ్స్క్రయిబర్లులు సాధించి యూట్యూబ్ ద్వారా వజ్రం స్థాయి ని అందుకున్నది.యూట్యూబ్ కేంద్రం అయిన అమెరికాలోని న్యూయార్క్ నుంచి ఇందుకు సంబందించి న ఆ వజ్రం ఆకారం కలిగిన బటన్‌ను, ఇంకా కొంత, ఆస్తాయి ఇస్తూ అందించిన బాక్స్ లోని పరికరాలను యూట్యూబ్ సబ్స్క్రయిబర్ల కోసం షూట్ చేసి చూయించాడు రవిష్ కుమార్!ఆయన జనం లో మనిషి! జనం జర్నలిస్ట్! నిర్మొహమాటస్తుడు! గత ఏడాది రవిష్ కుమార్ పేరిట ఒక డాక్యూమెంటరీ కూడ వచ్చింది. లండన్ లో దానిని రిలీజ్ చేశారు. మన వద్ద రిలీజ్ కాలేదు!అయితే ఇక్కడ అసలు విషయానికి వద్దాం!ఇటీవలే మరణించిన షిల్లాంగ్ కు చెందిన జర్నలిస్ట్, ఫోటో జర్నలిస్ట్, తరుణ్ భారతీయ తాను ఈ స్థాయికి రాడానికి కారణం అంటాడు రవిష్ కుమార్, ఆ వజ్రం లాంటి మనిషే తనకు ఈ యూట్యూబ్ వజ్రం బటన్ పొందడానికి కారణం అంటాడు. రవిష్ కుమార్,తనకు జర్నలిజం రంగం లోని వీడియో జర్నలిజం లో చిన్న చిన్న అవకాశాలు ఇప్పించింది ఆ తరుణే నని అంటాడు! అయితే తనకు యూట్యూబ్ వజ్రపు బటన్ వచ్చిన సందర్భంలో శుభ సందర్భంగా తాను వీడియో తయారు చేస్తున్న రోజు మిత్రుడు, నా అసలు వజ్రం ఊపిరి విడిచాడు అని రవిష్ కుమార్ పేర్కొన్నారు.

సంతోషం వెంటే దుఃఖం!

అంటారు కదా అప్పుడపుడు సంతోషం సమయాలలోనే విషాదాలు, దుఃఖం కూడ వెంటే వస్తాయని, రవిష్ కుమార్ కు ఇక్కడ అదే జరిగింది!ఇక్కడ చెప్పేది ఏమంటే మనిషి కి లభించే విజయం వెనుకాల ఒక్కో క్కప్పుడు అతి సామాన్యుడు కూడ ప్రేరణ, ప్రోత్సాహం అవుతాడు! అసలు వజ్రం చేతికి వచ్చింది కదా, అని అందుకు ప్రేరణను, అదే అసలు వజ్రం లాంటి మనిషిని మర్చి పోవద్దు!రవిష్ కుమార్ కు అభినందనలు! యూట్యూబ్ లో అరుదైన డైమండ్ బటన్ ను సాధించిన రవిష్ కుమార్ లాంటి ప్రజల కోసం, ఈ దేశం హితం కోసం పని చేస్తున్న యూట్యూబర్లు అందరికి అభినందనలు! ధన్యవాదాలు! దేశంలో ప్రనోయ్ రాయ్ లాంటి జర్నలిస్ట్‌లచే స్థాపించపడిన ఎన్డి టీవీని సైతం అదాని స్వంతం చేసుకుని ప్రభుత్వ ఒడిలో మీడియాగా మార్చేసిన నేపథ్యంలో యూట్యూబర్ లలో కొందరు అయిన జన జాగృతం కోసం నిజమైన, నేల మీది సమాచారం ను అందించడం శు భపరిణామం! అయితే బ్రోట్ కాస్టింగ్ బిల్ తెచ్చి ఇప్పుడు యూట్యూబ్ ను కట్టడి చేసే ప్రయత్నాలు కేంద్రం చేస్తున్నది!

ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

ప్రజాస్వామ్య విలువలకు నిఘంటువు

భారత రాజ్యాంగం

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజును గణతంత్ర దినోత్సవం అంటారు. ప్రతి సంవత్సరం జనవరి 26న రిపబ్లిక్ డే ను ఢిల్లీ నుండి గల్లీ దాకా ఘనంగా జరుపుకుంటారు. ఈ చట్టం 1950 జనవరి 26న నుండి అమలులో వచ్చింది. 19935 భారత ప్రభుత్వ చట్టానికి బదులుగా దేశ పరిపాలనకు భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. భారత రాజ్యాంగ సభలో 1949 నవంబరు 26న రాజ్యాంగం ఆమోదం పొందింది. 1950 జనవరి 26లో ప్రజాస్వామ్య పాలన కోసం అమలులోకి తీసుకు రావడం జరిగింది. దేశంలో అనేక ప్రాంతాల నుంచి గెలుపొందిన రాజనీతి వేత్తలు, రాజకీయ నేతలు, వివిధ రంగాల నుంచి నామినేట్ చేసిన నిపుణులందరూ కలిసి భారత రాజ్యాంగంపై చర్చలు జరిపి నిర్ణయాల ద్వారా రాజ్యాంగాన్ని మనకు అందించారు. 1946 నుంచి 1949 వరకు సుదీర్ఘ కాలం ఈ కమిటీ సభ్యులు భారత పార్లమెంటు హాలులో సమావేశమై చర్చించారు. నేహ్రూ తదితర జాతీయోద్యమనేతలు జనవరి 26ను దేశ గణతంత్ర దినోత్సవంగా భారత పార్లమెంటు హాలులో సమావేశమై నిర్ణయించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలలో సంప్రదాయాలు, వేడుకలు, చరిత్ర, గుర్తుకు చేసేలా వేడుకలు జరుపుకుంటారు. భారత రాజ్యాంగం 1950లో కొత్తగా ఆమోదించి, అమల్లోకి వచ్చి, భారతదేశం గణతంత్ర దినోత్సవంగా అవతరించింది. ఈ వేడుకలు పరేడ్‌కు మాస్టర్ ఆఫ్ సెర్మనీస్‌గా కూడా వ్యవహరించే రాష్ట్రపతి, వార్షిక గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. గణతంత్ర దినోత్సవం భారతదేశంలో గణతంత్ర దినోత్సవం ఒక ముఖ్యమైన సందర్భంగా భావించి యావత్తు దేశం వేడుకలు చేసుకుంటుంది. ప్రతి ఏటా జనవరి 26న జరుపుకునే గణతంత్ర దినోత్సవానికి ప్రతి భారతీయుడికి గొప్ప భాద్యత విలువగా ఉంటుంది. భారతదేశంలో అన్ని మతాల, కులాల వారితో భిన్నత్వంలో – ఏకత్వంగా ఉంటూ ప్రజాస్వామ్య విలువల ను కాపాడుతూ సుపారిపాలన అందిస్తుంది. దేశ ఐక్యత భిన్నత్వం యొక్క స్ఫూర్తిని ప్రతిధ్వనించే జాతీయ గీతం యొక్క ఉత్తేజకరమైన గమనికలతో పాటు జాతీయ జెండాను ఆవిష్కరించడంతో ప్రారంభమైన కార్యక్రమాలు భారత రాజ్యాంగాన్ని గౌరవించేందుకు సమావేశమైన సిబ్బంది, ప్రొఫెసర్లు, విద్యార్థులందరూ పాఠశాల మైదానం అంతటా బ్యాండ్‌ల దరువులతో ఉత్సాహంగా దేశభక్తి గీతాలు, నాటకాలు, నృత్యాలతో సహా సాంస్కృతిక కార్యక్రమాలు దేశ వారసత్వం యొక్క గొప్పతనం తెలియ పరుస్తూ ప్రదర్శనలు ఇస్తారు. త్రివర్ణ పతాకాలను ధరించి వివిధ రకాల పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు ఇస్తారు. భారత దేశానికి 1947 ఆగస్టు 15న స్వతంత్ర్యం వచ్చింది. మన దేశాని పరిపాలిచుకోవాడానికి ఒక రాజ్యగం ఉండాలని భావించి నవంబ ర్ 26, 1949న రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని రూపొందించు కోవడం జరిగింది. సుదీర్ఘ కాలం రచించిన లిఖిత – అలిఖిత, ధృడ – అధృడ రాజ్యగం జనవరి 26, 1950న అది అమలులోకి వచ్చింది. భారత గణతంత్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించు కుని ఈ రోజున భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ రోజు భారతదేశ గణతంత్ర దినోత్సవంగా గుర్తించబడి తరువాత జాతీయ సెలవుదినంగా ప్రకటించింది. గణతంత్ర దినోత్సవం రోజును భారతదేశం తన రాజ్యాంగాన్ని అధికారికంగా ఆమోదించింది. భారత దేశం రాజ్యాం గ రాచరికం నుండి స్వతంత్ర గణతంత్ర రాజ్యంగా మారడాన్ని సూచిస్తుంది. సమానత్వం, ప్రజాస్వామ్యం న్యాయం కోసం రాజ్యంగం పని చేస్తుంది. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ నేతృత్వంలో నిపుణుల బృందం భారత రాజ్యాంగాన్ని రూపొందించారు. 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని 1950 జనవరి 26న భర్తీ చేసింది. ఈ చారిత్రాత్మక సంఘటన భారతదేశాన్ని ప్రజాస్వామ్య దేశంగా స్థాపించింది. భారతదేశం దేశభక్తి గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రసిద్ధి చెందింది. న్యూఢిల్లీలోని రాజ్‌పథ్‌లో జరిగే ప్రధాన కార్యక్ర మంలో భారత రాష్ట్రపతి జెండాను ఎగురవేసి సైనిక కవాతు గౌరవ వందనం స్వీకరింస్తారు కవాతు వివిధ జానపద నృత్యాలు, పట్టిక లు, సైనిక ప్రదర్శనల ద్వారా భారతదేశ వైవిధ్యం, సాంస్కృతిక వారసత్వం ఉట్టిపడేలా ప్రదర్శనలు చేస్తారు. అదనంగా పాఠశాల విద్యార్థులు, పారామిలిటరీ బృందాలు, భారత సాయుధ దళాలు తమ క్రమశిక్షణ దేశభక్తిని ప్రదర్శించడానికి మార్చ్‌లో పాల్గొంటా యి. 1950లో రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజును అనేక పోరాటాల తదనంతరం సాధించిన స్వతంత్ర్యం జాతికి గర్వకా రణంగా భావింస్తూ బ్రిటీష్ సామ్రాజ్యం నుండి విముక్తి పొందినప్పు డు, ప్రతిదీ ప్రారంభమైంది. రాజ్యాంగం యొక్క ముసాయిదా 1947 నవంబర్ లో రూపొందించబడింది అదే విధంగా రాజ్యాంగ సభకు అందించబడింది. రాజ్యాంగాన్ని రచించడానికి సమావేశాలకు చర్చలు, పునర్విమర్శలు వంటివి పరిశీలించి రాజ్యాంగాన్ని రాయడానికి అసెంబ్లీకి రెండు సంవత్సరాల కంటే ఎక్కువ సమయం పట్టింది. అసెంబ్లీ 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించిన అది వెంటనే అమలులోకి రాలేదు. 24, జవనరి 1950న చార్టర్ స్థాపన పత్రాలపై సంతకం చేశారు. జనవరి 26, 1950న దేశ రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. భారతదేశం యొక్క మొట్ట మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ గారు తన భాధ్యతలను ప్రారంభించిన రోజు కూడా ఇదే. భారతదేశం ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా అవతరించిన రోజును భారత ప్రభుత్వ చట్టం అమలులోకి వచ్చింది. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం థీమ్ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 2025 సంవత్సరానికి సంబంధించిన థీమ్ "స్వర్ణిం భారత్ విరాసత్ లేదా వికాస్". కవాతు భారతదేశం యొక్క సాంస్కృతిక వారసత్వానికి సంబంధించి అభివృద్ధిని సూచిస్తూ కర్తవ్య మార్గంలో జరుగుతుంది. భారత రాజ్యాంగం ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ పాలకులకు నిఘంటువుగా ఉపయోగపడుతుంది.

మిద్దె సురేష్
కవి, వ్యాసకర్త, 9701209355

గూడు లేని పక్షులు..!!

గూడు లేని పిట్ట రెక్కలు వాల్చినట్టు
సగటు జీవన గతి పెడరెక్కలేస్తోంది
నిలువ నీడ లేని దారుల వెంబడి
పేద జీవన చక్రం దొర్లుతోంది
చూపు సారించలేని నేటి కాలంతో
తలబడే శక్తి కూడా లేకపోతోంది
పేదోళ్ళు కూడా వున్నారు దోరా
రవ్వంత చూపు నేలకేసి చూడండి

చిరునవ్వుల ముఖాలు చూసి
ఎన్నేళ్ళు దాటిపోయిందో
బుక్కెడు బువ్వ కడుపుకేసి
ఎన్నాళ్ళు గడిచిపోయిందో
పథకాల తొక్కిసలాటలో
బడుగు జీవనం అట్టడుగున పడి
విలవిలా తన్నుకుంటుంటే
తట్టి లేపే సర్కారు కంటికి కానొస్తాలేదు

ఏ విధి ఓటు రూపంలో కాటేసిందో
ముద్దరేసిన వేలు ముద్ద మొహం చూసి
ఐదేళ్ళు గడిచిపోతున్నా
వెతుకులాటలోనే సగం జీవితం
ఆవిరైపోతూ కానరాకుండా పోతోంది
జెండాను మోసిన చేయి
అచేతనంతో ఆగి సాగిలపడింది
పేదోళ్ళు కూడా వున్నారు సారూ
లోలోతుల బతుకుల్లోకి చూడండి

వెంట నడిచిన జ్ఞాపకాల్ని
అప్పుడే మరచిపోయారా
కంట తడిని తుడిచే ఏలిక కోసం
కంటి మీద రెప్ప వేసింది లేదు
కాస్త ఊపిరి తిప్పుకునే పథకం కోసం
నిరీక్షణలో అలసిపోని రోజంటూ లేదు
అయ్యా పేదోళ్ళు కూడా వున్నారు
పైపై చూపుల్ని నేలకు దింపి చూడండి

నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636

దాచకు

రంగేసి వెండివెంట్రుకల్ని దాస్తావు
క్రీములు స్నోలు పెట్టి కళ్ల చుట్టూరా
నల్లని వ(వి)లయాల్ని దాస్తావు
పౌడర్లు రాసి ముఖం మీద మ(ము)డతల్ని దాస్తావు
వయస్సును దాస్తావు మనస్సులో
ఎగిసిపడే అలల్ని దాచకు
మట్టిపొరల్లో దాగిన విత్తనం లేచి సూర్య నమస్కారం
చేస్తేనే బతికినట్టు
పాతాళంలో చేరిన జలం ఉబికి పొలం
చేర్తేనే జీవించినట్టు
దాచకు నువ్వుయే భా(లా)వాల్ని
సమాజంలో
చూసిన భిన్నపార్శ్వాల్ని మాటలుగా
దర్శించిన భావోద్వేగాల్ని పాటలుగా
తిలకించిన వాస్తవదృశ్యాల్ని
తూటాలుగా
మలుస్తేనే

కోటం చంద్రశేఖర్
9492043348



కాలినడక

సైకిలు కొనుక్కోవడానికీ
దిక్కు లేని రోజుల్లోనూ
ఏ దిక్కంటే ఆ దిక్కుకు
ఏ దిగులూ లేకుండానే వెళ్ళాను

అటు ఎల్. బి. కాలేజ్ నుండైనా
ఇటు ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నుండైనా
ఇంటికీ, కాలేజ్ లకు దూరమెంతైనా
లెక్కలేసుకోకుండా, లెక్కచేయకుండా
నడిచాను.. నడిచాను..

యూనివర్సిటీ మైదానంలోకి
పద్మాక్షి గుట్ట మీదికి
పబ్లిక్ గార్డెన్ కి
ఎక్కడికెక్కడికో
కాలినడకనే ప్రయాణిస్తూ వెళ్ళి
ఒంటరిగానే కూర్చొని
ప్రకృతిమాత ఒడిలో పసిపాపలా ఊగుతున్న
మనసుతో
ఎన్ని కవితలకు పురుడుపోసానో...
ఎన్ని పాటలు కైగట్టి పాడుకున్నానో...

ఎక్కడో కొంత దూరంలో
ఓ సాహితీ సభ ఉందన్న వార్త వింటే చాలు
మనసు కొట్టుకొని కాలు ఆగేది కాదు
సభకు వెళ్ళేటప్పుడు
ఉత్తగా ఊగుతూ వెళ్ళిన చేతులు
సభ ముగిసాక తిరిగొచ్చేటప్పుడు
కత్తుల్లాంటి పుస్తకాల్ని
తమ కౌగిట్లో బంధించి పట్టుకొచ్చేవి

రేషన్ షాపుకో, కిరాణా దుకాణానికో
హాస్పిటల్ కో, బుక్ స్టాల్ కో
నగర సరిహద్దు లోపలి పర్యాటక
ప్రదేశానికో...
స్నేహితుల పిలుపో, ఇంకేదైనానో
సందర్భమేదైనా, అవసరమేదైనా,
ఆహ్వానమెవరిదైనా
కేవలం కాలినడకతోనే అంతా

అప్పుడంతా పరిమిత జీవితం
కాలినడకతోనే కాలం గడిచేది
కాలినడకతోనే జీవనం సాగుతూపోయేది
నడిచేదారిలో ఎన్నో జీవితపాఠాలు బోధపడేవి

మీరేమనుకున్నా పరవాలేదుగానీ
ఒక్కోసారి అనిపిస్తుంటుంది
నా కాళ్ళకు నేనే మొక్కుకోవాలని
నా మనసును ఎక్కడికంటే అక్కడికి
మోసుకుతిరిగినందుకు
కృతజ్ఞతగా...

కార్తీక రాజు
హనుమకొండ
8977336447

విద్యుత్ ప్లాంట్ విస్తరణ జీవించే హక్కుకు వ్యతిరేకం

తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి బొగ్గుగణుల ప్రాంతంలో భూతాపం ఎక్కువగా ఉంటుందని తెలిసి కూడా సింగరేణి యాజమాన్యం కాని ప్రభుత్వాలు కూడా ఎటువంటి రక్షణ చర్యలు గణనీయంగా ఇప్పటి వరకు చేపట్టలేదు. బొగ్గు గణుల నుండి వెలువడే ప్రాణాంతకమైన వాయువులతో ఇప్పటికే చాలా మంది క్యాన్సర్, గుండె జబ్బులకు బలవుతున్న స్థితి మనందరికి తెలుసు. అలాగని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులు కూడా ఇప్పటి వరకు ఆ ప్రాంతంలో నెలకొల్పకపోగా, రిఫరల్ గా ప్రతిపాదనలు చేస్తూ కార్పొరేట్ ఆసుపత్రులకు సింగరేణి కార్మికుల సొమ్ము దారాదత్తం చేస్తున్నారు. అయినప్పటికీ కూడా కార్మికుల జీవించే హక్కు గాలిలో దీపంలా మారిపోయింది. గతంలో భూఉపరితల గనుల కోసం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ తూతూ మంత్రంగా కొనసాగి స్థానిక ప్రజల హక్కులను కాలరాస్తూ ప్రారంభించబడింది.

నేడు కూడా విద్యుత్ ప్లాంట్ విస్తరణ పేరుతో ఈ 28-1-2025 న నిర్వహించ బోతున్న ప్రజాభిప్రాయ సేకరణలో అన్ని వాస్తవాలను ప్రజలకు తెలియజేప్పిన తరువాతనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూనే దీని వలన ప్రజల జీవించే హక్కుకు పూర్తి ప్రమాదం కారణం అవుతున్నందున ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం. 28 జనవరి, 2025 ఎన్టీపీసీ 2400MW తాపవిద్యుత్ ప్లాంట్ విస్తరణకు ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహిస్తున్నది ఇది పూర్తిగా జీవించే హక్కుకే వ్యతిరేకం! 2025, డిసెంబర్ 28న, ఎన్టీపీసీ రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ టిఎస్‌టిపిపి 4,000MW విస్తరణ రెండోదశ 3×800MW స్థాపనకై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు, ఎఫ్ఈసీసీ వారిచే టర్మ్స్ అప్ రిఫరెన్స్ ఎశీ= పొందారు. ఎక్స్పర్ట్ అప్రైజల్ కమిటీ జూరాజ చే ప్రతిపాదిత 2,400MW విద్యుత్పత్తి విస్తరణకు పర్యావరణ అనుమతుల కోసం (జుజ) పెద్దపల్లి కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజలముందుర బహిరంగ పర్యావరణ ప్రభావిత నామకాః ప్రజాభిప్రాయసేకరణకు పూనుకున్నారు.

రామగుండం ఎన్టీపీసీలో 4,200MW విద్యుత్కేంద్రానికి కేవలం 13 కి.మీ. దూరంలో గోదావరి అవతలి మంచిర్యాల జిల్లా జైపూర్ లో, రాజజూ వారి 1,200 వీఔ థర్మల్ ప్లాంట్, ఈ పరిధిలోని మొత్తం 5,400MW కు, ఇది అదనపు 2,400MW స్థాపిత సామర్థ్య ప్రతిపాదన. టీజన్కో రామగుండంలో కొత్తగా 1,200MW, ఎస్‌సిసిఎల్ జైపూర్‌లో మరో 1,200 వీఔ సామర్థ్య విస్తరణకు ప్రతిపాదిస్తున్నారు. ప్రజాప్రయోజనం పేర, ఓ వేళ ప్రజామోదంతో ఈ పరిశ్రమల ప్రతిపాదనలన్నీ కార్యరూపానికి వస్తే కేవలం 13 కిలోమీటర్ల వ్యాసార్థంలోని 706 చకిమీ ప్రాంత తాప విద్యుత్ పరిశ్రమ సామర్థ్యం ప్రపంచస్థాయిలోనే 10,200 వీఔ విద్యుత్పత్తితో బాటు అతిపెద్ద థర్మల్ కాలుష్య కేంద్రంగా మారే ప్రమాదం పొంచి ఉంది. ఎన్టీపిసి రామగుండం ప్లాంట్‌కు 9 కి.మీ దూరంలో బసంత్ నగర్ సిమెంట్స్ సాలీనా కోటి టన్నుల సిమెంట్ పరిశ్రమ, 4 కి.మీ దూరంలోనే 1.3 మి.టన్నుల సామర్థ్యంగల ఆర్ఎఫ్‌సిఎల్ భారీ రసాయన ఎరువుల పరిశ్రమలతో బాటుగా 15 కి.మీ పరిధిలో 7 ఓపెన్ కాస్ట్ బొగ్గుగనులు, 16 భూగర్భ బొగ్గుగనులు ఉన్నాయి. రాక్షసిబొగ్గు, విద్యుత్తు, సిమెంటు, ఎరువుల పరిశ్రమలన్నీ దేశాభివృద్ధి కోసం, స్థానికంగా రామగుండం, కమాన్పూర్, మంచిర్యాల మండలాల్లో సేకరించిన 90,000 ఎకరాల భూమిని ఇప్పుడున్న మార్కెట్ ధరలతో పోలిస్తే అత్యంతస్వల్ప పరిహారానికి రైతుల నుండి సేకరించారు. ఎన్టిపిసీ రామగుండం నుండి 15 కి.మీ వ్యాసార్థంలోని దాదాపు 3 లక్షల పైచిలుకు కుటుంబాలలోని 12 లక్షల మంది ప్రజలందరు, ముఖ్యంగా 25 వేల కుటుంబాలు కారుచౌకలో తమ శాశ్వతజీవనాధార వ్యవసాయ భూఉపాధిని త్యాగంచేసిన రైతులకు, యువతకు భూసేకరణలో భూమి కోల్పోయిన కారణాన పరిహారంగా పట్టుమని 100 ఉద్యోగాలు కూడా అందలేదు. ఇది పచ్చి నిజం. విద్యుత్ భౌతిక శాస్త్ర నియమాల ప్రకారం క్రిటికల్, సూపర్ క్రిటికల్, అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ల ఇంధన దహనసామర్థ్యం 33- 42% లోపేనని దూరప్రాంతాల థర్మల్ విద్యుత్ స్టేషన్లకు బొగ్గు రవాణావ్యయాలను ఆదాచేయడానికి రామగుండం నుండి 13 కిలోమీటర్ల పరిధిలో ఇప్పుడున్న 5,400 వీఔ తోడు మరో 4,800MW విస్తరణ ప్రాజెక్టులు కలిపి 10,200MW సాంద్రస్థాయి థర్మల్ విద్యుత్పత్తి అవసరంగా ఎన్టీపిసి, ప్రభుత్వం చెబుతున్నారు. చౌకధరలో కెడబ్ల్యూహెచ్ -యూనిట్ =0.12 రూ.కు విద్యుత్పత్తి చేయడానికి అనుమతించడ మంటే, రామగుండం నుండి 15 కిమీ ప్రభావిత ప్రాంతంలో 21,000MW (థర్మల్ దహన సామర్థ్యం 1/3వ వంతు) సమానమైన ఉష్ణరాశిని వెదజల్లగల హీటర్లతో ఈ పరిసరాలని నిరంతరాయంగా మండించడాన్ని అంగీకరించినట్లే.

భారత ప్రభుత్వ అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ, ఇంధనశాఖ, నవరత్న ఎన్టిపిసి సంస్థ, సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు సంయుక్తంగా రాజ్యాంగ బాధ్యతలను విస్మరించి పర్యావరణ నియమాలను పక్కనబెట్టారు. 15 కిమీ. వ్యాసార్థం లో మిలియన్ పైచిలుకు స్థానికప్రజల జీవన నాణ్యతను హరించే, అధికసాంద్ర హరితగృహవాయు ఉద్గారాలతో విశృంఖలమైపోయే తీవ్రస్థాయి ఊపిరితిత్తులు, క్యాన్సర్లు, గుండె, మూత్రపిండాలు, న్యూరాలజీ, చర్మవ్యాధుల మరణాలకు, నిత్యజనజీవితంలో బర్డెన్ ఆఫ్ డిసీస్ పెచ్చరిల్లి అనేక రోగాలను ఆహ్వానించినట్లే. కాలుష్యకర ఉద్గారాల తీవ్రతతో సంభవించగల ప్రజారోగ్య ప్రమాదాలు శాస్త్రీయంగా తెలిసినప్పటికీ తాపవిద్యుత్పత్తిలో మూడింట రెండు వంతుల ఉపఉత్పత్తిగా జనించే భారీ మొత్తపు వృధాఉష్ణరాశితో పరిసరాలను మలమల మాడుస్తామని, దేశాభివృద్ధికోసం ఇక్కడి ప్రజలను మాడ్చివేయక తప్పదనే సత్యాన్ని స్పష్టంగా స్థానికప్రజలకు ప్రజాభిప్రాయ సేకరణలో చెప్పాలి కదా. కాదంటే ఇక్కడ మేము రాసిన ఊష్ణభౌతిక శాస్త్ర ప్రాథమిక విషయాలు అశాస్త్రీయమని, అబద్ధమని నిరూపించాలి.15 కిమీ. పరిధిలోని పర్యావరణ కాలుష్య మోతాదు తీవ్రతను పరిగణనలోకి తీసుకొన్న తర్వాతే ఎక్స్పర్ట్ అప్రైసల్ కమిటీ, ఎంవోఈఎఫ్‌సిసి వారు కొత్తపరిశ్రమలకు, పాత విద్యుత్ ప్లాంట్ల విస్తరణలకు అనుమతులివ్వాలని సుప్రీంకోర్టు సూచించిన విషయాన్ని పద్ధతిగా విస్మరించారు.

ప్రపంచంలోనే అత్యంత ఆదరణ కలిగిన మెడికల్ మ్యాగజైన్ LANCET నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా వివిధ పరిశ్రమలలో 8,900 ఎంఎంటి రాక్షసిబొగ్గు దహనంతో ఉత్పన్నమవుతున్న వాయుకాలుష్య కారణంగానే 90 లక్షల మంది అర్ధాంతరంగా మరణిస్తున్నారు. 40 ఎంఎంటి బొగ్గును సాలీనా వినియో గిస్తున్న రామగుండం మంచిర్యాల కాలుష్య ప్రభావిత ప్రాంతంలో దిగజారిన పర్యా వరణకాలుష్య కారక మరణాల సంభావ్యతా సంఖ్య ఒక సంవత్సరానికి కనీసం 1,25,000 చావుల వరకు ఉంటుందా ఉండదా, ప్రజలకు ప్రజాభిప్రాయ సేకరణలో తెలియచెప్పాలి. భారతదేశంలోని భూగర్భ బొగ్గుపొరల్లో (దురదృష్టవశాత్తు) ప్రపంచం లో ఎక్కడాలేనివిధంగా గంధకం లేదా సల్ఫర్ 0.4% వరకు ఉంది. ప్రపంచ బొగ్గు ఉత్పత్తి 8900 ఎంఎంటి మొత్తంలో సగానికెక్కువ 55% స్థాయిలో 4990 ఎంఎంటి వినియోగించే చైనా, తర్వాత స్థానాల్లో అమెరికా 600 ఎంఎంటి, రష్యా 400 ఎంఎంటిలతో ఉన్నాయి. భారత బొగ్గులోని అధిక గంధక కారణాన 1000 ఎంఎం టి సాలీన ఉత్పత్తి, దిగుమతులతో బొగ్గును మండిస్తూ దేశపరిశ్రమల నుండి పర్యావరణంలోకి విడుదలవుతున్న హరితగృహ ఉద్గారాలలో, సల్ఫర్ డయాక్సైడ్ ఱూా వాయువుకు ప్రపంచంలో అతిపెద్ద ఉద్గారక దేశంగా ఉంది. దేశ పరిశ్రమల కోసం విద్యుత్పత్తి చేసే ఎన్టీపిసి రామగుండంకు 15 కిమీ పరిసరాలలోని గాలి నాణ్యత ఇంతకంటే హీనంగా 400 నుండి 1,500 AQI చూపిస్తున్నది. స్థానికంగా రాక్షసి బొగ్గు సింగరేణి మైనింగ్, సిమెంటు, రసాయన, విద్యుత్తు పరిశ్రమల కారణంగా దేశపు బొగ్గు కాలుష్యపటంలో నెం:1 అగ్రస్థానంలో గోదావరి నదికిరు వైపులా రామగుండం మంచిర్యాల పారిశ్రామిక ప్రాంతం విలసిల్లుతున్నది. బొగ్గు కారక కాలుష్య ఉత్పత్తిలో భారతదేశంలో అత్యంత ప్రమాదకర ప్రాంతం ఇది కానేకాదని ఎంఓఎల్ఈసిసి, సిపిసిబి వారు ఎన్టీపిసి రామగుండం విద్యుత్ ప్లాంట్ విస్తరణకు పర్యావరణ ప్రజాభిప్రాయ నివేదిక సందర్భంగా ప్రజలకు నిరూపించగలగాలి.

రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజాభిప్రాయసేకరణకు ప్రతిపాదించిన (ఈఐఏ) ఎన్విరాన్మెంట్ ఇంపాక్ట్ అసెస్మెంట్ రిపోర్టులో మాంటెక్ కన్సల్టెంట్స్, సుప్రీంకోర్టు ఆర్డర్లు, పర్యావరణ చట్టాలు తెలియనట్లు అమాయకరీతిలో 10 కిమీ. వ్యాసార్థ పరిధిలో సర్వే చేసేమని చెబుతున్న ఏరియాలో స్థానికంగా ప్రతిపాదిత విస్తరణ ప్లాంట్ కు 15 కిమీ వ్యాసార్థంలో 12 లక్షల జనాభా ప్రతీక్షణం పీల్చుకుంటున్న "గాలి నాణ్యతా ప్రమాణాలు

పర్యాటక కేంద్రంగా సింగూర్ ప్రాజెక్ట్

- వాచ్‌టవర్‌పై రెస్టారెంట్ ఫుడ్‌కోర్ట్ ఏర్పాటుకు చర్యలు
- 29 ఎకరాల్లో రెస్టారెంట్ ఆధునిక కాటేజీల ఏర్పాటు
- రాష్ట్రవ్యాప్తంగా సింగూరు ప్రాజెక్టుకు గుర్తింపు రావాలి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 27 (జనంసాక్షి) : సంగారెడ్డి జిల్లాలోని పుల్కల్ మండలంలో గల సింగూర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సోమవారం సింగూరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో కలిసి మంత్రి క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. సింగూర్ ప్రాజెక్టులో 50 సీట్ల కెపాసిటీతో నడిచే రెండు అధునాతన సౌకర్యాలతో కూడిన బోట్లు, స్పీడ్ బోట్లను ఏర్పాటు చేయాలని మంత్రి పర్యాటక, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. సింగూర్ ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా మాస్టర్ ప్లాన్, రోడ్ మ్యాప్‌లను రూపొందించాలని మంత్రి టూరిజం, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బి శాఖల అధికారులను ఆదేశించారు. సింగూర్ ప్రాజెక్టులో ఉన్న ఐల్యాండ్‌లో వాచ్‌టవర్‌పైన రెస్టారెంట్, ఫుడ్ కోర్ట్, చిల్డ్రన్ ప్లే ఏరియా, ల్యాండ్ స్కేపింగ్, ఆర్ట్ స్కేపింగ్, గార్డెన్‌లను అభివృద్ధిపరచాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టు దిగువ భాగంలో పర్యటకులను ఆకర్షించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రాజెక్టు దిగువ భాగంలోని 29 ఎకరాలలో ఐదు కోట్ల రూపాయలతో అధునాతన రెస్టారెంట్, 25 అధునాతన కాటేజీలు నిర్మించాలని ఇందులో చిల్డ్రన్ ప్లే ఏరియా, ఫుడ్ కోర్ట్, గార్డెనింగ్, గ్రీనరీ, ల్యాండ్ స్కేటింగ్, పార్కింగ్ ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులు ఆదేశించారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సింగూర్ డ్యాంపై భాగంలో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. పర్యటకుల సౌకర్యం కోసం డ్యాంపై వెళ్లడానికి అవసరమైన మెట్ల నిర్మాణం డ్యాం బండ్ వెంట పార్కు అభివృద్ధి సైక్లింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రాజెక్టు పరిసరాలలో సెంట్రల్ లైటింగ్‌కు అవసరమైన ప్రతిపాదనలను ఫిబ్రవరి మొదటి వారం లోపు రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సింగూరు ప్రాజెక్టుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంతో పాటు ఇరుగుపొరుగు రాష్ట్రాల పర్యాటకులు సింగూరు ప్రాంతంకు వచ్చేలా వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. సింగూర్ ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకు లకు అధునాతన వసతులతో కూడిన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని వర్గాలకు చెందిన పర్యాటకులను ఆకర్షించేలా అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు ప్రాజెక్టు దిగువ భాగంలో, ఐలాండ్లో ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకుల సౌలభ్యం కోసం అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పెద్దపీట వేయాలని దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో పెద్దారెడ్డిపేట ఎక్స్ రోడ్డు నుండి సింగూర్ డ్యాం వరకు రహదారులుగా విస్తరణ చేపట్టాలని రహదారి వెంట అధునాతన లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అందోల్ ఆర్డిఓ పాండు, నీటిపారుదల శాఖ అధికారులు జైభీమ్, నాగరాజు, ఆర్‌అండ్‌బి ఇంజనీర్లు రవీందర్, జగదీశ్వర్, పర్యటకశాఖ అధికారి నటరాజ్, రెవెన్యూ శాఖ అధికారులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఏసీబీకి పట్టుబడిన కాళ్లకల్ విద్యుత్ ఏఈ కృష్ణ

తూప్రాన్, జనవరి 27 (జనంసాక్షి) : మెదక్ జిల్లా కాళ్ళకల్ 33/11 కెవి సబ్ స్టేషన్ లో విద్యుత్ ఏ.ఈగా పనిచేస్తున్న చిర్ర కృష్ణ ను ఏసీబీ ఎసిబి అధికారులు 20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకొని అరెస్ట్ చేశారు కాళ్ళకల్ లో లక్కీ ఇండస్ట్రీ అనే నూతన పరిశ్రమ కోసం ట్రాన్స్ పార్మర్ నుండి విద్యుత్ సరఫరా కోసం 20 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హైండ్‌గా మెదక్ రేంజ్ ఏసిబి డిఎస్పి సుదర్శన్ తెలిపారు. మెదక్ జిల్లా మనోహరబాద్ మండలం కాళ్లకల్ విద్యుత్ ఏఈ కృష్ణ కాళ్లకల్ పారిశ్రామిక వాడ లోని కొండాపూర్ లో లక్కీ నూతన పరిశ్రమ ఏర్పాటుకు సంజయ్ ఘోష్ 125 ట్రాన్స్ఫార్మర్ నుండి విద్యుత్ సరఫరా కోసం వెళ్లగా ప్రభుత్వానికి కట్టాల్సిన డిడి లు కడుతూ లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 10 వేలు ఇవ్వగా ఇంకా డబ్బులు కావాలంటూ డిమాండ్ చేసారు. లంచం ఇవ్వడం ఇష్టం లేక అవినీతిశాఖను ఆశ్రయించారు. సోమవారం సంజయ్ ఘోష్ సోమవారం రోజు కాళ్లకల్ ఏఈ కృష్ణకు విద్యుత్ కార్యాలయంలోకి వచ్చి 20 వేలు నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హైండ్ గా పట్టుకున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా కాళ్ళకల్ సబ్ స్టేషన్ లో ఏఈ గా పని చేస్తూ అవినీతి కి పాలుపడి ఏసీబీ వలలో చిక్కుకున్నారు. మెదక్ రేంజ్ ఏసీబీ డిఎస్పీ సుదర్శన్ కాళ్లకల్ విద్యుత్ శాఖ ఏఈ కృష్ణను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు కృష్ణను నాంపల్లి కోర్టుకు తరలించినట్లు తెలిపారు జరుపుతున్నారు.

రైతు సంక్షేమానికే కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే మేఘా రెడ్డి

వనపర్తి బ్యూరో, జనవరి 27 (జనంసాక్షి) : ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభ్యున్నతి కోసం పాటుపడిందని ఇచ్చిన హామీలలో భాగంగా జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం నుంచి రైతుల ఖాతాలలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించిన డబ్బులను జమ చేస్తామని పేర్కొన్న రేవంత్ సర్కార్ ఇచ్చిన మాట ప్రకారమే సోమవారం నుంచి రైతు ఖాతాల్లో రైతు భరోసా డబ్బులను జమ చేస్తుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి రైతన్నల ఖాతాల్లో డబ్బులు జమ అయినట్లు మెసేజ్లు వస్తుండడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నరన్నారు.ఇచ్చిన మాట ప్రకారం ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని, పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బిఆరెస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, బిఆరెస్ చేసిన అప్పుకు సంబంధించి నెల నెల వడ్డీ చెల్లిస్తూనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోపక్క రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పాటుబడి ఉందని ఇచ్చిన హామీలను నెరవేర్చే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

పెబ్బేరు, జనవరి 27 (జనంసాక్షి) : ప్రస్తుత సమాజంలో యాంత్రీకరణ వైపు మనుషులు పరుగెడుతున్న సమయంలో క్రీడలు ప్రతి వ్యక్తికి శారీరక, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం పెబ్బేరు మునిసిపల్ పరిధిలోని ప్రియదర్శిని జూరాల క్యాంపులో పిపిఎల్-15 క్రికెట్ పోటీలను నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి కొద్దిసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్తేజపరిచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిఒక్కరు ఇష్టమైన క్రీడల్లో పాల్గొనాలని దీంతో వ్యక్తికి ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం క్రికెట్ కు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ ఉందని యువకులు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారని అన్నారు .యువకులు తమకు ఇష్టమైన క్రికెట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రంజీ స్థాయి లో ఎదగాలని కోరారు. గ్రామ స్థాయిలో టోర్నమెంట్ లను నిర్వహించడం ద్వారా స్థానిక క్రీడాకారుల గుర్తింపు లభిస్తుందని తెలిపారు. గ్రామస్థాయి నుంచి మండల, తాలూకా, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు ఎదగాలని కోరారు. క్రీడాకారుల అభివృద్ధి కోసం నావంతు సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని గెలుపు కోసం ప్రయత్నం చేయాలని సూచించారు. అలాగే మోడల్ స్కూల్ విద్యార్థులు అండర్ 15 లో గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల, పట్టణ అధ్యక్షులు వనం రాములు, దిలీప్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మెన్ కరుణ శ్రీ సాయినాథ్, వైస్-చైర్మెన్ కర్రె స్వామి, మాజీ మార్కెట్ చైర్మెన్ శ్యామల మన్యం, సీనియర్ నాయకులు విశ్వరూపం, జగన్నాధం నాయుడు, పెద్దింటి వెంకటేష్, ఎల్లారెడ్డి, వడ్డే ఈశ్వర్, రాజశేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ వడ్డె రమేష్, గోవిందు నాయుడు, సహదేవుడు, సొప్పరి బీచుపల్లి, కె. బాలస్వామి, మధు, వేణు, మజీద్ శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీర్జాదిగూడలో ఐదేండ్ల ఆదర్శ పాలన

- సభ్యులందరి సహకారంతో సమగ్రాభివృద్ధి
- ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు
- తొలి మేయర్ జక్క వెంకట్ రెడ్డి
- పాలక మండలి సభ్యులను సన్మానించిన కమీషనర్ త్రిలేశ్వర్ రావు

బోడుప్పల్, జనవరి 27 (జనంసాక్షి) : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్‌గా భవిష్యత్ తరాలకు ఆదర్శ పాలన అందించామని జక్క వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో తొలి మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి,మధుసూదన్ రెడ్డి,దొంతిరి హరిశంకర్ రెడ్డి,కొ ఆప్షన్ సభ్యులు నాజియా జావీద్ ఖాన్‌లను కమీషనర్ త్రిలేశ్వర్‌రావు ఘనంగా శాలువాతో సన్మానించి జ్ఞాపికలను బహుకరించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రంలో పీర్జాదిగూడ నగరపాలక సంస్థకు ప్రత్యేక స్థానం ఉండేలా బాధ్యతలు స్వీకరించిన నాడు రాజ్యాంగంపై చేసిన ప్రమాణం మేరకు నిజాయతీగా.. అవినీతికి ఆస్కారం లేకుండా సభ్యులందరి సహకారంతో పాలన చేశామన్నారు.పదవి చేపట్టిన మొదటి సంవత్సరంలో కోవిడ్ మహమ్మారి వ్యాపించడంతో నగర ప్రజలకు అండగా నిలిచి రెండు పర్యాయాలు కోవిడ్ ఐసోలేషన్ సెంటర్ ఏర్పాటు చేసి భరోసా కల్పించామన్నారు. నగరంలో ఎన్నడూ లేనివిధంగా వరదలు ముంచేత్తడంతో అనేక కాలానీలు నీట మునిగిన సందర్భంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పీర్జాదిగూడ,బోడుప్పల్ కార్పొరేషన్లకు ఎస్ఎన్డిపీ ద్వారా రూ.110 కోట్లను మంజూరు చేసుకోవడం జరిగిందన్నారు. పీర్జాదిగూడ కమాన్ నుండి పర్వాతాపూర్ వరకు 4లైన్ల రోడ్డు విస్తరణ కొరకు హెచ్ఎండిఏ ద్వారా సుమారు రూ.26 కోట్ల నిధులను సమకూర్చుకొని నిర్మాణ పనులు చివరిదశలో ఉన్నాయి. సుమారు రూ.13.5కోట్లతో పీర్జాదిగూడ చెరువును మినీ ట్యాంక్ బండ్ మాదిరి అభివృద్ధి చేయడం ద్వారా నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించడం సంతోషాన్ని కలిగించిందన్నారు. నగరవాసుల దాహర్తిని తీర్చడం కొరకు గతంలో నిర్మించిన 40 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంకులు, రిజర్వాయార్లకు అదనంగా సుమారు 90 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన నూతన రిజర్వాయర్లు,మంచి నీటి సరఫరా కొరకు నూతన పైప్ లైన్ నిర్మాణం చేపట్టడం ద్వారా భవిష్యత్లో నీటి సమస్యకు పరిష్కారం లభించనుంది. పేద, మధ్యతరగతి మహిళలు, నిరుద్యోగ యువతీయువకుల కోసం సెట్విన్ సెంటర్ ఏర్పాటుతో నైపుణ్య శిక్షణ పొంది మెరుగైన ఉద్యోగం,స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. రూ.7.5కోట్లతో సమీకృత శాకాహార, మాంసాహార మార్కెట్, స్వచ్ఛ పీర్జాదిగూడ నిర్మాణం లో భాగంగా ఐటీసీ సహకారంతో కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.4.5 కోట్లతో సమీకృత వ్యర్థాల శుద్ధీకరణ పార్క్‌ను అభివృద్ధి చేసి తడి, పొడి, హానికారక చెత్తను వేరుచేసి సంపద సృష్టించే విధంగా వినూత్న కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్,మాజీ మంత్రులు కేటీఆర్,చామకూర మల్లారెడ్డి లకు కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్లోనూ.. ప్రజలకు సేవ చేసేందుకు సదా అందుబాటులో ఉంటామన్నారు.

చీకట్లో కాలనీలు..రోడ్డెక్కిన సీసీఎస్

- చర్యలు చేపట్టాలని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం

కాప్రా, జనవరి 27 (జనంసాక్షి) : గడిచిన ఆరు, ఏడు నెలలుగా కాప్రా సర్కిల్ పరిధిలో కాలనీల్లో చీకట్లు అలుముకున్నాయి. తక్షణమే పరిష్కారం చూపాలని సీసీఎస్ (చర్లపల్లి కాలనీల సమాఖ్య) సోమవారం ఆందోళన చేసింది. కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట వీధి దీపాల నిర్వహణ మారిందని కరాబైన రోడ్ల స్థానంలో మరమ్మత చర్యలు చేపట్టాలని వీధి కుక్కల నియంత్రణపై చర్యలు చేపట్టాలని నాణ్యమైన మంచినీటి సరఫరా తదితర సమస్యలు పరిష్కారం జరగాలని కోరుతూ పెద్దపెట్టున్న నినాదాలు చేసి నిరసన తెలిపింది. ఈ సందర్భంగా చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి మాట్లాడుతూ కొన్ని నెలలకాలంగా కాలనీలు బస్తీలలో వీధిదీపాలు సరిగా వెలగకపోవడంతో పోకిరీలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడంతో పాటు నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. మైకులు పెట్టీ అంతా బాగుందని గొప్పలు చెప్పుకునే బల్దియా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆయన కోరారు. రోజువారీగా ఇంటింటి చెత్త సేకరణపై నియంత్రణ లేదని పద్మా రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిసిఎస్ ఉపాధ్యక్షులు కొండూరి మురళి పంతులు, సుడుగు మహేందర్ రెడ్డి, యాదవపురం రవి, గంప కృష్ణ, శ్రీనివాస్ నాయక్, బివి నరసింహారెడ్డి, తిరుమల్ రెడ్డి, చిత్తుల కిషోర్, మన్నె నరేష్, రాళ్ల బండి శ్రీనివాస్, వీరబ్రహ్మం, హరి కిషోర్, కాటేపల్లి శివారెడ్డి, లక్ష్మీనారాయణ, రాజు గౌడ్, నరసింహ వంశరాజ్, కొండగళ్ల అశోక్, నారా నరసింహులు, బర్ల రామచంద్రారెడ్డి, కందుల సత్యనారాయణ, షాబాద్ దామోదర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ప్రసాద్ మీనా, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌తో అన్యాయం

- పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు వై. జనార్దన్ రెడ్డి

నారాయణపేట జిల్లా ప్రతినిధి, జనవరి 27 (జనంసాక్షి) : కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ నుంచి అమలు చేయనున్న కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ నుండి ఏకికృత పెన్షన్ స్కీంకు మార్చుతే ఉద్యోగ ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరుగుతుందని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు వై.జనార్ధన్ రెడ్డి అన్నారు. గేజిట్ విడుదల చేసిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ స్కీం లో చేరకుండా నేరుగా సిపిఎస్‌ను రద్దు చేసిన పాత పెన్షన్ విధానం లోకి రావాలని కోరుతూ మంగళవారం నారాయణ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో తహసీల్దార్‌లకు వినతిపత్రం అందచేసారు.ఈ సందర్భంగా నారాయణపేట మండలం తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు.ఎవాందర్భంగా జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం లు ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేస్తూ కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలనీ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో వారి మేనిఫెస్టో లో ప్రకటన చేసినట్లు సిపిఎస్‌ను రద్దు చేసి ఆ పిఎస్‌ను అమలు చేస్తున్నారాన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రము లో కూడా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యుపిఎస్‌లో చేరకుండా నేరుగా సిపిఎస్ రద్దు చేసి ఆ పిఎస్‌లో చేరాలని కోరారు. కార్పొరేట్లులకు వంతానపడుతూ తెచ్చిన మేధావి ఆర్థికవేత్తలు పునరాలోచన చేయాలనీ అయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండలం అధ్యక్షులు ఎం. రఘువీర్, ప్రధాన కార్యదర్శి ఎం. జనార్దన్, ప్రధాన కార్యదర్శి జహీరోద్దీన్, రాష్ట్ర బాధ్యులు.శ్రీనివాస్, నరేష్, సర్సింగ్ రావు, సత్య నారాయణ, వెంకట్రాములు, రాములు, సాయిలు, శ్రీనివాస్, జయశ్రీ, సురేందర్, రాకేష్, అర్చన, ఐశ్వర్య, వెంకటప్ప, అనిత, మహేష్,అనిల్, సాయినాథ్, నర్సిములు, వెంకటయ్య, ఖాలీద్ తదితరులు పాల్గొన్నారు.

నేతన్నకు చేయూత స్కీంలో భారీ కుంభకోణం

- కలెక్టర్‌కు ఫిర్యాదు

గద్వాల నడిగడ్డ, జనవరి 27 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కొరకు ప్రవేశపెట్టిన నేతన్నకు చేయూత స్కీం నందు దాదాపు 70 నుండి 80 లక్షల వరకు ఫ్రాడ్ జరిగిందని ప్రియదర్శిని మహిళా చేనేత సహకార సంఘం అధ్యక్షురాలు బి. సత్యమ్మ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టర్‌కు చేనేత కార్మిక సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన జియో టాక్ నెంబర్లను చేనేత కార్మికులకు తెలియకుండ ఆ నెంబర్‌పై కోట్ల రూపాయల చీరల వ్యాపారం చేసేటటువంటి వ్యాపారులు చేనేత కార్మికుల ముసుగులో లక్షల రూపాయలు లబ్ధి పొందడం జరిగిందని, ఈ విషయంపై విచారణ జరిపించి ఇందుకు పాల్పడినటువంటి వారిపై చేనేత జైళి శాఖ అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని ఈ ప్రభుత్వ సొమ్మును రికవరీ చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు.

నాలుగు పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య

రాయికోడు, జనవరి 27 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారులకు సంబంధించిన మంజూరు పత్రాల పంపిణీకి నాగ్వార్ గ్రామం ఎంపికైంది. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మండలంలోని నాగ్వార్ గ్రామాన్ని ఎంపిక చేసినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య, మండల స్పెషల్ ఆఫీసర్ జగదీష్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎంపీడీవో ఎంఎస్ షరీఫ్ తాసిల్దార్ శ్రీనివాస్ డిప్యూటీ తాసిల్దార్ విజయకుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలాజీ నర్సింలు, పలువురు మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంజయ్య మాట్లాడుతూ గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద 16 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారని, 18 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులు వచ్చాయని 50 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని తెలిపారు. భూమి ఉన్న ప్రతి ఒక్కరికి రైతు భరోసా కింద ఎకరానికి 6, వేల చొప్పున ఖాతాలో జమ చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రమంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో మండలంలోని ధర్మాపూర్ షాపూర్, పాంపాడు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు చెప్పారు, బుదేరా నుండి హస్నాబాద్ కర్చల్ మీదుగా శిరూర్ వరకు డబల్ రోడ్డు నిర్మాణానికి 85 కోట్ల రూపాయలు మంత్రి దామోదర్ మంజూరు చేయగా అందుకు సంబంధించిన టెండర్ లు కూడా పూర్తయినట్లు చెప్పారు. తనకు ఇంతపెద్ద పదవి లభించడం పట్ల తాను ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఎప్పటికి రుణపడి ఉంటానని అంజయ్య తెలిపారు. అనంతరం లబ్ధిదారులందరికీ మంజూరు పత్రాలను అధికారులు నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సరికా, ఏపీవో రమేష్, ఎంపీఓ అంజలీదేవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు కేదార్నాథ్ పాటిల్ ఎం యేసయ్య మాజీ వైస్ చైర్మన్ మహంకాళి, వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి, వైస్ చైర్మన్ భీమయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విదర్శన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ప్రభాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పండరి, సంగమేశ్వర్, జి విట్టల్, జ్ఞానేశ్వర్, రవి పాటిల్, ఎండి రఫీక్, ఎం శివకుమార్, శ్రీనివాస్, నల్లోల ఆగమయ్య ,బాసిత్ పటేల్, హనుమాన్ గౌడ్, శాంత కుమార్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

అతికిరాతకంగా భర్తను హతమార్చిన భార్య

- ముక్కలుగా నరికి గోనె సంచిలో మూటకట్టిన వైనం
- చెత్తకుప్పలో దొరికిన మృతదేహం
- కనిపించడం లేదంటూ పోలీసులకు తప్పుడు ఫిర్యాదు
- ప్రియుడితో పాటు నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

హత్నూర, జనవరి 27 (జనంసాక్షి) : ప్రియుడి మోజులో పడిన ఓ వివాహిత మహిళ కట్టుకున్న భర్తను అతి కిరాతకంగా హతమార్చి ముక్కలుగా నరికి గోనె సంచిలో మూటకట్టి చెత్తకుప్పలో పడేసిన అత్యంత క్రూరమైన ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం పల్పనూర్ గ్రామ శివారులో సోమవారం వెలుగు చూసింది. పోలీసులు,మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా,బిక్నూర్ మండలం,మల్లుపల్లి గ్రామానికి చెందిన మాలె నారాయణ (45) హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్ గ్రామ సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు సంస్థలో సిఈఓగా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడు నారాయణ, భార్య లక్ష్మితో పాటు ఇద్దరు పిల్లలతో బోర్పట్లలో నివాసముంటున్నారు. అయితే మూడు రోజుల క్రితం భార్య లక్ష్మి తన భర్త ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదంటూ హత్నూర పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఇదిలా ఉండగా సోమవారం పల్పనూర్ గ్రామ శివారులో డంపింగ్ యార్డులో గోనె సంచి మూటలో శవాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని శవాన్ని పరిశీలించగా మాలె నారయణదిగా గుర్తించారు.హంతకులు పథకం ప్రకారం వలపన్ని నారాయణను అత్యంత క్రూరంగా వేట కొడవళ్ళతో నరికి చంపి గోనె సంచిలో వేసి పడేసినట్లుగా గుర్తించిన పోలీసులు మృతుడి భార్య లక్ష్మిపై అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు.ఆమె నుంచి సేకరించిన సమాచారం మేరకు లక్ష్మి ప్రియుడితో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.మృతుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్‌గా పి. రవిప్రకాష్

దేవరకొండ, జనవరి 27 (జనంసాక్షి) : దేవరకొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఇంచార్జ్ సూపర్డెంట్ గా పోరిక.రవి ప్రకాష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇంచార్జ్ సూపర్డెంట్ గా పని చేసిన మంక్తా నాయక్ స్థానంలో ఘట్కేసర్ నుండి ఇక్కడికి బదిలీపై వచ్చారు. అనంతరం ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో 24 గంటల వైద్య సదుపాయం అందుబాటులో ఉంటుందని, స్త్రీల వైద్యనిపులు మరియు స్టాఫ్ నర్స్ లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. సీసీ కెమెరాల పరిరక్షణ కలిగి ఉందని తెలిపారు. ఆసుపత్రిలో త్రాగే మంచినీటి సౌకర్యం కొరకు ఆర్ ఓ ప్లాంట్ మంజూర్ అయిందని, నీటి కొరకు అతి త్వరలో బోర్ వెయ్యాల్సి ఉందని తెలిపారు. ప్రజల ఆరోగ్యమే పరమావధిగా ఆసుపత్రిలో వస్తున్న రోగులందరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందించాలని సిబ్బందికి తెలిపారు. ఆసుపత్రిలో ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలని కోరారు. ప్రైవేట్ కు దీటుగా మెరుగైన వైద్య సేవలు అందిస్తామని, నియోజకవర్గ ప్రజలు ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో వీరితో పాటు భాను ప్రసాద్ ,మంగ్త నాయక్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సేవా పథకాలు అందించిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల నడిగడ్డ, జనవరి 27 (జనంసాక్షి) : 2024 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్కృష్ట, అతి ఉత్కృష్టా సేవ పతకాలలో జిల్లా నుండి ఎంపిక అయిన 9 మంది అధికారులలో కొంతమంది అధికారులకు ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు సేవ పతకాలను అందజేయగా సోమవారం ఆలంపూర్ సీఐ రవి బాబు కి జిల్లా ఎస్పీ తన ఛాంబర్ లో సేవ పతకాన్ని అందజేశారు. అలాగే 2024 సంవత్సరానికి గాని శాంతి నగర్ సీఐ టాటా బాబు,ఆలంపూర్ సీఐ జి. రవి బాబు అందించిన ఉత్తమ సేవలకు గాను గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రశంస పత్రాలను జిల్లా ఎస్పీ అందజేశారు.ఈ కార్యక్రమంలో డి.ఎస్పి వై. మొగులయ్య పాల్గొన్నారు.

పాలకవర్గం సేవలు అభినందనీయం

- మున్సిపాలిటీనీ అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా..
- శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ దేవరకొండ

దేవరకొండ, జనవరి 27 (జనంసాక్షి) : దేవరకొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను సమానంగా కలుపుకుంటూ పోతానని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వార్డు సభ్యులు, మరియు కో అప్షన్ సభ్యుల ఆత్మీయ వీడ్కోలు సమావేశం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వార్డు సభ్యులు, మరియు కో అప్షన్ సభ్యులకు సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అలంపల్లి నర్సింహా,నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్,మాజీ ఎంపిపి జాని యాదవ్,పట్టణ మాజీ సర్పంచ్ పున్న వేంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్లు,మున్సిపల్ కమిషనర్ సుదర్శన్,ఏఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

సూర్యాపేట ప్రతినిధి, జనవరి 27 (జనంసాక్షి) : రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షులు సోమయ్య అధ్యక్షతన జరిగిన సూర్యాపేట డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న వివిధ సప్లిమెంటరీ బిల్లులైన సంపాదిత సెలవులు,జిపిఎఫ్ రుణాలు, మెడికల్ రియంబర్స్మెంట్, పెన్షన్ బకాయిలను వెంటనే ఆర్థిక శాఖ ద్వారా క్లియర్ చేయాలని సూచించారు.మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సంబంధించి ఆరోగ్య కార్డులు, మంజూరు చేయాలన్నారు.పదోన్నతులు కల్పించాలని, జీరో వన్ జీరో వేతనాలు అమలు, ఉపాధ్యాయుల ప్రమోషన్లు అమలు చేయాలని సూచించారు.ప్రీ ప్రైమరీ తరగతులను అంగన్వాడీల్లో కాకుండా ప్రాథమిక పాఠశాలలోనే నిర్వహించాలని తెలిపారు. కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టైం స్కేల్ వర్తింపచేయాలని, వివిధ రకాల సెలవులను వర్తింపజేయాలన్నారు.వివిధ మేనేజ్మెంట్ లోని గురుకుల పాఠశాలలో పనివేళలను సరిచేయాలని, గురుకుల పాఠశాల పారిటీ స్కేల్స్ అమలు చేయడంతో పాటు ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని కోరారు.ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ అనిల్ కుమార్, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాకయ్య, జిల్లా ఉపాధ్యక్షులు అరుణ భారతి, జిల్లా కోశాధికారి వెంకటయ్య, జిల్లా కార్యదర్శి బి.ఆడం, రమేష్,లాలు,శోభారాణి, వీరారెడ్డి, శీను,అభినవ్, కరుణాకర్ రెడ్డి, నాగేశ్వరరావు, ప్రవీణ్ కుమార్, శీనయ్య, దయాకర్, రాజన్న,వంశీ,భిక్షం, సత్యనారాయణ, ఉదయభాస్కర్, సైదా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వికృత వైఖరి పట్ల గ్రామ గ్రామాన చర్చలు పెట్టాలి

- స్థానిక ఎన్నికలలో సత్తా చాటాలి
- పార్టీ సర్వసభ్య సమావేశంలో కార్యకర్తలకు దిశా నిర్దేశం
- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

కోదాడ, జనవరి 27 (జనంసాక్షి) : ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని, బిఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావాడం ఖాయం అని కోదాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ శాసన సభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు.సోమవారం అనంతగిరి మండల పరిధిలోని చనుపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ హాజరై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికలలో సత్తాచాటాలి అని పిలుపునిచ్చారు.ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం అయింది అని తెలిపారు. ఈ సమావేశంలో అమీనాబాద్ గ్రామానికి చెందిన మల్లెపల్లి వెంకటేశ్ ను ఆ గ్రామ యూత్ అధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నల్లా భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుగులోత్ శ్రీనివాస్ నాయక్,ఎస్టీ సెల్ అధ్యక్షులు భూక్యబోస్, మాజీ సొసైటీ చైర్మన్ ఉషారాణి హనుమంతరావు, ఉపాధ్యక్షులు అప్జల్, పార్టీ నాయకులు మట్టపల్లి సైదులు, ప్రసాదు, బెల్లంకొండ ఏడుకొండలు, మట్టపల్లి పుల్లయ్య గౌడ్, రామినేని పూర్ణచందర్ రావు, ధన్వంత రెడ్డి, రామిరెడ్డి, పోరళ్ల సత్యనారాయణ, ఐయితనబోయిన వెంకటేశ్వర్లు, యాకూబ్, అన్ని గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, సింగల్ విండో డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు

నల్గొండ బ్యూరో, జనవరి 27 (జనంసాక్షి) : పాతబడిన అంగన్వాడి కేంద్రాలు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు,ఏరియా ఆసుపత్రుల స్థానంలో నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. మండలాల ప్రత్యేక అధికారులు,సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అలాగే పాతబడిన అద్దె భవనాలలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రాలను వెంటనే కొత్త భవనాలలోకి మార్చాల్సిందిగా ఆమె ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.అనంతరం ఆమె జిల్లా అధికారుల సమ్మిలిత సమావేశంలో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నుండి ప్రారంభించిన రైతు భరోసా పెండింగ్ రఖాస్తులన్నింటిని నెలాఖరులోగా పరిష్కరించాలని జిల్లాలోని అందరూ రెవెన్యూ డివిజనల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అలాగే ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని చెప్పారు. సుమారు(119) మంది పిర్యాదుదారులు వారి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ తో పాటు,అధికారులకు సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జంతువులపై క్రూరత్వాన్ని ప్రదర్శించకుండా అవగాహన కల్పించేందుకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు,గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు,నల్గొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి,పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ యంత్రాంగం కృషి అభినందనీయం

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట ప్రతినిధి, జనవరి 27 (జనంసాక్షి) : జిల్లాలో ప్రతిష్టాత్మక నాలుగు పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు జారీ ప్రక్రియ విజయవంతంగా అమలు చేయడంలో భాగస్వాములైన గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఉన్న ప్రభుత్వ యంత్రాంగం సేవలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో వేబెక్స్ వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న పథకాలకు లబ్ధిదారుల ఎంపికకై ఈ నెల 16 నుండి 20 వరకు క్షేత్రస్థాయి విచారణ, 21 నుండి 24 వరకు గ్రామసభలు నిర్వహణలో ప్రజల సహకారం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ పథకాలను విజయవంతంగా అమలు చేయడానికి అధికారుల కృషి, పనితీరును ప్రశంసించారు. ఆహార భద్రత కార్డులు కొరకు సోషల్ ఎకనామిక్స్ సర్వే, మీ సేవ, ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తులను పరిశీలించి ఇవ్వాలని ఉద్యోగులు, ఇన్కమ్ టాక్స్ కట్టే వారి దరఖాస్తులు రిజక్ట్ చేయలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, డిఆర్డిఓ పిడి వివి.అప్పారావు, డిఈఓ అశోక్, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి జగదీశ్ రెడ్డి, డీఎస్ఓ రాజేశ్వరరావు, డిడబ్ల్యుఓ నరసింహారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడి శ్రీనివాస్ నాయక్, ఇండస్ట్రియల్ అధికారి సీతారాం నాయక్ , అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేర నియంత్రణకు వారానికి, నెలకు ప్రత్యేక కార్యాచరణ

- నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట జిల్లా బ్యూరో, జనవరి 27 (జనంసాక్షి) : నారాయణపేట జిల్లాలోని అన్ని శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. సోమవారం ఉదయం నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బెన్సలెంతో కలిసి జిల్లా అధికారులు, పోలీసులుతో ఆఫ్ ఇయర్లీ సమన్వయ సమావేశం నిర్వహించి జిల్లా అభివృద్ధి చెందడానికి అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ఎస్పి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గత రెండు సంవత్సరాలలో జరిగిన నేరాలు, ప్రజల నుండి స్వీకరించిన ఫిర్యాదులు వాటికి సంబంధించి వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ ఆఫీసర్ ప్రసాద్ రెడ్డి, ఎక్సైజ్ సూపర్డెంట్, డిటిఓ మేఘ గాంధీ, డి ఎం అండ్ హెచ్ ఓ, సౌభాగ్య లక్ష్మి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సురేష్, ఆకుల బాలప్ప, మెనూ ,సిఐలు శివ శంకర్ ,రామ్ లాల్, చంద్రశేఖర్, రాజేందర్ రెడ్డి, దస్రు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే, నేతాజీ అవార్డుల ప్రదానం

సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 27 (జనంసాక్షి) : కొమ్మూరి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సావిత్రిబాయి పూలే మహిళా లెజండరీ అవార్డులు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ ఛైర్మన్ డా.కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణా తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఛైర్మన్ డా.పితాని రామకృష్ణగౌడ్, భారత స్వచ్ఛంద సంస్థల సమాఖ్య అధ్యక్షులు కళారత్న డా.బిక్కి కృష్ణ,డి.సి.పి.రామదాస్ తేజావత్, వల్లరి ఫౌంఢేషన్ ఛైర్మన్ శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ కోటేశ్వరరావ్, సంఘసేవకులు జయపాల్, రెవరెండ్ శ్యామ్యూల్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కే. శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ రంగాలలో విశిష్ట సేవలు చేసిన సేవామూర్తులను గుర్తించి మహాత్ముల పేరుతో పురస్కారాలు ప్రదానం చేయడం జరిగిందన్నారు. 40 మందికి సావిత్రిబాయిపూలె, 45 మందికి నేతాజీ పురస్కారాలతో పాటు ప్రశంసా పత్రం మెమొంటోను అందజేయడం జరిగిందని తెలిపారు. కొమ్మూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ సామాజిక కార్యక్రమాలలో భాగంగా వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి ట్రస్టు తరపున పురస్కారాలు అందజేయడం జరుగుతుందని శ్రీనివాస్ తెలిపారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఛైర్మన్ డా.పితాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ కొమురి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ తాను చేస్తున్న సేవలు అంకిత సేవాభావానికి నిదర్శనమన్నారు. సమాజ సేవలో కొమ్మోరిచారిటబుల్ ట్రస్ట్ నిరంతరాయంగా కృషిచేయడం అభినందనీయమని వక్తలు అభిప్రాయపడ్డారు.

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

- రోడ్డు భద్రతా నియమ నిబంధనలు పాటించాలి
- ప్రమాదాల నివారణకై మిషన్ త్రిబుల్ ఆర్ నూతన కార్యక్రమం ఏర్పాటు
- రోడ్డు ప్రమాదాల రహిత డివిజన్ గా మార్చడమే లక్ష్యం
- అడిషనల్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ పి.మౌనిక ఐపీఎస్

కొండమల్లేపల్లి, జనవరి 27 (జనంసాక్షి) : జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా జిల్లాలో యాక్సిడెంట్ ఫ్రీయే లక్ష్యంగా మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మిషన్ త్రిబుల్ ఆర్ కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎఎస్పి మౌనిక మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా రోడ్డు నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల బారిన పడకుండా ఉండాలన్నారు. ప్రమాదాలు ఎక్కువగా అతివేగంగా వాహనాలు నడుపుతూ అనేక ప్రమాదాలకు గురి అవుతున్నారని, వాహనాలు నడిపే సమయంలో తమ ప్రాణాలనే కాకుండా తమపై ఆధారపడిన కుటుంబసభ్యులను దృష్టిలో వుంచుకొని వాహనాలను నడుపుతూ సురక్షితంగా గమ్యస్థానం చేరుకోవాలని అన్నారు. వాహనదారులు వాహన వేగం నిర్ణీత వేగం తగ్గించి నడపడం వల్ల ప్రమాదాలు తగ్గుతాయని అన్నారు. డ్రంకెన్ డ్రైవ్, అతివేగం, మొబైల్ ఉపయోగిస్తూ డ్రైవింగ్, సీట్ బెల్ట్ లేకుండా ప్రయాణించుట హెల్మెట్ లేకుండా ప్రయాణించడం లాంటి సమయంలో రోడ్డు ప్రమాదం సంబవిస్తే అధిక ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ ధనుంజయ, ఎస్ఐ ముత్యాల రామూర్తి డి.టి.ఆర్బి, పోలీస్ కళాబృందం స్థానిక ప్రజలు, యువకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చదువుల కోటగా రాణించాలి

సొసైటీ కి తమ వంతు సేవా చేద్దాం

వైద్య శాస్త్రవేత్త మన్నె ఉపేందర్

పాపన్నపేట,జనవరి 27(జనంసాక్షి):

సమాజనికి సేవ చేయాలని,చదివిన బడిని మరువ వద్దని వైద్య శాస్త్రవేత్త మన్నే ఉపేందర్ విద్యార్థులకు సూచించారు.సోమవారం నాడు పాపన్నపేట ఉన్నత పాఠశాలలో తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని తన సతీమణి వందనతో కలిసి ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.తాను సంపాదించుకున్న ఆస్తుల్లో ఎంతో కొంత సమాజ సేవకు వినియోగించాలని అన్నారు.తనకంటే ధనవంతులు ఎంతోమంది ఉన్నారని తమతోపాటు వారు కూడా వారు సేవ చేస్తే సమాజానికి ఎంతో లబ్ధి చేకురుతుందని పేర్కొన్నారు. సమాజంలో ఎవరు పూలబాటపై పయనించరని,ఎంతటి వారైనా కష్టసుఖాలను ఎదుర్కోవాల్సిందే అన్నారు.చదువుల కోటగా పాపన్నపేట రాణించాలని ఆకాంక్షించారు.ఒబామా వైద్య సలహాదారుగా పనిచేశానంటే దాని వెనుక ఎంతో కష్టం ఉందన్నారు.తాను ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని విద్యార్థులు వివిధ రకాలుగా వినియోగించుకోవడానికి ఏర్పాటు చేశానని కేవలం పత్రికలు పుస్తకాలు చదవడమే కాకుండా సైన్స్ పరంగా తాను తన మిత్రులతో కలిసి అమెరికా నుండి విద్యార్థులకు సైన్స్ క్లాసులు తీసుకోవాలన్న యోచనతో స్క్రీన్ ఏర్పాటు చేశానని అన్నారు.ఈసందర్భంగా విద్యార్థులకు క్యాన్సర్ పై అవగాహన కల్పించారు.ఆయన రెండు లక్షల వ్యయంతో లైబ్రరీ ఏర్పాటు చేయడం పట్ల విద్యార్థులు,స్థానికులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్,పాఠశాల చైర్మన్ భవాని,జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి,విశ్రాంత మండల విద్యాధికారి మోహన్ రాజు,ఉపాధ్యాయులు అంజా గౌడ్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతూనే బంగారు భవిష్యత్తు

ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి

మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 27 (జనం సాక్షి):

చదువే విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని కిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం మాజీ సర్పంచ్ తిరునగిరి గోదావరి వెంకట్ రాములు పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిల్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిల్ లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ సర్పంచ్ తిరునగిరి గోదావరి వెంకట్ రాములు గ్రామ ప్రజలు, పాఠశాల విద్యార్థులకు చేసే సేవలను ఆమె కొనియాడారు. గత ప్రభుత్వం విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పనకు కృషి చేసిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం ,స్కూల్ యూనిఫామ్, ఉచిత నోట్ పుస్తకాలను పాఠ్యపుస్తకాలను గత కెసిఆర్ ప్రభుత్వం అందజేసింది అన్నారు. సెల్ ఫోన్లు ఇతర వ్యాపకాలపై విద్యార్థులు పెట్టకుండా చదువులో రాణించాలని ఎమ్మెల్యే విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాఠశాలలో ఏర్పాటుచేసిన సరస్వతీమాత విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణరావు, ఏపీఓ మైపాల్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, మండల టిఆర్ఎస్ అధ్యక్షుడు గౌరీ శంకర్ గుప్తా, మండల యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు ముత్యం గారి సంతోష్ కుమార్, వేమారెడ్డి, కరెంట్ రాజా గౌడ్, పోతం శెట్టిపల్లి మాజీ సర్పంచ్ యాదయ్య, మాజీ కోఆప్షన్ సభ్యులు ఆజాం తదితరులు పాల్గొన్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం కిష్టాపూర్ గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం నాలుగు లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డు పనులకు సోమవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అలాగే కిష్టాపూర్ గ్రామానికి చెందిన సత్తెమ్మ, శంకర్ లకు కిష్టాపూర్ మాజీ సర్పంచ్ తిరునగిరి గోదావరి వెంకట్రాములతో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

అరుణ్ ఐస్ క్రీమ్స్ గోవిందపూర్ ఫెసిలిటిలో కొత్త ఉత్పత్తి మైలురాయి

వరంగల్ ఈస్ట్ , జనవరి 27 (జనం సాక్షి)

హాట్ సన్ అగ్రో ప్రోడక్ట్ లిమిటెడ్ ఐస్ క్రీమ్ బ్రాండ్ అయిన అరుణ్ ఐస్ క్రీమ్స్, గోవిందపూర్ ఫెసిలిటిలో రోజుకు 1.27 లక్షల కిలోల ఐస్ క్రీమ్స్ ఉత్పత్తి చేస్తూ ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. పెరుగుతున్న వినియోగదారుల డిమాండ్‌ను తీర్చడంలో కంపెనీ నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది. 2022లో స్థాపించబడిన గోవిందపూర్ ప్లాంట్ 113 ఎకరాలను విస్తరించి ఉంది మరియు ఇది భారతదేశంలో అతిపెద్ద ఐస్ క్రీమ్ తయారీ యూనిట్‌గా గుర్తింపు పొందింది. ఈ ప్లాంట్ అత్యాధునిక రోబోటిక్ సాంకేతికతతో పాటు అదునాతన పరికరాలను కలిగి ఉంది, ఇవి విభిన్న రకాల ఐస్ క్రీమ్ ఉత్పత్తులను అధిక సామర్థ్యం, ఖచ్చితత్వం మరియు నాణ్యతతో ఉత్పత్తి చేయడంలో సహాయపడతాయి. ఈ మైలురాయిని పురస్కరించుకుని, 2025 జనవరి 27న గోవిందపూర్ ఫెసిలిటిలో అరుణ్ ఐస్ క్రీమ్స్ "కిడ్స్ అడ్వెంచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం" ను నిర్వహించింది. 2025 జనవరి 20న ప్రారంభమైన ఈ కార్యక్రమం, పిల్లలకు స్థిరత్వం మరియు ఐస్ క్రీమ్స్ తయారీపై అవగాహన కల్పించడంతోపాటు సంతోషకరమైన అనుభవాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

తిమ్మంపేట గ్రామానికి సోలార్ పవర్ ప్రాజెక్ట్ కేటాయించాలి

కలెక్టర్ కు వినతిపత్రం అందించిన గ్రామస్తులు

వరంగల్ ప్రతినిధి, జనవరి 27 (జనంసాక్షి)

సోలార్ పవర్ ప్రాజెక్ట్ తిమ్మంపేట గ్రామానికి కేటాయించాలని వరంగల్ జిల్లా కలెక్టరేట్లో కలెక్టర్ సత్య శారదాదేవి కి గ్రామ మాజీ సర్పంచ్ మోడెం విద్యాసాగర్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు ధోసపాటి జెనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సోలార్ పవర్ ప్రాజెక్ట్ దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామంలో కేటాయించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సోలార్ పవర్ ప్రాజెక్ట్ కు అనుగుణంగా మౌలిక వసతులు అన్ని కూడా సౌకర్యాలు ఉన్నాయని వినతిపత్రంలో తెలిపారు తిమ్మంపేట గ్రామానికి పవర్ ప్లాంట్ మంజూరు చేసి ఈ ప్రాంతా అభివృద్ధి కోసం కృషి చేయాలని అధికారులను కోరారు.. తద్వారా గ్రామంలో కొంత నిరుద్యోగులకు ఉపాధి కల్పన, మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడి ముందుకు సాగుతారని ఈ ప్రాంత పరిస్థితుల దృశ్య పవర్ ప్లాంట్ కేటాయించి ఆదుకోవాలని కలెక్టర్ ఇచ్చిన వినలేక పట్టణంలో మాజీ సర్పంచ్ విద్యాసాగర్ , గ్రామస్తులు కోరారు.

రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదు

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

చేర్యాల మున్సిపల్ పాలకమండలి వీడ్కోలు సమావేశం

చేర్యాల, జనవరి 27 (జనంసాక్షి) :

రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదని, ప్రజా సేవ చేసి ప్రజల మన్ననలు పొందాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం చేర్యాల మున్సిపల్ కమిషనర్ నాగేందర్ అధ్యక్షతన జరిగిన పాలకమండలి వీడ్కోలు సమావేశానికి ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. చేర్యాల పట్టణ అభివృద్ధికి కౌన్సిల్ సభ్యులు ఎంతో కృషి చేశారని, ఎన్నికైన కొద్ది రోజులకే కరోనా కష్టకాలం మొదలైనా ప్రజలను కంటికిరెప్పలా కాపాడుకున్నారని అన్నారు. నిధుల కేటాయింపులో పార్టీల విబేధాలు ఉండకుండా చూస్తానని, పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉంటే చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేసి అభివృద్ధి కార్యక్రమాలు మొదలు చేసేవాడినని, డివిజన్ వచ్చేవరకు అధికార పార్టీ దగ్గర తన వంతు పాత్ర తప్పకుండా పోషిస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో చైర్మన్ అంకుగారి స్వరూప రాణి, వైస్ చైర్మన్ రాజీవ్ రెడ్డి కౌన్సిలర్లు చెవిటి లింగం, మంగోలు చంటి, ఆడేపు నరేందర్, యాట కనకవ్వ, జుబేదా ఖాతూమ్, ఉడుముల ఇన్నమ్మ, సందుల సురేష్, తుమ్మలపల్లి లీల, ముస్త్యాల తార, పచ్చిమడ్ల సతీష్ లను ఎమ్మెల్యే,కమిషనర్ లు సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిపాలనలో తమకు సహరించిన పాలక మండలి సభ్యులకు,

మున్సిపల్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో వీరశైవ లింగాయత్ లకు ప్రాధాన్యత ఇవ్వాలి

లింగాయత్ సమాజాన్ని పటిష్ట పరచడమే లక్ష్యం

వీరశైవ లింగాయత్ సమాజం జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు

సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 27(జనంసాక్షి)

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వీరశైవ లింగాయత్ లకు ప్రాధాన్యత ఇవ్వాలని వీరశైవ లింగాయత్ సమాజం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు పేర్కొన్నారు. సంగారెడ్డి లోని శివ బ్యాంకెట్ హాల్ లొ జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం అనంతరం మొదటి సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు అధ్యక్షతన సమావేశం కొనసాగింది. జిల్లా సాధారణ సమావేశం తో పాటు అనుబంధ సంఘం అయినా యువజన, మహిళా విభాగాలకు సంబంధించిన జిల్లా లోని 5 నియోజకవర్గాల కార్యవర్గ సభ్యులు హాజరైనారు. గ్రామస్థాయిలో వీరశైవ లింగాయత్ సమాజాన్ని పటిష్ట పరిచేందుకు మండల నియోజకవర్గ కమిటీలను వేయాలని జిల్లా కమిటీ తీర్మానించింది.ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులకు అవకాశం వస్తే వారిని బలపరిచి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పిటిసి, మున్సిపల్ కౌన్సిలర్, చైర్మన్, వార్డు సభ్యులను లింగాయత్ సమాజానికి సంబంధించిన వారిని గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. త్వరలో కంది మండలంలోని కాశీపూర్ గ్రామ శివారులో వీరశైవ లింగాయత్ సమాజం భవనం నిర్మాణం అందరి సహకారంతో నిర్మాణం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సులుగంటి సిద్దేశ్వర్ , రాష్ట్ర నాయకులు సిహెచ్ బసవరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పట్లోళ్ల చంద్రశేఖర్ , ప్రధాన కార్యదర్శి కొంక రాజేశ్వర్, కోశాధికారి పోలీస్ సంతోష్ పాటిల్ , యువజన అధ్యక్షులు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి నవీన్ రామోజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంత్ పాటిల్, మహిళా అధ్యక్షులు పి. అరుణ, ప్రధాన కార్యదర్శి గొర్రె గట్టు శారద , గౌరవ అధ్యక్షులు కే.అరుణ, జిల్లా ఉపాధ్యక్షులు చల్మెడ బసవరాజ్, సభ్యులు పాల్గొన్నారు.

పదోన్నతి అర్హత పరీక్షకు పరిశీలించిన సిపి

వరంగల్ బ్యూరో, జనవరి 27 (జనం సాక్షి)

: హెడ్ కానిస్టేబుళ్లకు ఏ. ఎస్. ఐగా పదోన్నతికై మడికొండ పోలీస్ శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన అర్హత పరీక్షను వరంగల్ పోలీస్ కమిషనర్ సోమవారం పరిశీలించారు. భద్రాద్రి, కాళేశ్వం జోన్ల పరిధిలో వివిధ పోలీస్ స్టేషనలలో విధులు నిర్వహిస్తున్న 108 సివిల్ హెడ్ కానిస్టేబుల్లకు అందజేసే ఏ. ఎస్. ఐ పదోన్నతికై సిటీ పోలీస్ శిక్షణ కేంద్రంలో అర్హత పరీక్షలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పరీక్షలో అర్హత సాధించిన హెడ్ కానిస్టేబుల్ కు ఖాళీలను ఏ. ఎస్ ఐ గా పదోన్నతి కల్పించడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ ఈ సందర్భంగా శిక్షణార్థుల సౌకర్యం కోసం నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ భోధన బోర్డు లను పోలీస్ కమిషనర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాల్గవ పటాలం కామాండెంట్ రాంప్రకాష్, అదనపు డీసీపీ రవి, వైస్ ప్రిన్సిపాల్ రమణ బాబు, ఇన్స్ స్పెక్టర్లు రవికుమార్,కిషన్ పాల్గొన్నారు.

భవన నిర్మాణంలో భూకంపాలను తట్టుకునే పరిజ్ఞానం

ఎన్ఐటీ పూర్వ డీన్ ప్రొఫెసర్ కట్టా వెంకటరమణ

పటాన్చెరు జనవరి27 (జనంసాక్షి)

భూకంపాలను తట్టుకునేలా భవనాలను రూపొందించేందుకు అత్యాధునిక పరిజ్ఞానం, వినూత్న పద్ధతులు అందుబాటులో ఉన్నాయని ఎన్ఐటీ సూరత్కల్ మాజీ డీన్ (విద్య) ప్రొఫెసర్ కట్టా వెంకటరమణ చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఇంజనీరింగ్ భూకంప శాస్త్రం %-% గత భూకంపాల నుంచి నేర్చుకోవడం' అనే అంశంపై సోమవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు.భూకంప నిరోధక భవన నిర్మాణ డిజైన్ కోసం బేస్ ఐసోలేషన్ టెక్నిక్, బ్రేసింగ్ సిస్టం వంటి పలు వినూత్న పద్ధతులు ప్రస్తుతం అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఎయిర్ బ్యాగ్ విధానంలో, భూకంపం వచ్చినప్పుడు భవనం కొద్దిగా పైకి లేచి, ప్రకంపనలు తగ్గిపోగానే యథాతథ స్థితికి వచ్చే అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కూడా అందుబాటులో ఉందన్నారు. భూకంపాలు సహజంగా టెక్టోనిక్ ప్లేట్లు ఢీకొనడం వల్ల సంభవిస్తాయని, సీస్మోగ్రాఫ్ ద్వారా దాని తీవ్రతను కొలుస్తారని చెప్పారు. భూకంప సంఘటనలకు వ్యతిరేకంగా భద్రత, స్థితిస్థాపకతను పెంచడానికి అనుగుణంగా నిర్మాణాలను రూపొందించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ చేపూరి అఖిలేష్ అతిథిని విద్యార్థులకు పరిచయం చేసి, ఆయన విలువైన సమయాన్ని కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రంగనాయక సాగర్ నుండి నీటిని విడుదల చేయాలి

రాష్ట్ర ఆయిల్ ఫామ్ రైతు వెల్ఫేర్ ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి

నంగునూర్ జనవరి 27 (జనంసాక్షి)

నంగునూరు మండలం అక్కనపల్లి గ్రామానికి చెందిన రైతులు రంగనాయక సాగర్ సాగర్ కు వెళ్లి ప్రాజెక్ట్ ఇరిగేషన్ అధికారులని కలిసి నీటి ఎద్దడి దృశ్య పంటలు ఎండిపోతున్నందున నంగునూరు మండలానికి నీటిని విడుదల చేయాలని వినతి పత్రం అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు వెల్ఫేర్ ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి మాట్లాడుతూ రంగనాయక సాగర్ నుండి నీటిని వెంటనే విడుదల చేయాలని రైతుల పంటలు కాపాడాలని ప్రాజెక్ట్ ఇరిగేషన్ అధికారులను కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో అక్కనపల్లి గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు

బాధితులకు అండ ముఖ్యమంత్రి సహాయనిధి

ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

నిజాంపేట్ జనవరి 27 (జనం సాక్షి)

వివిధ కారణాల వల్ల అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి తోడ్పడుతుందని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు . సోమవారం నిజాంపేట్ మండలంలోని రామ్ రెడ్డి పేట కు చెందిన మాజీ సర్పంచ్ తనయుడు భూమేష్ కు రెండు లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతు హాస్పిటల్లో చికిత్స పొందుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను చిత్తశుద్ధితో అమలు చేస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో రమేష్ చౌహాన్ ,శ్రీకాంత్, శ్రీహరి పాల్గొన్నారు.

ఎల్వీపీఈఐ రీహాబిలిటేషన్‌కు గవర్నర్ ఎక్స్‌లెన్స్ అవార్డ్

హైదరాబాద్, జనవరి 27 (జనంసాక్షి)

దివ్యాంగుల సాధికారతకు కృషి చేస్తున్న ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ (ఎల్వీపీఈఐ)లోని ఇనిస్టిట్యూట్ ఫర్ విజన్ రీహాబిలిటేషన్ (ఐవీఆర్)కు గవర్నర్ ఎక్స్‌లెన్స్ అవార్డ్ దక్కింది. ఈ అవార్డును రాజ్ భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఐవీఆర్ హెడ్ డాక్టర్ బ్యూలా క్రిస్టీ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ హైకోర్టు కార్యనిర్వాహక ప్రధాన న్యాయమూర్తి సుజోయ్ పాల్, కేంద్ర గనులు, బొగ్గు శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ ఐవీఆర్ 1992లో స్థాపించబడింది. ఈ అవార్డు సంస్థ నిబద్ధత, కృషి, పురోగతి, పనితీరుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. రాజ్ భవన్ (తెలంగాణ) చరిత్రలో తొలిసారిగా ప్రారంభమైన ఈ గవర్నర్ ఎక్స్‌లెన్స్ అవార్డులు 2024లో వ్యక్తులు, సంస్థల అసాధారణ కృషిని గుర్తిస్తూ 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రదానం చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
28 జనవరి 2025

ప్రజావాణికి 93 దరఖాస్తులు

- ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు
- సంక్షేమ పథకాలు అర్హులకే అందేలా చూడాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట ప్రతినిధి, జనవరి 27 (జనంసాక్షి) : సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 93 దరఖాస్తులు వచ్చాయని, సంబంధిత శాఖ అధికారులు వచ్చిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్పవార్ అన్నారు.ఇంటర్మీడియట్ పరీక్షల కొరకు అని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు.పోలీస్ శాఖ వారు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించాలని, సిఆర్ పిసి సెక్షన్ ప్రకారం 144 సెక్షన్ అమలుపరచాలని అన్నారు. జిరాక్స్ సెంటర్లన్ని బంద్ చేయాలని అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఆర్టీసీ వారు పరీక్షల సమయంలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 3 నుండి 22 వరకు, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు మార్చి 5 నుండి 25 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వార్షిక పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్ష సమయానికి అన్ని రోడ్లలో బస్సులను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్స్ నందు చదువుతున్న విద్యార్థుల కొరకు వారు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా సంక్షేమ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.అన్ని పరీక్ష కేంద్రాల వద్ద వైద్య,ఆరోగ్య శాఖ అధికారులు ప్రాథమిక చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ శాఖ వారు నిరంతరంగా విద్యుత్ సరఫరా ఉండే విధంగా చూడాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు పరీక్ష కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా, పరీక్ష కేంద్రాల వద్ద త్రాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాలను అధికారులు అర్హులైన వారికి అందేలా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి అందేలా చూడాలని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ రాంబాబు, డిఆర్డిఓ పిడి వివి అప్పారావు, సిపిఓ ఎల్.కిషన్, ఎల్డిఎం బాపూజీ, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, డిటిడివో శంకర్, డిఈఓ అశోక్, ఎస్సీ అభివృద్ధి అధికారి లత, బిసి అభివృద్ధి అధికారి అనసూయ, మైనార్టీ వెల్ఫేర్ అధికారి జగదీశ్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ డీఎం శర్మ, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమర్థవంతంగా బేటి బచావో - బేటి పడావో

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 27 (జనంసాక్షి) : బేటి బచావో -బేటి పడావో కార్యక్రమం జిల్లాలో సమర్థవంతంగా అమలవుతుందని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశాల్లో మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఆధ్వర్యంలో మిషన్ శక్తి మహిళా సాధికారిత కేంద్రం బేటి బచావో బేటి పడావో 10 సంవత్సరాల దశాబ్ది ఉత్సవాల భాగంగా బేటి బచావో బేటి పడావో పోస్టర్స్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ ఆవిష్కరించి, సిగ్నేచర్ క్యాంప్ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలిక విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని మహిళా సాధికారత దిశగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డిఓ శ్రీనివాసరావు, జిల్లా సంక్షేమ అధికారిని హైమావతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీరామ్, డిఇఓ, రాధా కిషన్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాధవి, డిపిఓ యాదయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, ఇతర శాఖ ఉద్యోగులు, పాల్గొన్నారు.

అసలైన రైతులను గుర్తించాలి

ఝరాసంగం, జనవరి 27 (జనంసాక్షి) : మండల పరిధిలోని చీలపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబరు 112, 125,126, 148, 103లో సుమారు 36 ఎకరాలకు నిమ్జ్ సంబంధించి నష్టపరిహం అసలైన రైతులకు అందలేదని లబ్దిదారులు మహబూబ్ పాటిల్, శ్రీకాంత్ రెడ్డి, చంద్రయ్య, ఈరన్న, సంగన్న, వెంకటేషం, నరేష్‌లు వాపోయ్యారు. సోమవారం అసిసస్టెంట్ ట్రైనీ కలెక్టర్ మనోజ్ కు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ భూములకు సంబంధించిన నష్టపరిహారం ఇప్పటి వరకు తమకు అందలేదన్నారు. నష్టపరిహారం అందేంత వరకు భూముల కబ్జాలో నుంచి వెళ్లే ప్రసక్తే లేదన్నారు. సరైన రైతులను గుర్తించకుండా అప్పటి అధికారులు వారి ఇష్టానుసారంగా నష్టపరిహారం అందజేశారన్నారు. అసలైన రైతులను గుర్తించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధించాలి

మఖ్తల్, జనవరి 27 (జనంసాక్షి) : కేంద్ర ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం కు బదులుగా ప్రవేశపెట్టిన యునైటెడ్ పెన్షన్ స్కీమ్ యు.పి.ఏస్ వ్యతిరేకిస్తూ పి ఆర్ టి యు టి ఏస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం భోజన విరామ సమయంలో మక్తల్ మండల తహసిల్దార్ సతీష్ కి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యునైటెడ్ పెన్షన్ స్కీం లో చేరొద్దని, ప్రభుత్వం మేనిఫెస్టో లో పెట్టిన విధంగా ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ఇవ్వాలని వినతి పత్రం ను జిల్లా అధ్యక్షులు తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి జి. బాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జీ.రమేష్, విధుర్ కుమార్ లు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత లేని నేషనల్ పెన్షన్ స్కీమ్ లో భాగంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 2004 సెప్టెంబర్1 నుండి ప్రవేశ పెట్టడం జరిగిందని తెలిపారు. భద్రత లేని ఈసిపిఏస్ విధానాన్ని దేశవ్యాప్తంగా ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. దీని దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఏదో కంటితుడుపు చర్యగా కొన్ని మెరుగులు అద్ది పాత పెన్షన్ పోలి ఉండేలా చూసి తమ ఉద్యోగులకు తేది 01.04.2025 నుండి యు పి ఎస్ (ఏకీకృత పెన్షన్ స్కీమ్)ను అమలు చేయనున్నారు. అదే విధంగా రాష్ట్రాలను ఈస్కీమ్ ను అమలు చేయమని కోరే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన పిఎఫ్ఆర్‌డిఎ మరొక్కసారి రాష్ట్ర ప్రభుత్వం తమ ఉద్యోగులకు ఏ విధమైన పెన్షన్ విధానాన్ని ఎంపిక చేసుకుంటారని ఆప్షన్ కోరగా సిపిఏస్ విధానం నుండి వైదొలగటానికి అవకాశం వచ్చినప్పటికీ నాటి తెలంగాణ ప్రభుత్వం 2014 ఆగస్టు 23 నా 28 జీవో ద్వారా విధానాన్ని కొనసాగించి సిపిఏస్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని వాపోయారు. ఈ కార్యక్రమంలో

మండల మహిళా కార్యవర్గ బాధ్యులు శ్వేత, రూప, నందిత గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారుతి, సంఘ సీనియర్ బాధ్యులు చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు చింతకుంట రామ్ కిరణ్, మండల కార్యవర్గ సభ్యులు వివేకానంద గౌడ్, బాలరాజు ఆర్.కే. అశోక్, వరుణ్ కుమార్, కే. అశోక్ తదితరులు అందజేశారు.

పెబ్బేరులో ఏడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

- అక్రమదారుల్లో వణుకు...

పెబ్బేరు, జనవరి 27 (జనంసాక్షి) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరి ప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రంగాపూర్ సమీపంలోని కృష్ణా నది నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను లోడ్ చేస్తున్నక సిబ్బందితో వెళ్లి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. రంగాపూర్ కు చెందిన ముచ్చర్ల బీసన్న, బోయ దామోదర్, బోయ మల్లేష్, యనుముల శివ, యాదగిరి, దారా పోగు రమేష్, నరేందర్ రెడ్డి, ప్రకాష్, దేవర్ల గణేష్, డ్రైవర్ నవీన్ తదితరులకు సంబంధించిన 7 ట్రాక్టర్ల పై కేసు నమోదు చేసినట్లు ఎస్సైతెలిపారు. అనుమతి పత్రాలు పొందిన తర్వాతే ఇసుక రీచ్ ల వద్ద లోడ్ చేసుకోవాలని అలా చేయని వాటిపై కేసు నమోదు చేస్తామని ఎస్సై ఇసుక నిర్వాహకులకు హెచ్చరించారు. దీంతో అక్రమదారంలో వణుకు మొదలైంది.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ రెడ్డి

నాగర్కర్నూల్, జనవరి 27 (జనంసాక్షి) : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. నాగర్కర్నూల్ మండలంలోని ఇరాక్ పల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అధికారులు, స్థానిక నాయకులతో కలిసి అట్టహాసంగా ప్రారంభించి, పథకాలకు సంబంధించిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి ఒక డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, ఒక రేషన్ కార్డు ఇవ్వలేదని కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం కాలంలోనే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు లబ్ధిదారులకు అందజేస్తున్నామని ప్రభుత్వం పదేళ్ల కాలంలో చేయలేనిది ఒక సంవత్సర కాలంలోనే చేసి చూపించామని అన్నారు. ఇరాక్‌పల్లి గ్రామంలో చాలా నీటి సమస్య ఉంది కావున మీ గ్రామానికి ఏ విధంగానైనా తప్పకుండా నిరంధించే బాధ్యత నాది అని ఎమ్మెల్యే అన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామని, రైతు భరోసా కింద రైతులకు ఎకరానికి రూ.12 వేలు ఇస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, మండల ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, ఇరాక్ పల్లి గ్రామ మాజీ సర్పంచ్ విట్టల్ రావ్ పాటిల్,గ్రామ ప్రజలు పెద్దలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ

చింతకాని, జనవరి 27 (జనంసాక్షి) : సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన జి. మౌనిక తనకు సొంత ఇండ్లు లేకపోయినా ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరు రాలేదని, తనకు ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, చింతకాని తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించి, పెండింగ్ లేకుండా

చూడాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు.

మునిపల్లిలో మంత్రి సుడిగాలి పర్యటన

మునిపల్లి, జనవరి 27 (జనంసాక్షి) : మునిపల్లి మండలంలో సోమవారం నాడు రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి దామోదర రాజనర్సింహ్మ సుడిగాలి పర్యటన చేశారు. సింగూర్ ప్రాజెక్ట్ నీటి నిల్వ ప్రాంతాలలో పర్యాటక స్థలాల ఎంపిక నిమిత్తం ఆయన ఆయా గ్రామాల శివారులను పరిశీలించారు. బుసరెడ్డిపల్లి, మల్లికార్జునపల్లి, అల్లాపూర్, తక్కేడపల్లి, మన్ సాన్ పల్లి, తాటిపల్లి, పిల్లోడి, గార్లపల్లి, మక్తాక్యాసారం గ్రామాలలో పర్యటించారు. మల్లికార్జునపల్లి పాఠశాలలో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారితో సరదాగా ముచ్చటించారు. పాఠశాల ప్రహరీగోడా, ఎల్ఈడి టీవీ, గ్రామపంచాయతీ భవనం, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు మంత్రిని కోరారు.ఆయన మాజీ ఎంపీపీ రాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఇలల్ రజోయొద్దీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సతీష్, నాయకులు వెంకట్రాములు, యాదయ్య, వెంకటేశం, బుచ్చిరెడ్డి, గోపాల్, మహేష్ వున్నారు.

అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో రైతుల ఆగ్రహం

- వేరుశనగ మద్దతు ధర ప్రకటించాలి
- కొనుగోళ్లు నిలుపుదల చేయాలని రైతుల డిమాండ్
- మార్కెట్ అధికారులు, మార్కెట్ కమిషన్‌దారుల కుమ్మక్కు..?
- మార్కెట్ చైర్మన్ భర్త మల్లేష్ దురుసు ప్రవర్తన
- మార్కెట్ కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం చేసిన రైతులు
- మార్కెట్ చైర్మన్ భర్త మల్లేష్, మార్కెట్ సెక్రటరీ నర్సింలుపై రైతులు దాడి

అచ్చంపేట, జనవరి 27 (జనంసాక్షి) : అచ్చంపేట పట్టణంలో జాతీయ వ్యవసాయ మార్కెట్ లో వేరుశనగ ధాన్యానికి గిట్టుబాటు కల్పించాలని రైతులు ఎంత మొత్తుకున్నా కూడా మార్కెట్ అధికారులు, మార్కెట్ కమిషన్ దారులు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని ఆగ్రహంతో మార్కెట్ కమిటీ సెక్రెటరీ నరసింహులుతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత భర్త మల్లేష్ పై రైతులు దాడి చేశారు. అంతటితో ఆగకుండా రైతుల ఆవేశం కట్టలు తెలుసుకోవడంతో రైతులు కార్యాలయానికి చొరబడి ఫర్నిచర్ ను ధ్వంసం చేశారు. దీంతో వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. కొద్దిసేపు వ్యవసాయ మార్కెట్‌లో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. గత మూడు రోజుల క్రితం వేరుశనగ పంటకు మద్దతు ధర 7వేల పైచిలుకు ఉన్నదని, ఒక్కసారిగా ఉన్నట్టుండి సోమవారం రూ. 4 నుండి రూ. 6 వేలకు పైగా ధర కల్పిస్తుండడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు వెంటనే మార్కెట్ కొనుగోలు నిలుపుదల చేయాలని రైతుల నుండి డిమాండ్ వచ్చినప్పటికీ మార్కెట్ చైర్మన్ భర్త మల్లేష్ అలాగే కుంటాం అలాగే చేస్తాం ఇష్టముంటే అమ్మండి లేకుంటే వెళ్లిపోండి అని వాకపోవడంతో రైతులు మండిపడ్డారు.

రైతులంటే చిన్నచూపు ఎందుకు...?

ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు సరేలే మద్దతు ధర ఇవ్వకుండా మార్కెట్ అధికారులు మధ్య దళారులు కుమ్మక్కై రైతులను నిండా ముంచుతున్నారని రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగ విత్తనాలు వేరుశనగ విత్తనాలు క్వింటాలుకు రూ. 14 వేలు పెట్టి రైతు కొనుగోలు చేస్తే పండించిన పంటకు రూ.4 వేలు, 5 వేలు అంటూ ధరలు కేటాయించడం రైతన్న నడ్డి విరచడమే అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ క్రమంలో మార్కెట్ అధికారులకు రైతులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో రైతులు మరింత ఆగ్రహానికి లోనై మార్కెట్ సెక్రటరీ నరసింహులు, ఆయనతోపాటు మార్కెట్ చైర్మన్ రజిత భర్త అంతటి మల్లేష్ లపై రైతులు దాడి చేసి అనంతరం ఫర్నిచర్ ను ధ్వంసం చేశారు. ఈ క్రమంలో మార్కెట్ అధికారులు పరుగులు తీశారు. చైర్మన్ భర్త మల్లేష్ చొక్కా చినిగిపోగా ప్రాణాలు అరచేతిలో పట్టుకొని మార్కెట్ కార్యాలయంలోకి పరుగులు తీశారు. అక్కడితో ఆగకుండా మార్కెట్ కార్యాలయంలో ఫర్నిచర్ ను రైతులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న అచ్చంపేట ఎస్సై రమేష్ మార్కెట్ కార్యాలయానికి చేరుకొని పరిస్థితిని చక్కదిత్య ప్రయత్నం చేశారు. రైతులు చిన్న చిన్న ఆవేశాలకు పోయి నష్టపోవద్దని, ఎవరు మాటలో విని గొడవలు సృష్టించవద్దని, రైతులే ఇబ్బందుపడతారని ఎస్సై సూచించారు. కొనుగోలు నిలిపివేకపోవడంతో రైతులు అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వంహించారు అనంతరం ఎస్సై రమేష్ రైతులకు నచ్చజెప్పి రైతులను మార్కెట్లోకి తీసుకువెళ్లారు.

పల్లెవెలుగులో ఎక్స్‌ప్రెస్ చార్జీలు

- ఆర్టీసీ అధికారుల తీరుపై సిరిపుర ప్రజల ఆందోళన

హత్నూర, జనవరి 27 (జనంసాక్షి) : పల్లెవెలుగు బస్సులను ఎక్స్ ప్రెస్ బస్సులుగా మార్పు చేస్తూ ప్రయాణికుల వద్ద అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండలంలోని సిరిపుర గ్రామ ప్రజలు సోమవారం జోగిపేట-నర్సాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా-రస్తారోకో నిర్వహించారు.ఆర్టీసీ బస్సులను అడ్డుకుని ఆందోళనకు దిగారు.ఎక్స్ ప్రెస్ బస్సుల పేరుతో టికెట్ చార్జీలు అమాంతం పెంచి ప్రయాణికుల నడ్డి విరుస్తున్నారని వారు ఆరోపించారు.మారుమూల గ్రామాలకు వెళ్ళే ప్రజలకు ఎక్స్ ప్రెస్ బస్సులు ఎందుకని వారు ప్రశ్నించారు.జోగిపేట-నర్సాపూర్ రాకపోకలు సాగించే మార్గంలో ఎక్స్ ప్రెస్ బస్సులను నిలిపివేసి పల్లె వెలుగు బస్సులను నడపాలని కోరుతూ పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారన్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పల్లె వెలుగు బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

వడ్డీ రేట్లు మార్చిన దిగ్గజ బ్యాంక్..

బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలను కుంటున్న వారికి అలర్ట్. ప్రముఖ బ్యాంక్ అయిన యాక్సిస్ బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లను సవరించింది. కొత్త వడ్డీ రేట్లు జనవరి 27వ తేదీ నుంచే అమలులోకి వచ్చినట్లు తెలిపింది. గరిష్ఠంగా 7.75 శాతం మేర వడ్డీ ఆఫర్ చేస్తోంది. మరి లేటెస్ట్ ఎఫ్‌డీ రేట్లు, గరిష్ఠ రేట్ల మెచ్యూరిటీ టెన్యూర్ వంటి పూర్తి వివరాలు తెలుసుకుందాం

మీరు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలనుకుంటున్నారా? అయితే మీకో అలర్ట్. ప్రైవేట్ రంగ దిగ్గజ బ్యాంకుల్లో ఒకటైన యాక్సిస్ బ్యాంక్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరించింది. సవరించిన కొత్త వడ్డీ రేట్లను జనవరి 27వ తేదీ నుంచే అమలులోకి తీసుకొచ్చినట్లు తమ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలియజేసింది. వడ్డీ రేట్ల సవరణ ద్వారా జనరల్ కస్టమర్లకు 3 శాతం నుంచి 7.25 శాతం వరకు వడ్డీ రేట్లు కల్పిస్తుండగా.. సీనియర్ సిటినజ్లకు అదనంగా 50 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ ఇస్తోంది. అంటే గరిష్ఠ వడ్డీ రేట్లు 7.75 శాతం వడ్డీ లభిస్తోంది. ఆ వివరాలు తెలుసుకుందాం.

గరిష్ఠ వడ్డీ రేట్లు ఈ స్కీమ్ ద్వారానే..

యాక్సిస్ బ్యాంక్ వడ్డీ రేట్ల సవరణ తర్వాత రూ.3 కోట్ల లోపు ఉండే రిటైల్ డిపాజిట్లపై 7 రోజుల నుంచి 10 ఏళ్ల వరకు టెన్యూర్ డిపాజిట్లపై జనరల్ కస్టమర్లకు 3 శాతం నుంచి 7.25 శాతం, సీనియర్ సిటిజన్లకు 3.50 శాతం నుంచి 7.75 శాతం వడ్డీ ఇస్తోంది. గరిష్ఠ వడ్డీ రేటు 15 నెలల నుంచి 2 ఏళ్ల మెచ్యూరిటీ పీరియడ్ గల ఎఫ్‌డీ స్కీమ్ పైన ఇస్తోంది. ఇందులో జనరల్ కస్టమర్లకు 7.25 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది.

యాక్సిస్ బ్యాంక్ లేటెస్ట్ ఎఫ్‌డీ రేట్లు..

- 7 రోజుల నుంచి 29 రోజుల వరకు సీనియర్ సిటిజన్లకు వడ్డీ రేట్లు 3.50 శాతంగా ఉన్నాయి
- 30 రోజుల నుంచి 45 రోజుల వరకు సీనియర్లకు 4 శాతం వడ్డీ ఇస్తోంది.
- 46 రోజుల నుంచి 60 రోజుల టెన్యూర్ డిపాజిట్లపై 4.75 శాతం వడ్డీ లభిస్తోంది.
- 61 రోజుల నుంచి 87 రోజుల వరకు 5 శాతం, 88 రోజుల నుంచి 3 నెలల 24 రోజుల వరకు 5.25 శాతం వడ్డీ ఇస్తోంది.
- 3 నెలల 25 రోజుల నుంచి 6 నెలల వరకు 5.25 శాతం వడ్డీ ఇస్తోంది.
- 6 నెలల నుంచి 9 నెలల వరకు 6.25 శాతం, 9 నెలల నుంచి ఏడాది లోపు 6.50 శాతం వడ్డీ ఇస్తోంది.
- ఏడాది నుంచి 15 నెలల వరకు 7.20 శాతం, 15 నెలల నుంచి 2 ఏళ్లలోపు వరకు 7.75 శాతం వడ్డీ ఇస్తోంది.
- 2 సంవత్సరాల నుంచి 5 ఏళ్ల వరకు 7.60 శాతం వడ్డీ ఇస్తోంది.
- 5 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాల వరకు 7.75 శాతం ఇస్తోంది.

మార్పుల నుంచి సెక్షన్ లిమిట్ పెంపు వరకు..

బడ్జెట్ 2025కు ఇంకొద్ది రోజులే ఉంది. ఈ క్రమంలో ఎవరి డిమాండ్లను వారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ముందుంచుతున్నారు. అయితే ఎప్పుడూ పన్ను చెల్లింపుదారులు.. బడ్జెట్‌లో ప్రకటనల గురించి ఆసక్తిగా చూస్తుంటారన్న సంగతి తెలిసిందే. ఈసారి కూడా మధ్యతరగతి వర్గం ఆదాయపు పన్నుకు సంబంధించి కొన్ని మార్పుల్ని కోరుకుంటున్నారు. అవేంటో చూద్దాం.

వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26కు సంబంధించి వార్షిక బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం.. ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. ఫిబ్రవరి 1న, ఉదయం 11 గంటల సమయంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. లోక్‌సభలో ప్రవేశపెడతారు. ఈసారి కూడా బడ్జెట్ సమావేశాల్ని రెండు విడతల్లో నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 1న బడ్జెట్‌కు ముందుగానే.. జనవరి 31న ఆర్థిక సర్వేను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. దేశ ఆర్థిక పరిస్థితుల్ని తెలియజేసేదే ఆర్థిక సర్వే. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇదే తొలి పూర్తి స్థాయి బడ్జెట్ కాబట్టి అంచనాలు ఎక్కువే ఉన్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి వర్గం.. ఆదాయపు పన్ను విధానంలో కీలక మార్పులు కోరుకుంటోంది. ఆదాయపు పన్నుకు సంబంధించి.. వారేం కోరుకుంటున్నారో ఇక్కడ చూద్దాం.

టాక్స్ శ్లాబుల్లో మార్పులు- మధ్యతరగతి వర్గానికి వ్యక్తిగత ఆదాయపు పన్నుకు సంబంధించి మరింత ఊరట కలిగించేలా నిర్మలమ్మ నిర్ణయం తీసుకోవాలని ప్రధాన డిమాండ్‌గా ఉంది. కనీస పన్ను మినహాయింపు పరిమితి ప్రస్తుతం రూ. 3 లక్షలుగా ఉండగా.. రూ. 4 లక్షలకు పెంచడం తప్పనిసరి అని.. ఇంకా టాక్స్ రిబేట్ లిమిట్ రూ. 7 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాలని టాక్స్2విన్ సీఈఓ అభిషేక్ సోనీ కోరుతున్నారు. రూ. 15 లక్షల్లోపు ఆదాయం ఉన్న వారికి టాక్స్ రేట్లు తగ్గించాలని క్లియర్‌టాక్స్ టాక్స్ ఎక్స్‌పర్ట్ షెఫాలీ ముంద్రా అంటున్నారు.

ఇల్లు కొనుగోలు చేసే వారు లేదా నిర్మించుకోవాలనుకునే వారి కోసం కూడా వారిని ప్రోత్సహించేందుకు కొత్త పన్ను విధానంలో కీలక ప్రకటనలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

హోం లోన్లకు సంబంధించి పన్ను తగ్గింపు పరిమితి పెంచి ప్రోత్సాహకాల్ని ఇవ్వడం అనేది కూడా ప్రధాన డిమాండ్‌గా ఉంది. మినహాయింపు పరిమితిని రూ. 50 వేల నుంచి రూ. లక్షకు పెంచాలని ఇంకా.. విత్‌డ్రాయల్స్ కూడా పూర్తిగా టాక్స్ ఫ్రీ చేయాలని సోనీ డిమాండ్ చేస్తున్నారు.

టాక్స్‌పేయర్లకు సమానత్వం కింద.. ఎక్కువ జీవన వ్యయం ఉన్న నగరాలైన హైదరాబాద్, పుణె, బెంగళూరుల్లో కూడా హౌస్ రెంట్ అలవెన్స్ పరిమితిని 50 శాతానికి పెంచాలని కోరుతున్నారు.

సీనియర్ సిటిజెన్లకు పన్ను మినహాయింపు పరిమితిని రూ. 50 వేల నుంచి రూ. లక్షకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల బడ్జెట్‌లో పెంచిన షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ టాక్స్‌ను తగ్గించాలని కోరుతున్నారు. సీనియర్ సిటిజెన్లకు ఊరట కలిగించేలా వారికి కనీస పన్ను మినహాయింపు పరిమితి తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. టాక్స్ సేవింగ్స్ ఇన్వెస్ట్‌మెంట్లు పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన, ఎల్ఐసీ ప్రీమియం వంటి వాటిపై సెక్షన్ ని కొత్త పన్ను విధానానికి కూడా అమలు చేసి.. ఇంకా లిమిట్ పెంచాలని కోరుతున్నారు.

ఎయిర్‌టెల్ గుడ్‌న్యూస్.. ఆ ప్లాన్ల ధరల తగ్గింపు..

రూ. 469తో ఇప్పుడు 84 రోజుల వ్యాలిడిటీ.. అన్‌లిమిటెడ్!

ఎయిర్‌టెల్ కొత్త ప్లాన్ ధర కేవలం రూ. 469 మాత్రమే. దీని కింద రీఛార్జ్ చేసుకుంటే.. ఏకంగా 84 రోజుల వ్యాలిడిటీతో అన్‌లిమిటెడ్ లోకల్ ఎస్టీడీ అండ్ రోమింగ్స్ కాల్స్ చేసుకోవచ్చు. ఇంకా 900 లు లభిస్తాయి. దీంట్లో 3 నెలల పాటు అపోలో 24/7 సర్కిల్ మెంబర్‌షిప్ సహా హలో ట్యూన్స్ ప్రయోజనాల్ని కూడా పొందొచ్చు. దీనికి ముందు ఈ ప్లాన్ ధర రూ. 499 గా ఉండేది. అంటే దీనిపై రూ. 30 తగ్గించి అదే ప్లాన్ తీసుకొచ్చింది.

ట్రాయ్ ఆదేశాల నేపథ్యంలో ఇటీవల రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ వాయిస్ ఓన్లీ ప్లాన్స్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. వీటి కింద తక్కువ ధరల్లోనే ఎక్కువ రోజుల వ్యాలిడిటీతో.. అన్‌లిమిటెడ్ వాయిస్, ఎస్ఎంఎస్ సేవల్ని తీసుకొచ్చాయి. తాజాగా ఎయిర్‌టెల్ మరో గుడ్‌న్యూస్ చెప్పింది. తాజాగా తెచ్చిన ఈ ప్లాన్ ధరల్ని మరోసారి తగ్గించింది. ఇప్పుడు కొత్త ప్యాక్స్ అందుబాటులోకి వచ్చాయి.

దిగ్గజ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ శుభవార్త చెప్పింది. ఇటీవల తీసుకొచ్చిన వాయిస్ ఓన్లీ రీఛార్జ్ ప్లాన్ ధరల్ని మరోసారి సవరించింది. కిందటి సారి కంటే తక్కువ ధరలకే కొత్త ప్యాక్స్ ప్రవేశపెట్టింది. ఇప్పుడు ఈ వాయిస్, ఎస్ఎంఎస్ ఓన్లీ ప్లాన్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. కొద్దిరోజుల కిందట తీసుకొచ్చిన రెండు ప్లాన్ల ప్రయోజనాలు అలాగే ఉంచుతూ.. ఏ మార్పు చేయని ఎయిర్‌టెల్.. అంతకంటే తక్కువ ధరల్లోనే కొత్త ప్లాన్లను ప్రకటించడం విశేషం. ఇప్పటికే ఇవి రీఛార్జ్ ప్లాన్లలో అందుబాటులోకి వచ్చేశాయి. ఈ క్రమంలో పాత ప్యాక్స్‌ను వెబ్‌సైట్ నంచి తీసేసి అప్డేట్ చేసింది. ఇంతకుముందు ప్లాన్ ధరలు ఎలా ఉన్నాయి.. ఇప్పుడు ఎలా ఉన్నాయనేది చూద్దాం.

ఎయిర్‌టెల్ కొత్త ప్లాన్ ధర కేవలం రూ. 469 మాత్రమే. దీని కింద రీఛార్జ్ చేసుకుంటే.. ఏకంగా 84 రోజుల వ్యాలిడిటీతో అన్‌లిమిటెడ్ లోకల్ ఎస్టీడీ అండ్ రోమింగ్స్ కాల్స్ చేసుకోవచ్చు. ఇంకా 900లు లభిస్తాయి. దీంట్లో 3 నెలల పాటు అపోలో 24/7 సర్కిల్ మెంబర్‌షిప్ సహా హలో ట్యూన్స్ ప్రయోజనాల్ని కూడా పొందొచ్చు. దీనికి ముందు ఈ ప్లాన్ ధర రూ. 499 గా ఉండేది. అంటే దీనిపై రూ. 30 తగ్గించి అదే ప్లాన్ తీసుకొచ్చింది.

ఇక మరో ప్లాన్ విషయానికి వస్తే.. రూ. 1849తో ఉంది. ఇది యాన్యువల్ ప్లాన్ అని చెప్పొచ్చు. ఏకంగా 365 రోజుల వ్యాలిడిటీతో వస్తుంది. ఇక్కడ కూడా అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, 3600 ఎస్ఎంఎస్‌లు వస్తాయి. ఇదే ప్రయోజనాలతో ఇటీవల తెచ్చిన ప్లాన్ ధర రూ. 1959 కాగా.. దాని కంటే ప్రస్తుత ప్యాక్ ధర రూ. 110 తక్కువగా ఉంది. దీనిపైనా అపోలో సర్కిల్, హలో ట్యూన్స్ బెనిఫిట్స్ పొందొచ్చు. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల నేపథ్యంలోనే ఎయిర్‌టెల్ కొత్త ప్యాక్స్ ప్రకటించింది. ఇటీవల వాయిస్, ల కోసం ప్రత్యేకంగా రీఛార్జ్ ప్యాకేజీలు తీసుకురావాలని.. టెలికాం కంపెనీల్ని ట్రాయ్ ఆదేశించిన సంగతి తెలిసిందే. దీంతో.. ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్ ఐడియా ఇలా అన్నీ ప్రత్యేకంగా వాయిస్, కోసం డేటా లేకుండా ప్లాన్స్ తీసుకొచ్చాయి. అయితే.. వాటి ధరల్ని మరింత తగ్గించాలని ట్రాయ్ సూచించిన నేపథ్యంలోనే.. ఎయిర్‌టెల్ ఇప్పుడు తన ప్లాన్ ధరల్ని తగ్గించినట్లు గా తెలుస్తోంది. ఇదే సమయంలో రిలయన్స్ జియో, వొడాఫోన్ ఐడియా కూడా తమ ప్లాన్ రేట్లు సవరించొచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. అయితే.. ట్రాయ్ కొత్త నిర్ణయం ఆయా కంపెనీల ఆదాయంపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు.

అక్రమవలసదారుపై అమెరికా అరాచకం!

అమెరికాలో ఉన్న అక్రమ వలసదారులను నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరిగి స్వదేశాలకు పంపించి వేస్తున్నారు. ఈక్రమంలోనే వారిపై దారుణ చర్యలకు పాల్పడుతున్నారు. తాజాగా యూఎస్‌లో ఉంటున్న పలువురు అక్రమ బ్రెజీలియన్లను కాళ్లూ, చేతులు కట్టేసి తాగేందుకు గుక్కెడు మంచి నీళ్లు కూడా ఇవ్వకుండా విమానంలో వారి దేశానికి పంపారు. కనీసం వారిని బాత్రూమ్‌లు కూడా వాడుకోనివ్వకుండా నరకం చూపించారు. అమెరికా తీరుపై బ్రెజిల్ సర్కారు ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

గతేడాది నవంబర్ నెలలో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించి వారం రోజుల క్రితమే 47వ దేశాధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు డొనాల్డ్ ట్రంప్. బాధ్యతలు చేపట్టిన తొలి రోజు నుంచే అక్రమ వలసదారులపై చర్యలు తీసుకుంటున్నారు. వారిని తిరిగి స్వదేశాలకు పంపేందుకు అనేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా అమెరికానే అక్రమ వలసదారులను గుర్తించి.. 500 సైనిక విమానాల ద్వారా వారిని స్వదేశాలకు పంపుతోంది.

అయితే తాజాగా యూఎస్ సర్కారు.. బ్రెజిల్ నుంచి అక్రమంగా వచ్చి అమెరికాలో జీవిస్తున్న పలువురిని గుర్తించి తిరిగి వెనక్కి పంపింది. ఈక్రమంలోనే వారికి నరకం చూపించింది. జైల్లో ఉన్న ఖైదీల పట్ల చూపించే కనికరం కూడా చూపించకుండా తరలించడంపై బ్రెజిల్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఆ పూర్తి వివరాలు మీకోసం.

అమెరికాలో అక్రమంగా వలస పొందుతున్న 80 మంది బ్రెజీలియన్లను ఆదివారం రోజు తిరిగి స్వదేశానికి పంపించింది. అయితే బ్రెజిల్ ఉత్తర నగరమైన మనౌస్‌లో ఆ విమానం ల్యాండ్ కాగా.. 80 మంది బ్రెజీలియన్ పౌరులు చేతులకు సంకెళ్లతో ఉన్నట్లు అక్కడి అధికారులు గుర్తించారు. ఈక్రమంలోనే వారందరినీ ప్రశ్నించగా అమెరికా వారికి చూపించిన నరకం గురించి చెప్పి కన్నీటి పర్యంతం అయ్యారు. ముఖ్యంగా తాము విమానంలో ఎక్కడానికి ముందే తమ చేతులకు సంకెళ్లు వేసినట్లు తెలిపారు.

ఆపై విమానంలోకి వచ్చి కూర్చున్నాకా తమ కాళ్లు కూడా కట్టేశారని బ్రెజీలియన్లు వివరించారు. విమానంలో ఉండగా.. దాహం వేస్తుందని అడిగితే కనీసం గుక్కెడు మంచినీళ్లు కూడా అందించకుండా తమను ఇబ్బంది పెట్టారని పేర్కొన్నారు. బాత్రూం వెళ్లాలని చెప్పినా వారు పట్టించుకోకుండా తమను అలాగే ఉంచారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తాగేందుకు నీళ్లు లేక బాత్రూంకు వెళ్లలేక అనేక మంది అస్వస్థతకు గురయ్యారని స్పష్టం చేశారు. ముఖ్యంగా యూఎస్ నుంచి ఇదే విమానంలో వచ్చిన ఎడ్గార్ డా సిల్వా మౌరా అనే 31 ఏళ్ల కంప్యూటర్ టెక్నీషియన్ మాట్లాడాతూ.. బహిష్కరణకు ముందే తాను 7 నెలల పాటు అమెరికా నిర్బంధంలో ఉన్నట్లు తెలిపాడు. విమానంలో పలు సాంకేతిక సమస్యల వల్ల ఏసీలు కూడా పని చేయకపోవడంతో.. అనేక మంది మూర్ఛపోయారని వివరించారు.

అలాగే 21 ఏళ్ల లూయిస్ ఆంటోనియా రోడ్రిగ్స్ శాంటోస్ మాట్లాడుతూ.. ఏసీలు నాలుగు గంటలు పని చేయలేదని దీని వల్ల పలువురు శ్వాస తీసుకోవడానికి కూడా చాలా ఇబ్బంది పడ్డారని చెప్పారు. తాము వచ్చిన విమానం ఆగ్నేయ నగరమైన హారిజోంటేలో ల్యాండ్ కావాల్సిందని కానీ సాంకేతిక సమస్యల కారణంగా మనౌస్‌లో ల్యాండ్ చేశారని స్పష్టం చేశారు. అక్రమ వలసదారుల పట్ల అమెరికా వ్యవహరించిన తీరుపై బ్రెజిల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ చర్యలను తీవ్రంగా పరిగణించింది. బ్రెజిలియన్ పౌరుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినట్లేనని స్పష్టం చేసింది. ఇకపై పంపించే వారినైనా చేతులకు సంకెళ్లు లేకుండా.. గౌరవంగా తీసుకు రావాలని వెల్లడించింది. చూడాలి మరి అమెరికా ముమ్ముందు మరేం చేయనుందో.

ట్రంప్ హెచ్చరికలతో వెనక్కి తగ్గిన కొలంబియా..

అమెరికాలో ఉన్న అక్రమ వలస దారులను ప్రత్యేక సైనిక విమానాల్లో వారి స్వదేశానికి పంపే విషయంలో.. కొలంబియా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అమెరికా నుంచి వచ్చే విమానాలపై నిషేధం కూడా ప్రకటించింది. కానీ ట్రంప్ సుంకాలు పెంచుతామని హెచ్చరించడంతో కొలంబియా వెనక్కి తగ్గింది. అమెరికా పెట్టిన అన్ని నిబంధనలకు ఓకే చెప్పింది. దీంతో అగ్రరాజ్యం సైతం ఆ దేశంపై విధించిన సుంకాలు, ఆంక్షలను ఎత్తివేసింది. ఈ విషయాన్ని నేరుగా యూఎస్ సర్కారే వెల్లడించింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.

అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అక్రమ వలదారులపై చర్యలు తీసుకుంటూనే ఉన్నారు. వారందరినీ తిరిగి వారి దేశాలకు పంపించేందుకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారు. ముఖ్యంగా 500 ప్రత్యేక సైనిక విమానాల ద్వారా అక్రమ వలదారులపను వారి స్వేదేశాలకు చేరుస్తున్నారు. అయితే ఈ చర్యలను కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో వ్యతిరేకించి.. యూఎస్ విమానాలపై నిషేధం విధించారు. దీంతో ట్రంప్ సుంకాలు పెంచుతామంటూ హెచ్చరికలు జారీ చేయగా కొలంబియా వెనక్కి తగ్గింది. దీంతో అమెరికా సైతం.. ఆ దేశంపై విధించిన సుంకాలు, ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు వివరించింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.

అమెరికాలో ఉన్న అక్రమ వలసదారులను 500 ప్రత్యేక సైనిక విమానాల్లో వారి స్వదేశాలకు పంపేందుకు ట్రంప్ సర్కారు చర్యలు చేపట్టింది. ఇప్పటికే పలువురిని పంపించి వేసింది. ఈ చర్యలపై ప్రపంచ వ్యాప్తంగా నిరసన వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా తమ దేశానికి చెందిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ ప్రత్యేక విమానాల ద్వారా పంపకుండా.. పౌర విమానాల ద్వారా మాత్రమే వారిని తమ దేశానికి పంపించాలంటూ కొలంబియా తెలిపింది. అప్పటి వరకు అమెరికా విమానాలపై నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించింది.

గౌరవంగా పంపించేలా నిబంధనలు రూపొందిస్తేనే విమానాలను అనుమతిస్తామంటూ ఆ దేశ అధ్యక్షుడు గుస్తావో పెట్రో తెలిపారు. ఇప్పటికే కొన్ని సైనిక విమానాలను వెనక్కి పంపినట్లు వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొలంబియా సర్కారు విమానాలను వెనక్కి పంపడంపై జీర్ణించుకోలేకపోయారు. దీంతో కొలంబియా ఉత్పత్తులపై సుంకాలు 50 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా కొలంబియన్ సర్కారు అధికారుల వీసాలను కూడా వెంటనే రద్దు చేస్తామంటూ వెల్లడించారు. ఇవి కేవలం ప్రారంభ చర్యలు మాత్రమేనంటూ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో వెనక్కి తగ్గారు. అగ్రరాజ్యం అమెరికా పెట్టిన ఆంక్షలు, నిబంధనలకు ఓకే చెప్పారు. అమెరికా సైనిక విమానాలను తమ దేశంలోకి రానిస్తామని.. పౌరులను తమ దేశానికి ఆహ్వానిస్తామని ప్రకటించారు. దీనిపై తాజాగా యూఎస్ స్పందించింది. కొలంబియా వెనక్కి తగ్గడంతో.. ఆ దేశంపై విధించిన సుంకాలు, పలు ఆంక్షలను నిలివి వేస్తున్నట్లు ప్రకటించింది. కేవలం కొలంబియా మాత్రమే కాదు ఏ దేశం తమ పౌరులను వెనక్కి తీసుకోకపోయినా.. ఇలాంటి చర్యలే తీసుకుంటామంటూ వెల్లడించింది. ఈ విషయం అర్థం చేసుకుని అన్ని దేశాలు తమకు సహకరించాలని.. అక్రమ వలసదారులను స్వదేశాలకు రప్పించుకోవాలని వివరించింది.

వయసు పైబడిన వరుణ్ని చూసి..
స్పృహ తప్పిన వధువు..

వయసు పైబడిన వ్యక్తిని ఓ యువతికి ఇచ్చి పెళ్లి చేయబోగా.. తన పక్కన కూర్చున్న వ్యక్తిని చూడగానే ఆ యువతి కేక వేసి పడిపోయిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే ఈ వీడియో నిజంగా జరిగింది కాదు. హ్యూమర్ కోసం తీసిన స్క్రిప్టెడ్ వీడియో.

వివాహం అనేది చాలా పెద్ద ప్రక్రియ. ఫొటోలు చూడటంతో మొదలుపెట్టి.. పెళ్లి చూపులు, ఎంగేజ్‌మెంట్, పెళ్లి, రిసెప్షన్.. ఇలా రోజుల తరబడి ఈ ప్రక్రియ సాగుతుంది. అయితే పాత రోజుల్లో ఈ సుదీర్ఘ ప్రక్రియ ఉండేది కాదు. పెద్దవాళ్లు వెళ్లి పిల్లను లేదా పిల్లాణ్ని చూసుకొని వచ్చి నేరుగా పెళ్లి చేసేవారు. పెళ్లయ్యేంత వరకు తన భర్త ఎలా ఉంటాడో భార్యకు తెలిసేది కాదు. ఇప్పటికీ ముస్లిం సమాజంలో అక్కడక్కడ ఇలాంటి కట్టుబాట్లు కనిపిస్తుంటాయి. ఇలాంటి కట్టుబాట్ల ఆధారంగా తీసిన ఓ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

"బంగ్లాదేశ్‌లో పెద్దలు కుదిర్చిన పెళ్లిలో.. తాను వివాహం చేసుకున్న వ్యక్తిని చూడగానే యువతి స్పృహతప్పి పడిపోయింది." అనే క్యాప్షన్‌తో ఉన్న ఓ వీడియోను ఇన్‌స్టాగ్రామ్ పేజీలో 2025 జనవరి 25న పోస్టు చేశారు. చాలా మంది అమ్మాయిల విషయంలో ఇది నిజం అని వీడియోపై రాసుకొచ్చారు.

ఈ వీడియో నిజమేనా అని తేల్చడం కోసం సజగ్ టీమ్ వీడియో స్క్రీన్ షాట్ సాయంతో గూగుల్ రివర్స్ ఇమేజ్ సెర్చ్ ద్వారా వెతికింది. జనవరి 18న హెదయత్ ఇస్లాం వ్లాగర్ అనే యూట్యూబ్ ఛానెల్‌లో పోస్టు చేసిన వీడియో కనిపించింది. దానికి వైరల్ వీడియో, ఫన్నీ వీడియో అనే హ్యాష్ ట్యాగ్‌లు జతపరిచారు. వీడియో చివర్లో.. బాగా ఫేమస్ అయిన ఆఫ్రికా బుడ్డోడు నవ్వుతున్న పార్ట్ కనిపించింది. అయితే ఇన్‌స్టాలో కనిపించిన వీడియోలో ఈ పార్ట్ లేదు.

ఎక్స్‌లో సెర్చ్ చేయగా.. ఇంతియాజ్ మహమూద్ అనే యూజర్ పోస్టు చేసిన వీడియో కనిపించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో వాడిన క్యాప్షన్‌నే ఈ వీడియోకు సైతం వాడారు. జనవరి 25న పోస్టు చేసిన ఈ వీడియో 3.7 మిలియన్ల యూజర్లను రీచ్ కాగా.. 18 వేలకుపైగా లైకులొచ్చాయి. దీంతో మరికొందరు యూజర్లు పోస్టు చేసిన వీడియోలను సైతం సజగ్ టీమ్ గుర్తించింది.

అయితే ఈ వీడియోల కింద తప్పుడు సమాచారం అని రీడర్స్ జత చేసిన కంటెక్ట్ కనిపించింది. ఓ ఫేస్‌బుక్ లింక్‌ను సైతం జతపరిచారు. అది క్లిక్ చేయగా.. ఫేస్ బుక్ పేజీలో 'భార్య పరిస్థితి ఏంటో అల్లుణ్ని అడగండి' అని బెంగాలీ భాషలో రాసిన క్యాప్షన్‌తో పోస్టు చేసిన వీడియో కనిపించింది. 2024 జులై 26న పోస్టు చేసిన ఈ వీడియో డ్యురేషన్ 3 నిమిషాల 4 సెక్లన్లు ఉంది. ఫేస్ బుక్ పేజీకి సంబంధించిన సమాచారం చూడగా.. ఇంట్రోలో 'హలో ఫ్రెండ్స్, నేను డెల్వార్.. సౌదీ అరేబియాలో నివసిస్తున్నాను. మేం ఎవరినీ కించపర్చేందుకు వీడియోలు చేయము. కేవలం మన జ్ఞాపకాలను సజీవంగా ఉంచడానికే చేస్తాం.

మేం ఎలాంటి పెళ్లి కార్యక్రమం చేయము. మీకున్న ఫిర్యాదులను మాకు తెలియజేయండి' అంటూ ఈ-మెయిల్ ఐడీ, వాట్సాప్ నంబర్ ఇచ్చారు.

ఇంట్రోలో పేర్కొనట్టుగానే ఈ ఫేస్‌బుక్ పేజీలో పెళ్లికి సంబంధించి రకరకాల స్క్రిప్టెడ్ వీడియోలను పోస్టు చేశారు. దీన్ని బట్టి వైరల్ అవుతోన్న వీడియో స్క్రిప్టెడ్ అని సజగ్ టీమ్ నిర్ధారణకు వచ్చింది.

ప్రజావాణి పెండింగ్ అర్జీలను పరిష్కరించండి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 27 (జనం సాక్షి)

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పలు శాఖల్లో పెండింగులో ఉన్న ప్రజావాణి దరఖాస్తులపై సత్వర చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటి వరకు 19501 అర్జీలు రాగా, 18838 అర్జీలను పరిష్కరించడం జరిగిందని, ఇంకనూ 663 అర్జీలు పెండింగులో ఉన్నాయని తెలిపారు. ఈ రోజు(71) అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. ఆయా శాఖల అధికారులు పెండింగులో ఉన్న అర్జీలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా దినపత్రికల్లో వస్తున్న వ్యతిరేక వార్తలకు రేజాయిన్డర్స్ వెంటనే పంపించాలని తెలిపారు. ఆదివారం రోజున లాంఛనంగా ప్రారంభించిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాల కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు, 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినందుకు అధికారులకు, ఉద్యోగులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అన్ని మండలాల, మున్సిపల్ లోని ప్రజాపాలన కేంద్రాల్లో నాలుగు పథకాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పై వచ్చిన ఫిర్యాదులను పురస్కరించుకొని దరఖాస్తులను ఫిజికల్ గా పరిశీలించాలని తెలిపారు. ఒకే కుటుంబం లో రెండు, మూడు ఇండ్లు మంజూరు అయినట్లు పత్రికల్లో వచ్చిన వార్త ఆధారంగా పంచాయతీ కార్యదర్శులు మరొకసారి లబ్ధిదారుల ఇండ్లు పరిశీలించాలని తెలిపారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వి.విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రంగనాథ్ రావు, జడ్పీ సీఈవో చందర్, పలు శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బిటీ రోడ్ల మరమ్మత్తులకు 15 కోట్ల రూపాయల కేటాయింపు

మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 27 (జనం సాక్షి):

జి.ఓ.నెం. 59 ద్వారా నిధులను విడుదల చేసిన పంచాయితీరాజ్ శాఖ నియోజక వర్గంలో 30.72 కి.మీ.,ల రోడ్లకు మోక్షం మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్

మెదక్ నియోజక వర్గంలో బిటి రోడ్ల పునరుద్ధణకు రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీ రాజ్ శాఖ నుండి జి.ఓ.నెం. 59 ద్వారా 15 కోట్ల 10 లక్షల రూపాయలను విడుదల చేసినట్లు మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇట్టి నిధులతో మెదక్ నియోజక వర్గంలో దాదాపు 30.72 కి.మీ.,ల రోడ్లకు మోక్షం లభించనున్నట్లు ఆయన తెలియజేశారు. కాగా మెదక్ మండలంలోని నవాపేట నుండి మగ్దుంపూర్ బిటి రోడ్డు పనులకు 172 లక్షలు, పాపన్నపేట మండలంలోని నాగ్సాన్ పల్లి నుండి కొడపక వరకు బిటి రోడ్డు పనులకు 196 లక్షలు, రామాయంపేట మండలంలోని పిడబ్ల్యుడి రోడ్డు నుండి ఆరేపల్లి మీదుగా లక్ష్మాపూర్, కాట్రియాల్, దంతేపల్లి బిటి రోడ్డు పనులకు 424 లక్షలు, చిన్నశంకరంపేట మండలంలోని జడ్పి రోడ్డు నుండి మిర్జాపల్లి తాండ బిటి రోడ్డు పనులకు 50 లక్షలు, హావేళిఘణాపురం మండలం లోని పిడబ్ల్యుడి రోడ్డు పొల్కంపేట మీదుగా బూర్గుపల్లి వరకు బిటి రోడ్డు పనులకు 508 లక్షలు, చిన్నశంకరంపేట మండలంలోని పిడబ్ల్యుడి రోడ్డు చందంపేట నుండి రుద్రారం వరకు బిటి రోడ్డు పనులకు 80 లక్షలు, నిజాంపేట మండలంలోని నిజాంపేట మండలం నుండి చల్మెడ వరకు బిటి రోడ్డు పనులకు 80 లక్షల రూపాయలు కేటాయించినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మెదక్ నియోజక వర్గంలో రోడ్డు లేని పల్లెగా తీర్చిదిద్దుతానని ఆయన పేర్కొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ సెలవులో.. జోరులో రిజిస్ట్రేషన్లు

నిబంధనలకు విరుద్ధంగా చేశారనే విమర్శలు

ఆర్మూర్, జనవరి 27 (జనం సాక్షి):

ఆర్మూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల జోరు ఊపందుకుంది. సోమవారం పెద్ద సంఖ్యలో జనాలు రిజిస్ట్రేషన్లకు ఎగబడ్డారు. ప్రస్తుతం ఉన్న సబ్ రిజిస్టర్ మహేందర్ రెడ్డి నిబంధనల మేరకు డాక్యుమెంట్లు పరిశీలించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని తిరస్కరిస్తున్నారు. దీంతో రియల్టర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో సబ్ రిజిస్టర్ మహేందర్ రెడ్డి సెలవుపై ఉండడంతో ఇంచార్జి సబ్ రిజిస్టర్ సోమవారం ఒకేరోజు పెద్ద సంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిసింది. వ్యవసాయ భూములకు నాలా కట్టిన వాటికి విడివిడిగా భాగాలు చేసి నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసింది. మరోవైపు ఓకే ఇంటి నెంబర్ పై ఉన్న స్థలాన్ని పార్ట్ పార్ట్ గా విభజించి రిజిస్ట్రేషన్లు జరిగాయి. వాస్తవానికి నాలా కట్టిన భూమి మొత్తానికి మాత్రమే రిజిస్ట్రేషన్ జరగాలి. ఆ స్థలం యజమాని పేరుపై మాత్రమే రిజిస్ట్రేషన్ జరగాలి కానీ పార్ట్ వైజ్ గా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు తెలిసింది. అయితే భాగాలుగా విభజించి రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒకే ఇంటి నెంబర్ పై ఉన్న స్థలాన్ని మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా ఇంటి నెంబర్ ఆధారంగా విడివిడిగా రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసింది. సబ్ రిజిస్టర్ సెలవులో ఉండడంతో ఇంచార్జి సబ్ రిజిస్టర్ నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేశారనే విమర్శలు ఉన్నాయి. కొన్ని రోజుల నుంచి నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా ఒకటి రెండు రోజుల లో పెద్ద సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరగడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై జిల్లా కలెక్టర్, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు.

నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లు : ఇంచార్జి సబ్ రిజిస్టర్ విక్రమ్.

ఆర్మూర్ సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉండడంతో తాను ఇన్చార్జి సబ్ రిజిస్ట్రార్ గా ఉన్నాను. ఆర్మూర్ పట్టణంలోని పెర్మిట్, ఆర్మూర్ లలో నున్న 45 లేఅవుట్ ప్లాట్లను నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ చేశాను. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరగలేదు.

అయిచి ప్రిఫెక్చర్‌తో ద్వైపాక్షిక సంబంధాలకు రెడీ

ఐటి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు

మంథని, (జనంసాక్షి)

జపాన్ లోని అయిచి రాష్ట్రం (ప్రిఫెక్చర్) తో ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలకు తెలంగాణా ఆహ్వానం పలుకుతోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సోమవారం తనతో భేటీ అయిన జపాన్ లోని అయిచి ప్రిఫెక్షర్ ప్రతినిధులతో ఆయన సచివాలయంలో మాట్లాడారు. రెండు రాష్ట్రాలు వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో పరస్పరం సహరించుకోవాలని శ్రీధర్ బాబు సూచించారు. అయిచీ రాష్ట్రం టొయోటా కార్ల పరిశ్రమతో పాటు, ఏరోస్పేస్, ఆటోమొబైల్, రోబోటిక్స్, యంత్ర పరికరాల తయారీలో అగ్రగామిగా ఉంది. ఇటీవలే ఆ రాష్ట్రం 'స్టేషన్ ఏఐ' పేరుతో జపాన్ లోనే అతిపెద్ద అంకుర సంస్థల ఇన్ క్యుబేషన్ కేంద్రాన్ని ప్రారంభించింది. తెలంగాణా రాష్ట్రంలోని టీ హబ్ కూడా అంకుర సంస్థల ప్రోత్సాహంలో దేశంలో ప్రముఖంగా నిలుస్తోందని శ్రీధర్ బాబు తెలిపారు. అయిచీ అసెంబ్లీ సభ్యుడు, ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన హిరోహిటో కొండో 2026 లో తమ రాష్ట్రంలో జరిగే 20 వ ఏషియా క్రీడలకు మంత్రి శ్రీధర్ బాబును ఆహ్వానించారు. అక్కడి గిబ్లి యానిమేషన్ పార్క్ ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆహ్వానిస్తోందని కొండో మంత్రి దృష్టికి తెచ్చారు. ద్వైపాక్షిక సంబంధాలతో ఇరు ప్రాంతాలు ప్రయోజనం పొందేలా సహకారం కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు. సమావేశంలో ఇండోబాక్స్ ఇండియా ఎండీ డైసుకే టాంజీ, షిన్యా సుకాడా, నాచారంలోని సపల ఆర్గానిక్స్ సిఇఓ పైడి ఎల్లారెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి డా. వి. నర్సింహాచార్యులు, ముఖ్యమంత్రి కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి, ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టిజిఐఐసి ఎండీ డా. విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో రైతుకు అధిక లాభాలు

యాభై శాతం సబ్సిడీతో పంపిణీ

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్, జనవరి 27 (జనంసాక్షి)

: కూరగాయల సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని ఇందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యాభై శాతం సబ్సిడీతో పందిళ్ళకు సహాయం అందిస్తుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం బోధన్ మార్కెట్ కమిటీ ఆవరణలో కూరగాయలు పండించే రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, కూరగాయల సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని అయితే రైతులు కూరగాయలు పండించేందుకు ముందుకు రావాలన్నారు. ఇందుకు రైతులకు పందిళ్లు వేసుకునేందుకు 50 శాతం సబ్సిడీతో డబ్బులు అందిస్తామని స్పష్టం చేశారు. కూరగాయలను ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అందువల్ల రైతులు కూరగాయలు పండించేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. రైతులకు అవసరమయ్యే అన్ని వసతులను కాంగ్రెస్ ప్రభుత్వం సమకూరుస్తుందని అందుకు రైతులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా కూరగాయలను సాగు చేయాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కోరారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్య దాము, వైస్ చైర్మన్ చీల శంకర్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ ఆంతిరెడ్డి రాజిరెడ్డి, గడుగు గంగాధర్, నగేష్ రెడ్డి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి వాజిద్ హుస్సేన్, హార్టికల్చర్ అధికారి వహీద్, వ్యవసాయ శాఖ అధికారులు సంతోష్ నాయక్, శ్వేత, సిద్ధి రామేశ్వర్, శ్రీనివాస్, ఏఈవోలు, టిపిసిసి డెలిగేట్ గంగాశంకర్, మండల పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్ రావ్, నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

భూములు కోల్పోతున్న రైతులను అన్నివిధాల ఆదుకుంటాం

చిగురుమామిడి, జనవరి 27(జనం సాక్షి)

గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా చిగురు మామిడి మండలంలో కాలువ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు మెరుగైన నష్టపరి హారం అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ తెలిపారు. సోమవారం రైతులతో గ్రామసభ నిర్వహించిన సందర్భంగా ఆయన భూములు కోల్పోతున్న రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ ముద్రసాని రమేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ తారారాణి, ఇరిగేషన్ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కరీంనగర్ అపోలో రీచ్‌లో నిధి ఆప్కే నిఖత్ 2.0 పి.ఎఫ్

కరీంనగర్ బ్యూరో, జనవరి 27 (జనంసాక్షి) :

సోమవారం రోజు కరీంనగర్ అపోలో రీచ్ ఆసుపత్రి లో నిధి ఆప్కే నిఖత్ 2.0 పి.ఎఫ్ అవగాహన కార్యక్రమంలో పి.ఎఫ్ సమస్యలు పరిష్కరించబడ్డాయని తెలిపారు. దీనిలో భాగంగా ప్రయాస యోజన క్రింద జనవరి 2025 నెలలో రిటైర్ అవుతున్న కార్మికులకు సోమవారం రోజు పి.పి.ఓ కాపీస్ అందించడం జరిగిందని అపోలో రీచ్ ఆసుపత్రి పరిపాలన అధికారి నాగ సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమం లో పి.ఎఫ్ జిల్లా ఎన్ఫోర్స్ మెంట్ అధికారి కె.శ్రీనివాస్, కరీంనగర్ అపోలో రీచ్ హాస్పిటల్ పరిపాలనాధికారి డాక్టర్ నాగ సతీష్ , ఆనంద్ పటేల్, హెచ్.ఆర్ సందీప్, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్

జమ్మికుంట, జనవరి 27 (జనం సాక్షి) :

జమ్మికుంట మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ సోమవారం భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా ముందడుగులో ఉన్న జమ్మికుంట మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుండే విధంగా తీర్చిదిద్దుతానని ఆయన అన్నారు. అలాగే మున్సిపాలిటీలో ఉన్న ప్రధాన సమస్యలపై దృష్టి సరిస్తామని ఆయన అన్నారు. ముందుగా ప్రత్యేక అధికారి ప్రపుల్ దేశాయ్ కి మున్సిపాలిటీ కమిషనర్ మహమ్మద్ అయాజ్ పుష్ప గుచ్చాలతో స్వాగతం సత్కారాలు పలికారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి రాజిరెడ్డి, ఎం ఏ ఈ.నరేష్, టీపీఓ శ్రీధర్,భాస్కర్,వాణిల తో పాటు పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సామాగ్రిని సిద్ధంగా ఉంచాలి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 27 (జనం సాక్షి)

రానున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సామాగ్రి సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా ఎస్పీ కార్యాలయం సమీపంలోని గోదాము లోని పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఉపయోగించే సామాగ్రిని, బ్యాలెట్ బాక్స్ లను కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం నుండి సరఫరా అయిన పంచాయతీ ఎన్నికలకు వినియోగించే కవర్లు, వివిధ రకాల ఫారాలు, బ్యాలెట్ బాక్స్ లు, ఇతర సామాగ్రిని భద్రంగా ఉంచాలని, మండలాల వారీగా సరఫరా చేయుటకు సిద్ధం చేయాలనీ తెలిపారు. అదేవిధంగా బ్యాలెట్ బాక్స్ లకు పెయింటింగ్ వేయించాలని, అవసరం అయితే మరమ్మతులు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

చందానగర్ సర్కిల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా... రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి

శేరిలింగంపల్లి, జనవరి 27 (జనంసాక్షి)

: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి చందానగర్ సర్కిల్ అభివృద్ధికి తాను నిజాయితీగా కట్టుబడి ఉన్నానని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. ఈ మేరకు చందానగర్ డివిజన్ పరిధిలోని జాతీయ రహదారి 65 ప్రధాన రహదారి పై భేల్ చౌరస్తాలో 170 కోట్ల రూపాయల ప్రభుత్వ నిధుల అంచనావ్యయంతో చేపడుతున్న ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా జరుగుతున్న నిర్మాణపు పనులను, సర్వీస్ రోడ్డు విస్తరణ మరియు వరద నీటి కాల్వల నిర్మాణం పనులను, మంజీర మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులను కార్పొరేటర్లు మంజుల రఘునాథ్ రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి సోమవారం ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ మాట్లాడుతూ చందానగర్ సర్కిల్ పరిధిలోని భేల్ చౌరస్తాకు మహర్దశ లభించినట్టేనని, త్వరలోనే వాహనదారులకు, ప్రయాణికులకు బెల్ సర్కిల్ పరిధిలో ట్రాఫిక్ కష్టాలు తొలగిపోనున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 1.65 కిలోమీటర్ల మేర 6 లైన్ల బ్రిడ్జి, 6 లైన్ల సర్వీస్ రోడ్డుతో కూడిన ఫ్లై ఓవర్ ను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న సదరు నిర్మాణపు పనులను వేగవంతం చేయాలని, వరద నీరు కాల్వ నిర్మాణం పనులు మరింత త్వరితగతిన పూర్తిచేసి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేసవి తర్వాత రాబోయే వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని పనులలో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని చైర్మన్ గాంధీ తెలియచేసారు. మంజీరా మంచినీటి పైప్ లైన్ నిర్మాణం పనులనుకూడా త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతిరోజూ ప్రయాణికులతో రద్దీగా ఉండే జాతీయ రహదారి అయినందున ప్రజలు భారీగా రాకపోకలు సాగిస్తూ నిరంతరం ట్రాఫిక్ రద్దీతో బెల్ చౌరస్తా ఇప్పటికే ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. స్థానిక ప్రజలకు, వాహనదారులకు, ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఇందులో భాగంగానే ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయడం ద్వారా సమస్యల పరిష్కారానికి కొంత తోడ్పాటునందించాలని పీఏసీ చైర్మన్ అధికారులను ఆదేశించారు. ఫ్లై ఓవర్ నిర్మాణం జరుగుతున్న సమయంలో ఉత్పన్నమవుతున్న వ్యర్థాలను వెంటనే ఘటనాస్థలినుండి తరలించాలని, మట్టి కుప్పలను వెంటనే తొలగించాలని ఆర్ అండ్ బి అధికారులను కోరారు. సర్వీస్ రోడ్డులో తీసిన గోతులచుట్టూ రక్షణ వలయాలను ఏర్పాట్లు చేయాలని, ప్రమాదాల నివారణకై తగిన

సూచీలను ఏర్పాటు చేయాలని అరికపూడి అధికారులకు సూచించారు. ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా అన్నిరకాల చర్యలు తీసుకోవాలని, సర్వీస్ రోడ్డులో షాపులు, వాణిజ్య భవనాల సముదాయం ముందు తీసిన గోతుల చుట్టూ రక్షణ చర్యలు తీసుకొని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఫ్లై ఓవర్ నిర్మాణం పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీ నారాయణగౌడ్, రఘునాథ్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, జనార్దన్ రెడ్డి, నాగరాజు, ఒ. వెంకటేష్, అక్బర్ ఖాన్, పోషయ్య, భవాని, అనిల్, నరేందర్ బల్లా, యూసఫ్, రాజశేఖర్ రెడ్డి, సందీప్ రెడ్డి, యశ్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఆకాంక్ష నెరవేర్చాలి

పాలకుర్తి, జనవరి 27(జనంసాక్షి)

తెలంగాణ ఉద్యమ కారుల ఆకాంక్షను ప్రభుత్వం నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్ష వేదిక రాష్ట్ర చైర్మన్ గోదుమల కుమారస్వామి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని గౌడ సహకార సంఘం భవనంలో ఆ వేదిక మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కుమారస్వామి మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాటు కోసం పార్టీలకతీతంగా సబ్బండ కులాలు ఉద్యమాలు చేశారని అన్నారు. రాష్ట్రం ఏర్పడింది కానీ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్ల కాలంలో అప్పటి ప్రభుత్వం ఉద్యమ కారులను పక్కను పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మంది ఉద్యమకారులు పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నారని, జైలుకు సైతం వెళ్లారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ కేసులు ఎత్తివేస్తామని ఉద్యమకారులకు పలు మార్లు చెప్పి, కేసులను ఎత్తివేసిన దాఖలాలు లేవని విమర్శించారు. కేసులతో ఉద్యమకారులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ఇప్పటి ప్రభుత్వం ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు, డిమాండ్ చేశారు. ఉద్యమ కారులందరికి ప్రభుత్వం గుర్తింపు కార్డులివ్వాలని కోరారు. ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు పార్టీలకతీతకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు నారగోని సోమయ్య, చీటూరి రాంచంద్రు గాదెపాక యాకయ్య, ఐరోన్ల మార్కెం దయ్య, రాములు నాయక్. అనుముల అంజీరావు, ఎడవెల్లి దండయ్య, గుగ్గిల్ల ఎల్లయ్య, పూజారి యాకయ్య, కడారి సోమన్న, శ్రీనివాస్, మాచెర్ల దత్తు, కట్కమోజు ఉపేంద్రాచారి. ఆరూరి రమేష్, కూటికంటి సోమయ్య, పొలాస సోమయ్య ఉన్నారు.

పెద్దపేట కేంద్రంగా భారీగా నకిలీ పత్తి విత్తనాల దందా

రాత్రికి రాత్రి గ్రామానికి నకిలీపత్తి విత్తనాలు

భీమిని, జనవరి 27 (జనంసాక్షి)

: మంచిర్యాల జిల్లా భీమిని మండలంలోని పలు గ్రామాల్లో నకిలీ పత్తి విత్తనాల దందా షురువైంది పత్తి పంట ఎరటం ముగియ కుండానే దళారులు నకిలీ పత్తి విత్తనాల దిగుమతిని షురూ చేశారు. పెద్ద పేట కేంద్రంగా ఈ దందా పెద్ద ఎత్తున వారం రోజుల క్రితమే ప్రారంభమైనట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. గతంలో గుంటూరుకు చెందిన శివయ్య అనే వ్యక్తి నకిలీ పత్తి విత్తనాలను ఏజెంట్లను నియమించుకొని విక్రయాలు జరుపుకునే వాడు. ఇతను మూడు నెలల క్రితం మందమర్రి లో జరిగిన రహదారి ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. దీంతో ఏజెంట్లు గా పనిచేసిన కొంతమంది వ్యక్తులు ఈ దందాను ఇంకా కొనసాగిస్తున్నారు. గతంలో ఈ ఏజెంట్ల పై కేసులు కూడా నమోదైన దాఖలాలు ఉన్నాయి. 15 రోజుల క్రితమే భీమిని ఎస్ఐ కొంతమంది నకిలీ విత్తన ఏజెంట్లను తహసిల్దార్ ముందు బైండోవర్ చేసి వ్యక్తిగత పూచికత్తుపై వదిలివేసిన విషయం విదితమే. ఓవైపు పోలీసులు నిగా ఉంచుతున్నప్పటికీ పోలీసుల కళ్ళుగప్పి ఏజెంట్లు ఈ దందాను యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. నకిలీ విత్తనాలను ఎందుకు విక్రయిస్తున్నారని అడిగితే మాకు పోలీసుల అండ ఉందని మీరేం చేసుకుంటారో చేసుకోండి అని తెగేసి చెబుతున్నారు. 'మా దగ్గర తీసుకోకపోతే నేను పోలీసులకు సమాచారం ఇస్తాం' అని కూడా బెదిరిస్తున్నట్లు సమాచారం. మరి పోలీసులు వీళ్ళు చెబుతున్న మాటలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. ఈ దందా భీమిని మండలంలోని పెద్దపేట వడాల ఖర్జిబింపూర్ చెన్నాపూర్ మల్లిడి దుబ్బగూడం వెంకటాపూర్ తోపాటు కన్నెపల్లిలోని జనకాపూర్ టేకులపల్లి కన్నెపల్లి రెబ్బెన తదితర గ్రామాల్లో కూడా ఈ దందా శురువైనట్లుగా తెలుస్తోంది. ఈ విత్తనాలను ఆంధ్రలోని గుజరాత్ నుండి నుండి నకిలీ పత్తి విత్తనాలైన విత్తనాలను తీసుకొని వచ్చి ఏజెంట్లకు అందజేయడానికి తాండూర్ ఐబి లో ఒక వ్యక్తి ఈ దందాను నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ విత్తనాలను ఆరు నుంచి 800 కు ఆంధ్ర నుంచి కొనుగోలు చేసుకోనివచ్చి 2500 నుండి 3 వేలకు కిలో చొప్పున విక్రయిస్తూ రైతులకు అంటగట్టి నిలువునాముచుతున్నారు. ఇంత జరుగుతున్న వ్యవసాయ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదని విమర్శలు గత నుంచి ఉన్నాయి. ఈసారైనా సరైనిఘా ఉంచి గ్లైసిల్ విత్తనాలతో పాటు గ్లైఫోసిట్ ద్రావణాన్ని సరఫరా చేయకుండా చర్యలు చేపట్టి రైతులు నష్టపోకుండా చూడాల్సిన అవసరం అవశ్యకత ఎంతైనా ఉంది. మరి ఇటు పోలీసులు కానీ అటు వ్యవసాయ శాఖ అధికారులు కానీ చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచి చూడాలి మరి!

పాలాలులోకి వెళ్లే దారిని మూసిన సింగరేణి

దారిని వెంటనే తెరవాలని రామారావుపేట గ్రామస్తుల నిరసన

జైపూర్, జనవరి 27 (జనంసాక్షి)

: సింగరేణి అభివృద్ధి కోసం తమ విలువైన భూములను కోల్పోయి సింగరేణికి సహకరించినప్పటికీ సింగరేణి యాజమాన్యం మాత్రం గ్రామాల్లోని పొలాల్లోకి వెళ్లడానికి దారి లేకుండా మూసివేశారని రామారావు పేట గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం రామారావు పేట గ్రామస్తులు పొలాలు,చేన్లకు, గోదావరి కి వెళ్లే దారిని మూయవద్దని శ్రీరాంపూర్ సింగరేణి జియం ఇందారం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు ఆఫీసర్ లకు పలు మార్లు వినతి పత్రాలు అందజేశారు. వినతి పత్రాన్ని అందజేసిన సందర్భగా సింగరేణి అధికారులు ఆ దారిని బంద్ చెయ్యమని హామీ ఇచ్చిన ప్రాజెక్ట్ ఆఫీసర్ రాత్రికి రాత్రే దొంగతనంగా, నిరంకుశంగా పాత రోడ్డును మట్టి పోయించి మూసివేశారని గ్రామస్తులు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం ఇవ్వకుండా దారిని మూసి వేయడంతో ఆగ్రహించిన రైతులు ఓసి నుంచి మట్టి తీసుకెళ్తున్న లారీలను అడ్డుకుని తీవ్ర నిరసన తెలిపారు. జైపూర్ ఎసై శ్రీరాంపూర్ సీఐ సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్థులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నం చేశారు, గ్రామస్తులు మాట్లాడుతూ... ఇప్పటికే శ్రీరాంపూర్ ఓసీపీ, ఇందారం ఓసిపి బాంబు బ్లాస్ట్ లతో ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయి,ఓసీ నుంచి వచ్చే దుమ్ముతో మా గ్రామస్థులు పలు అనారోగ్యానికి గురవుతున్నారు, చాలా మంది ఇక్కడ ఉండలేకపోతున్నారు. మీ సింగరేణి వల్ల మా గ్రామం మొత్తం నాశనం అవుతున్నా ఓర్చుకుని బతుకుతున్నాం అయినా కూడా సింగరేణి మా రైతులను ఇబ్బంది పెట్టేలా పొలాలకు, చేన్లకు వెళ్ళే దారిని మూసివే యడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మూసివేసిన రోడ్డును వెంటనే తెరవాలని లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పెద్దల బాపు, రైతులు నామాల నాగరాజు, నామాల మునీందర్, రాజన్న, గోలి వెంకటేష్, అగ్గ రవీందర్,పూదరి సత్తన్న,కొంతం మధుకర్, గోలి కుమార్,జి సత్యనారాయణ, దుర్గం రాజ్ కుమార్ రైతులు పాల్గొన్నారు.

మిర్చి పంట సాగుపై సీడీ ఆవిష్కరణ

వరంగల్ ప్రతినిధి, జనవరి 27(జనంసాక్షి)

: వరంగల్ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో మిర్చి పంట సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించుటకు పాటల రూపంలో రూపొందించిన సిడి ని ఖిలా వరంగల్ లోని కుష్మహల్ గణతంత్ర దినోత్సవం వేడుకల వేదిక వద్ద జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆవిష్కరించారు. డీసీపీ రవీందర్, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి, డిపిఆర్ఓ అయ్యూబ్ అలీ, అడిషనల్ పిఆర్ఓ ప్రేమలత, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ సంగీత లక్ష్మి, తెలంగాణ సాంస్కృతిక సారథి బృంద నాయకులు నెల్లుట్ల సుమన్, జూపాక శివ, టి ఎస్ ఎస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడారంగంలో రాణించాలి

సాఫ్ట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ శోభన్ బాబు

నేరెడిగొండ, జనవరి 27(జనంసాక్షి)

: క్రీడారంగంలో విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలని సాఫ్ట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ శోభన్ బాబు అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీస్ స్కూల్ మైదానంలో ఆదివారం మహిళలు, పురుషుల సాఫ్ట్ బాల్ సీనియర్ క్రీడాకారుల శిక్షణా శిబిరానికి ముఖ్య అతిథిగా విచ్చేయిసన ఆయన తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అభిషేక్ గౌడ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ మెదక్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అజయ్ లతో పాల్గొని క్రీడాకారులకు మ్యాచ్ బాల్ ను ఇచ్చారు.జిల్లా అధ్యక్షులు బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ చరవాణిలో మాట్లాడుతూ జాతీయ స్థాయిలోనే కాకుండా ఇంటర్ నేషనల్ లేవలో ఆడాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్ జిల్లా ఉపాధ్యక్షులు గోదం జ్యోతిరామ్ నిర్వాహక కార్యదర్శి అఖిల్ పిడిఅసోసియేషన్ సభ్యులు రాదేశ్యం నాగరాజ్ లు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించాలి

మహబూబాబాద్ అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

మహబూబాబాద్ బ్యూరో, జనవరి 27(జనం సాక్షి):

గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించాలని మహబూబాబాద్ అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మ చారిలతో కలిసి సంబంధిత జిల్లా అధికారులతో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి అధికారులు తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులలో కేసముద్రం మండలం కల్వల గ్రామంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో త్రాగునీరు లేక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని పాఠశాలకు బోర్ సాంక్షన్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. కేసముద్రం మండలం తౌర్య తండా కు చెందిన వాంకుడొతు గణేష్ కారోబార్ గా గత మూడు సంవత్సరాలుగా తాత్కాలికంగా పనిచేయుచున్నానని గత ఎనిమిది నెలలుగా వేతనం అందక కుటుంబం గడవడం ఇబ్బందిగా ఉందని పాత బకాయిలతో పాటుగా నెలవారీ వేతనాన్ని సమయానికి ఇప్పించేందుకు దరఖాస్తు చేసుకున్నారు. గార్ల మండలం సీతంపేట కు చెందిన గుమ్మడి రాజు తన అన్న గుమ్మడి మహేష్ స్థానిక మండల ఎం.పి.డి.ఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేస్తూ ఈ మధ్య కాలంలో అకారణంగా మరణించాడని తన తల్లిదండ్రులు తనపై ఆధారపడినందిన అట్టి ఉద్యోగం తనకు ఇప్పించాలని కోరారు.

ఈ విధంగా వివిధ సమస్యలపై మొత్తం 165 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ పిడి మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, బీసి వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహ స్వామి, సిపివో సుబ్బారావు, ఏ.డి సర్వే ల్యాండ్ అధికారి నరసింహా మూర్తి,డి.పి.ఓ హరిప్రసాద్,గ్రాండ్ వాటర్ అధికారి వేముల సురేష్, డి.ఎస్.ఓ ప్రేమ్ కుమార్, డి.ఎం సివిల్ సప్లై అధికారి కృష్ణ వేణి, ఎల్.డి.యం ఆర్.సత్యనారాయణ మూర్తి, అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుండా రైతులకు మోసం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య

స్టేషన్ ఘన్పూర్, జనవరి 27 , (జనం సాక్షి) :

ఎన్నికల సందర్భంగా 6 గ్యారంటీలు అమలు చేస్తామ ని చెప్పి రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని తెలం గాణ రాష్ట్ర తొలి ఉపముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆరోపించారు. డివిజన్ కేంద్రంలోని బాబు జగ్జీవన్ రావ్ విగ్రహం ముందు బీఆర్ఎస్ పార్టీ మండలకమిటీ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ గౌడ్ అధ్యక్షతన నిరసన దీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతులకు ద్రోహంచేసిందని,ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేయడమే కాకుండా, వారి సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని, రైతు రుణ మాఫీ పూర్తిగా అమలు చేయలేకపోవడం, వాగ్దానాలను కేవలం ప్రచార హెూదాలో పరిమితం చేయడం కాంగ్రెస్ అసమర్థతకు నిదర్శనంగా నిలుస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎడవెల్లి కృష్ణారెడ్డి,జెడ్పీస్టాండింగ్ కమిటీ చైర్మన్ మాజీ చైర్మన్ మారపాక రవి,మండల పార్టీ అధ్యక్షుడు మాచ ర్ల గణేష్ గౌడ్ తదితరులుపాల్గొన్నారు.

పథకాల అమలులో ప్రత్యేక శ్రద్ధ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):

పథకాల అమలులో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు జారీ ప్రక్రియ విజయవంతంగా అమలు చేయడం జరుగుతుందని ఇందులో భాగస్వాములై గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఉన్న ప్రభుత్వ యంత్రాంగం సేవలను కొనియాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న పథకాలకు లబ్ధిదారుల ఎంపికకై ఈ నెల 16 నుండి 20 వరకు క్షేత్రస్థాయి విచారణ, 21 నుండి 24 వరకు గ్రామసభలు నిర్వహణలో ప్రజల సహకారం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకాలను విజయవంతంగా అమలు చేయడానికి అధికారుల కృషి, ప్రతిష్టాత్మక పనితీరును ప్రశంసించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో ప్రభుత్వ ఆశయం మేరకు ప్రతి ఒక్కరి కృషి ఉంటుందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన పేదలకు అందించడంలో స్ఫూర్తితో పనిచేయాలని ఆయన సూచించారు. సంక్షేమ కార్యక్రమాలకు లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికి అందచేయుటలో ఒక టీముగా ప్రతి ఒక్కరు ఐకమత్యంతో వ్యవహరించాలని పేర్కొన్నారు. ఉద్యోగి సేవాకాలంలో పేదలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించడంలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ప్రజల మన్ననలు పొందాలని, అదే ప్రతి ఉద్యోగికి ఆశీర్వాదమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన 14 మంది బాధితుల ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ బాధితుల సమస్యల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు తీసుకొవాలని సంబధిత పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే చట్టవ్యతిరేకమైన చర్యలు చేస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని, బాధితుల ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరచాలని ఎస్పి కిరణ్ ఖరే పేర్కొన్నారు.

మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

పరకాల, జనవరి 27 (జనం సాక్షి):

మహిళా సంఘాల గ్రూపులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలనే గొప్ప ఆలోచనతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతుందని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. సోమవారం రోజున సంఘం గీసుకొండ మండలాల్లో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు.ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రభుత్వ భూములను గుర్తించి వాటిలో సోలార్ సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.సోలార్ విద్యుత్ ప్లాంట్ ల ఏర్పాటులో స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఇందుకోసం ఆర్థిక చేయూతను అందిస్తుందని అన్నారు.మహిళా సంఘాల గ్రూపులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలనే గొప్ప ఆలోచనతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు. సంగెం లో మినీ ఇండస్ట్రియల్ పార్క్ లో ఏర్పాటు చేసి తద్వారా మహిళా గ్రూప్ సభ్యులకు ట్రైనింగ్ ఇప్పించి, మార్కెటింగ్ నైపుణ్యాలు నేర్పించి, వారు తయారు చేసిన ఉత్పత్తులను స్థానికంగా రాష్ట్రవ్యాప్తంగా విక్రయించుటకు తగుప్రణాళికలు చేస్తున్నమన్నారు.

సరస్వతి నది పుష్కరాలకు
రూ. 25 కోట్లు మంజూరు

- సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ ధన్యవాదాలు
- మే 15 నుంచి 26 వరకు పుష్కరాలు

హైదరాబాద్ (జనంసాక్షి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం క్షేత్రంలో ఈ యేడాది మే 15 నుంచి 26 వరకు నిర్వహించనున్న సరస్వతి నది పుష్కరాలకు రూ. 25 కోట్లు మంజూరు చేసినందుగాను అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సరస్వతీ నది పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు వచ్చే పరిస్థితుల నేపథ్యంలో భక్తులకు మౌలిక సౌకర్యాల కల్పనతో పాటు, స్నాన ఘట్టాల నిర్మాణం, రోడ్ల విస్తరణ, డ్రైనేజీల నిర్మాణం తదితర పనులను పకడ్బందీగా చేపట్టాలని మంత్రి సురేఖ దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్ లను ఆదేశించారు. అన్నిశాఖలు సమన్వయంతో పనులు చేపట్టి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలని మంత్రి సురేఖ సూచించారు. రాష్ట్ర ఏర్పాటుకు పూర్వం 2013లో వచ్చిన సరస్వతీ నది పుష్కరాలను కాంగ్రెస్ ప్రభుత్వమే నిర్వహించిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. స్వరాష్ట్రంలో గతంలో కంటే మిన్నగా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా, అత్యంత వైభవోపేతంగా సరస్వతీ నది పుష్కరాలను నిర్వహిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దు
మా గ్రామాలే మాకు ముద్దు !

- ప్రభుత్వం దిగిరాకుంటే మరింత ఉద్ధృతం చేస్తాం
- కలెక్టర్ వచ్చి లిఖిత పూర్వక హామీ ఇవ్వాలని రైతుల పట్టు

రాజోలి, జనవరి 27 (జనంసాక్షి) : జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామ సమీపంలోని ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేస్తున్న రిలే నిరాహార దీక్ష ఐదవరోజు చేరుకొంది. కంపెనీ నుంచి వచ్చే కాలుష్యం, వ్యర్థాలతో క్యాన్సర్‌తోపాటు శ్వాసకోశ సంబంధిత రోగాలు వచ్చే అవకాశం ఉన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. పచ్చని భూములు బీళ్లుగా మారడంతోపాటు సమీపంలోని తుంగభద్ర జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముందే ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని, కానీ ఏకపక్ష నిర్ణయాలతో నిర్మిస్తున్నారని ఆరోపించారు. ' ఎన్నికలప్పుడే మేం గుర్తొస్తం..మూడు నెలల నుంచి ఆందోళన చేస్తున్నా పట్టించుకున్న నాథుడే లేడు ' అని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా పరిసర గ్రామాల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని ఫ్యాక్టరీ నిర్మాణ అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రిలే నిరాహార దీక్షలో మాజీ సర్పంచ్ జయరామిరెడ్డి, నారాయణ, ఖలీల్, శివ, హనుమంతు, భూషణం, చిన్నయ్య ,డీకే రామ్, లక్ష్మణరావు, శాంత కుమారి, భీమమ్మ,మల్లేష్ , ఈదన్న, పెద్దయ్య, పక్కిరన్న, మహేష్, తిమ్మప్ప, ఎర్రన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో తిరుగుబాటు

- గ్రామసభల్లో నిలదీసినా కప్పిపుచ్చుకునే యత్నం
- హామీల అమలుకు ఏడాదైనా పూర్తి చేయని వైనం
- మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు

నిజామాబాద్, జనవరి 27 (జనంసాక్షి) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై గ్రామసభల సాక్షిగా కాంగ్రెస్ సర్కారును ప్రజలు అనేకచోట్ల నిలదీసారని, ప్రజలకు సమాధానం చెప్పే స్థితిలో పాలకులు లేరని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డుల సర్కస్ ఫీట్లు, లోకల్ బాడీ ఓట్ల కోసం కాంగ్రెస్ పడుతున్న పాట్లు అని ఎద్దేవా చేశారు. కేవలం స్థానిక ఎన్నికల్లో పట్టుకోసం చేస్తున్న కసరత్తు తప్ప ప్రజల మేలుకోరి చేసే పనులు మాత్రం కావన్నారు. అమలు కాని ఆరు గ్యారంటీలే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది అని పేర్కొన్నారు. గ్రామసభల్లో ప్రజలు తిరగబడు తున్నారని తెలిసి కూడా బుకాయించారని అన్నారు. ఏడాది దాటినా ఆరు గ్యారంటీలకే గతి లేదని, ఇక ఇండ్లు, రేషన్ కార్డు ఇస్తామంటే నమ్మేదెవరని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల మంజూరు పేరుతో నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రజల తిరుగుబాటు కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనకు నిలువెత్తు నిదర్శనమని వేముల పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలకే ఉప్పు పాతరేసి కొత్తగా ఈ డ్రామాలేమిటని ప్రజలు నిలదీస్తున్నారని తెలిపారు. అక్కడక్కడ హామీల అమలుపై ఎమ్మెల్యేలను ప్రజలు నిలబెట్టి అడిగారని అన్నారు. ఇండ్లు ఎప్పుడు కట్టిస్తారంటూ మహిళలు తిరగబడ్డారని గుర్తుచేశారు. అబద్దాలు చెబుతూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలవాలని మోసాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ జీరో కాక తప్పదన్నారు. గ్రామసభల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే లేరని, మంత్రులు పత్తా లేకుండా పోయారని, ఎమ్మెల్యేలను గ్రామాలకు రానివ్వడం లేదన్నారు. హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరగలేరన్నారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై ప్రజలు తిరగబడ్డా రని వేముల అన్నారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సహా కాంగ్రెస్ నేతలు పుట్టి పెరిగిన గ్రామాల్లో ఎన్నికల హామీలు నూరు శాతం అమలు జరిగాయని నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని, లేకుంటే కాంగ్రెస్ నేతలు రాజకీయాల నుం చి తప్పుకుంటారా అని సవాల్ విసిరారు. హామీల అమలులో ప్రజలకు సర్కారు వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలను మండలానికి ఒక గ్రామం చొప్పున, జిల్లాలోని 35 మండలాల్లో కేవలం 35 గ్రామాల్లో ప్రారంభించారని తెలిపారు. ఏ ఊరికైనా వెళ్లి, నూరుశాతం హామీలు అమలవుతున్నాయని ప్రజలు చెబితే రాజకీయాలను వదిలేస్తానని, లేకుంటే కాంగ్రెస్ నాయకులు, రాజకీయాలు వదిలేసి ముక్కు నేలకు రాస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలవి తుగ్లక్ రాజకీయాలని ఆయ న విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల వీరంగాలు, అక్రమ కేసులకు బీఆర్ఎస్ భయపడే రకం కాదన్నారు. తాము పోరాడుతూనే ఉంటామని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూనే ఉంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రజలను మోసగిస్తున్నదని, అందుకే ఎక్కడ చూసినా జనాగ్రహజ్వాలలే కనిపిస్తున్నాయన్నారు. ఇది ప్రజాపాలన కాదని, తుగ్లక్ పాలన అని విమర్శించారు. ఎన్నికల హామీల అమలులో ఘోర వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికే రోజుకో నాటకం వేస్తున్నారని మండిపడ్డారు. పథకాల అమలుకు సంక్రాంతి పోయిందని, ఇప్పుడు శివరాత్రికి అంటున్నారని ఎద్దేవా చేశారు.

రాజకీయంగా వైరుధ్యంతో పార్టీలో అసంతృప్తి

- జాడ లేని మార్కెట్ కమిటీల నియామకం

జగిత్యాల, జనవరి27 (జనంసాక్షి) : నేతల మధ్య సయోధ్య లేకపోవడంతో పనులు సాగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీనికితోడు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి, ఎమ్మెల్యే సంజయ్‌కు పొసగకపోవడంతో పార్టీలో ఏకాభిప్రయం కానరావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఏడాది గడిచినా జిల్లాస్థాయి నామినేటెడ్ పోస్టు భర్తీకాకపోవడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఇష్టారాజ్యంగా పాలన సాగుతుండడంతో అటు ప్రజలు, ఇటు అధికారులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. జగిత్యాల నియోజకవర్గ పరిధిలో రెండు మార్కెట్ కమిటీలు ఉండగా, రెండింటికి పాలకవర్గాలను ఇంత వరకు నియమించలేదు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడంతో రాజకీయాలన్నీ తారుమారు అయిపోయాయి. ఎమ్మెల్సీగా కొనసాగుతున్న జీవన్‌రెడ్డి జగిత్యాల, రాయికల్ మార్కెట్ కమిటీ చైర్మన్లతో పాటు, పాలకవర్గానికి కొందరు కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకుల పేర్లను ఏడాది క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదించారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మరికొందరి పేర్లను ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దీంతో చిక్కుల్లో పడ్డ అధికారులు ఎవరినీ ఎంపిక చేయకుండా వదిలిపెట్టారు. వడ్ల కొనుగోలుకు సంబంధించి రెండు సీజన్లు పూర్తయి, మూడో సీజన్ ప్రారంభమైనా ఇంకా కమిటీల ఏర్పాటు జరగకపోవడంపై రైతులు, కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎంపిక విషయంలోనూ తీవ్రమైన జాప్యం నెలకొన్నది. జిల్లాస్థాయి పోస్టు కావడంతో మూడు నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పదవిని ఆశిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ధర్మపురి నియోజకవర్గానికి చెందిన బ్రాహ్మణ కమ్యూనిటీకి చెందిన ఒక సీనియర్ నాయకుడికి చైర్మన్ పోస్టు కట్టబెట్టాలని ప్రభుత్వ విప్ ప్రయత్నించారు. అలాగే, కోరుట్ల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు సైతం అదే పదవిని ఆశిస్తూ వచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని దళిత వర్గానికి చెందిన సీనియర్ కార్యకర్తకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. అయితే, సదరు దళిత నాయకుడికి పదవి ఇవ్వడం ఇష్టంలేని ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం నుంచి కొనసాగుతున్న మరో నాయకుడి పేరును ప్రతిపాదిస్తూ సిఫారస్ చేశారు. దీంతో చైర్మన్ ఎంపికలోనూ ప్రతిష్టంభన ఏర్పడింది. గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి భర్తీ విషయంలో చక్రం తిప్పిన జగిత్యాల ఎమ్మెల్యే తన రాజకీయ ప్రత్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నిర్ణయాన్ని విజయవంతంగా అడ్డుకున్నట్లు తెలుస్తోంది. కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జితో ఉన్న బంధుత్వాన్ని ఆసరాగా చేసుకొని, చొప్పదండి ఎమ్మెల్యే, ధర్మపురి ఎమ్మెల్యేను ఒప్పించి, ఎమ్మెల్యే ప్రతిపాదించిన దళిత వర్గానికి చెందిన నాయకుడికి కాకుండా, తన సామాజిక వర్గమైన కోరుట్ల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడి పేరును ప్రతిపాదించినట్లుగా సమాచారం.

సూర్యాపేటలో మరో పరువు హత్య

సూర్యాపేట, జనవరి 27 (జనంసాక్షి) : సూర్యాపేటలోని మామిల్లగడ్డకు చెందిన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి హత్యకు హత్యకు గురయ్యాడు. పిల్లలమర్రి సమీపంలోని మూసీ కాలవ కట్టపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పిల్లల మర్రికి చెందిన నవీన్, కృష్ణ స్నేహితులు. తరచూ పిల్లలమర్రిలోని నవీన్ ఇంటికి వస్తూ పోతున్న కృష్ణ నవీన్ సోదరి భార్గవిని ప్రేమించాడు. వీరి ప్రేమను భార్గవి తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో ఆరు నెలల క్రితం భార్గవిని కృష్ణ కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నాడు. భార్గవి, కృష్ణ ఇద్దరూ సూర్యాపేటలో కాపురం పెట్టాడు. ప్రేమ పెళ్లిని నిరాకరించిన భార్గవి తల్లిదండ్రులు వారిని విడదీసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కులాంతర వివాహం చేసుకున్న బంటిపై భార్గవి సోదరుడు నవీన్ కక్ష పెంచుకున్నాడు. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో మహేష్ అనే మిత్రుడి నుంచి ఫోన్ కాల్ అందుకున్న కృష్ణ భార్యకు ఫోన్ ఇచ్చి బయటకు వెళ్లాడు. రాత్రి లేట్ అయినా కృష్ణ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. సూర్యాపేట జనగాం క్రాస్ రోడ్ నుండి పిల్లల మర్రికి వెళ్లే మూసి కెనాల్ కట్టపై కృష్ణ మృతదేహం పడి ఉంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో కృష్ణ బంధువులు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. దుండగులు మృతుడి మెడకు ఉరి వేసి చంపినట్లు గుర్తులు కన్పిస్తున్నాయి. మృతుడి ఒంటిపై కమిలిన గాయాలున్నాయి. నిందితులను గుర్తించేందుకు పోలీసులు గాలిస్తున్నారు. భార్గవి సోదరుడు కోట్ల నవీన్ హత్యకు పాల్పడ్డట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు కృష్ణ పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే ఈ హత్యకు ప్రేమ వివాహమే కారణమా, లేక పాత కక్షలే కారణమా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చైతన్య విద్యాసంస్థలకు భారీ షాక్

హైదరాబాద్, జనవరి 27 (జనంసాక్షి) : మాదాపూర్‌లోని శ్రీచైతన్య విద్యాసంస్థల సెంట్రల్ కిచెన్ లైసెన్స్‌ను ఆహార భద్రతా విభాగం అధికారులు రద్దు చేశారు. గత శు క్రవారం శ్రీచైతన్య కిచెన్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేల మందికి భోజనం తయారు చేస్తున్న వంటగదిలో పాడైపోయిన ఆహార పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 125 కిలోల గడువు తీరిన ఆహార పదార్థాలను అధికారులు సీజ్ చేశారు. బియ్యం, కూరగాయలు, పప్పుదినుసులను అపరిశుభ్ర వాతావరణంలో స్టోర్ చేస్తున్నట్టు గుర్తించారు. కిచెన్, స్టోర్ రూమ్‌లో బొద్దింకలు, ఎలుకలు తిరుగుతున్నట్టు తేల్చారు. ఈ వంటగది నుంచే గ్రేటర్ హైదరాబాద్‌లోని చైతన్య కాలేజీల హాస్టళ్లకు ఆహారం సరఫరా చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఇక్కడ వండే భోజనాన్నే హాస్టళ్లలోని వేల మంది విద్యార్థులకు రోజూ అందజేస్తున్నట్లు నిర్ధారించారు. కిచెన్ మొత్తం అపరిశుభ్రంగా ఉండడంపై ఆహార భద్రతా విభాగం అధికారులు యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కిచెన్‌ను సీజ్ చేయాలని, ఫుడ్ లైసెన్స్ రద్దు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఈ మేరకు మాదాపూర్(ఖానామెట్)లోని చైతన్య విద్యాసంస్థల సెంట్రల్ కిచెన్ లైసెన్స్ రద్దు చేస్తూ ఉన్నతాధికారులు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. వంటగదిలో ఆహార తయారీని తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. ఉత్తర్వులు ఉల్లంఘించి ఆహారం తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తెలంగాణ యువ ప్రతిభాశాలి బూర్ల కళ్యాణ్‌కు
విలేజ్ ఇన్నోవేషన్ అవార్డు

స్టేషన్ ఘన్పూర్ , జనవరి 27, (జనం సాక్షి) : మన తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ ప్రతి ఏటా ప్రత్యేకమైన ఆవిష్కరణల కోసం కృషి చేసే యువ ప్రతిభాశాలులను గుర్తిస్తూ 'విలేజ్ ఇన్నోవేషన్ అవార్డు' అందజేస్తుంది. ఈ ఏడాది ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు సొంతం చేసుకున్న మన యువ ప్రతిభాశాలి మండలంలోని చాగల్లు గ్రామానికి చెందిన బూర్ల బండి కుమార్ కుమారుడు బూర్ల కళ్యాణ్ ముదిరాజ్ విలేజ్ ఇన్నోవేషన్ అవార్డు గెలుచుకున్నారు. కాలేజ్ కనెక్ట్ పేరుతో రూపొందించిన డిజిటల్ ప్లాట్‌ఫాం విద్యార్థుల కు విద్యకు సంబంధించిన అన్నిఅవసరాలను తీర్చేలా ప్రత్యేకంగా రూపొందించబడింది. ఈ ప్లాట్‌ఫాంలో పుస్తకాలు కొనుగోలు చేయడం, విక్రయించడం, మెంటర్ ల సహాయం పొందడం,స్టడీ గ్రూప్స్‌తో జట్టు అభ్యాసం చేయడం వంటి అనేక ఫీచర్లు ఉన్నాయి. విద్యార్థులకు ఈ ప్లాట్‌ఫాం ఎంతో ఉపయోగకరంగా మారుతుందని గుర్తించి బూర్ల కళ్యాణ్ కు తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఈ అవార్డును ప్రదానం చేసింది. ఈ అవార్డుతో మరిం త ఉత్సాహం పొందిన కళ్యాణ్ తమ కాలేజ్ కనెక్ట్ ప్లాట్‌ఫాంను మరింత అభివృద్ధి చేసి ఇంకా ఎక్కువ మందికి ఉపయోగపడేలా చేయాలని లక్ష్యంగా పెట్టు కున్నారు. విద్యార్థులకు సాంకేతికతను చేరువ చేసి, వారి చదువు ప్రయాణాన్ని సులభతరం చేయడమే ఈ ప్రయత్నం లక్ష్యం అని కళ్యాణ్ అన్నారు.

అమల్లోకి కామన్ డైట్ మెనూ

- రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి డైరెక్టర్ హరిచందన
- గురుకుల బాలికల పాఠశాల కళాశాల సందర్శన

నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి): రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహ విద్యార్థుల కోసం చక్కటి కామన్ డైట్ మెనూ అమల్లోకి తెచ్చిందని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి డైరెక్టర్ హరిచందన అన్నారు. సీనియర్ మహిళా ఐఏఎస్ అధికారులు బాలికల వసతి గృహాల్లో బస చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చేసిన సూచన మేరకు సోమవారం సాయంత్రం నారాయణపేట తెలంగాణ సాంఘిక సంక్షమా గురుకుల బాలికల పాఠశాల /కళాశాలను హరి చందన సందర్శించారు. గురుకుల పాఠశాల విద్యార్థినులతో మాట్లాడారు.భోజనం బాగుంటుందా,అందరికీ పుస్తకాలు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.గురుకులంలో నర్సు ఉందా,ఏవైద్య పరీక్షలు చేస్తారని అడిగారు.అందరూ బాగా తినాలని, పాలు రాగి జావా తీసుకోవాలని సూచించారు.పదో తరగతి విద్యార్థులు తమకు గ్రౌండ్ కావాలని కోరారు. అందుకు ఆమె అనుకూలంగా స్పందించారు. తర్వాత గురుకుల విద్యార్థినులు పిరమిడ్ ఆకృతుల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో కలిసి తిలకించారు. చక్కటి ప్రదర్శన అని ఆ విద్యార్థినులను వారు అభినందించారు.అనంతరం పాఠశాల డైనింగ్ హాల్ కు వెళ్ళి విద్యార్థినులకు వండిన భోజనాన్ని, కూరగాయలను పరిశీలించి, మెను ప్రకారమే వంట చేశారా అని ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించారు. మెనూ కచ్చితంగా అమలు చేయాలని హరిచందన ఆదేశించారు. విద్యార్థిలతో పాటు హరిచందన, సిక్తా పట్నాయక్ లు క్యూ లో నిలబడి భోజన్నాని వడ్డించుకుని వారితోనే కలిసి భోజనం చేశారు.అక్కడి విద్యార్థిలతో మాట్లాడుతూ భోజనం ఎలా ఉంటుందని ఆరా తీశారు.తర్వాత గురుకుల పాఠశాల ఆవరణలోనే ఉన్న కస్తూర్బా పాఠశాలను కూడా వారు సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.ఏమైనా సమస్యలు ఉంటే ఇక్కడి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీ ఈ ఓ గోవిందరాజులు దృష్టికి తీసుకురావాలని హరిచందన విద్యార్థినులకు సూచించారు.వసతి గృహాలకు అధికారులు వస్తుంటారా? లేదా అని ఆమె ప్రశ్నించడంతో వస్తుంటారని విద్యార్థినులు చెప్పారు.అన్ని సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయులు ఉన్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం హరిచందన మీడియా తో మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థుల కోసం ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. ఇందులో భాగంగానే వసతి గృహాల్లో ఉన్న సమస్యలు, స్థితిగతులు పరిశీలించడానికి, కామన్ డైట్ మెనూ అమలు ఏ విధంగా జరుగుతుందో చూడటానికి, వసతి గృహాల్లో విద్య ఎలా ఉందో తెలుసుకోవడానికి సీనియర్ ఐఏఎస్ మహిళా అధికారులను బాలికల వసతి గృహాల్లో బస చేసేందుకు ప్రత్యేకంగా పంపిస్తుందని చెప్పారు. ఇక్కడంతా బాగానే ఉందని, ఏమైనా సమస్యలు తమ దృష్టికి వస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రస్తుతానికి అంతా బాగానే ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్డు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరి చందన ఇక్కడికి రావడం జరిగిందని, రెగ్యులర్ గా తాను, రెవెన్యూ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ వసతి గృహాలను విజిట్ చేస్తూనే ఉన్నామని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మీడియాకు తెలిపారు. నెలనెలా ప్రణాళిక ప్రకారం తామంతా వసతి గృహాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం 40 శాతం డైట్ చార్జీలు పెంచడం జరిగిందన్నారు. బియ్యం, కూరగాయలు, నిత్యవసర సరుకులను పరిశీలిస్తున్నామని, సీఎం ఆదేశాల మేరకు వసతి గృహాలలో రాత్రి బస కూడా చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370